www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

అమన్.. అదిరెన్

కుస్తీలో భారత్‌కు కాంస్యం
పారిస్ ఒలింపిక్స్‌లో ఆరో పతకం
పురుషుల 57 కిలోల విభాగంలో
సాధించిన అమన్ సెహ్రావత్ 11



శనివారం | 10-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 133

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి తె. 5.45 తదుపరి సప్తమి; నక్షత్రం: చిత్త తె. 5.49 తదుపరి స్వాతి; వర్జ్యం: ఉ. 11.45-1.34; దుర్ముహూర్తం: ఉ. 6.00-7.41; అమృతఘడియలు: రా. 10.35-12.24; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.40 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నిజామాబాద్ మునిసిపాలిటీలో అవినీతి కొండ

సూపరింటెండెంట్ ఇంట్లో ఏకంగా రూ.3 కోట్ల నగదు లభ్యం
బ్యాంకులో మరో కోటి.. రూ.6 కోట్ల విలువైన ఆస్తులు సీజ్
ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ ఆదేశాలతో నరేందర్ ఇంట్లో అధికారుల తనిఖీలు.. అతని బంధువుల ఇళ్లల్లో కూడా..
నోట్ల గుట్టలు చూసి ఆశ్చర్యపోయిన అధికారులు
తనిఖీలతో కార్పొరేషన్‌లోని ఉద్యోగుల్లో అలజడి 3



పట్టుబడిన నగదు, నగలతో మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్

అయ్యో పాపం.. పసికందు

2 రోజుల వయసున్న మృతశిశువును తీసుకొచ్చిన కుక్క.. వరంగల్ ఎంజీఎంలో తీవ్ర కలకలం

ఆ బిడ్డ తమ ఆసుపత్రికి చెందినది కాదన్న సూపరింటెండెంట్.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 9: ఏ తల్లి కన్న బిడ్డోగానీ.. రెండు రోజుల నవజాతి శిశును ఓ కుక్క నోటకరుచుకుని వచ్చిన ఘటన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో కలకలం సృష్టించింది. శుక్రవారం సాయంత్రం.. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ ఔట్‌పోస్టు వద్ద శిశువును నోటకరుచుకుని వస్తున్న శునకాన్ని గుర్తించిన ఔట్‌పోస్టు సిబ్బంది గట్టిగా కేకలు వేసి అదిలించారు. దీంతో ఆ కుక్క శిశువును అక్కడే వదిలేసి పారిపోయింది. అక్కడున్న సిబ్బంది పరిశీలించి.. అప్పటికే చనిపోయిన ఆ శిశువుకు ఒక కాలు లేదని గుర్తించారు. జననాంగ ప్రాంతమంతా ఛిద్రమై ఉండడంతో చలించిపోయారు. ఈ విషయం తెలుసుకున్న మట్టెవాడ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆ శిశువు ఎక్కడిది? ఎంజీఎం ఆసుపత్రిలో జన్మించిన శిశువా? లేక..ఆ కుక్క వేరొకచోట నుంచి తీసుకొచ్చిందా? బతికుండగానే దాడి చేసి, చంపి నోట కరుచుకుని వచ్చిందా? లేక.. ఎవరైనా వదిలేసిన బిడ్డను కుక్క నోటకరుచుకుని వచ్చే క్రమంలో ఆ పసికందు ప్రాణం పోయిందా? లేక ఎవరైనా ప్రాణం పోయిన శిశువును వదిలేస్తే ఆ మృతదేహాన్ని కుక్క పట్టుకొచ్చిందా? అనే కోణాల్లో

మిగతా 13వ పేజీలో...

తెలంగాణ.. ఫ్యూచర్ స్టేట్

రాష్ట్రానికి ట్యాగ్‌లైన్ ఖరారు చేసిన ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్ పునర్నిర్మాణ ప్రాజెక్టులకు పర్యాయపదమిది
రండి.. అంతా కలిసి సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం
అమెరికాలో ఏఐ రౌండ్ టేబుల్ సదస్సులో ముఖ్యమంత్రి పిలుపు
మీరు పెట్టే ప్రతి రూపాయికి మంచి ప్రతిఫలం ఉంటుందని భరోసా
అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌తో సమావేశం
హైదరాబాద్‌లో ఆమ్జెన్ రిసెర్చి సెంటర్.. 3000 మందికి కొలువులు
గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామన్న ఆరమ్ ఈక్విటీ పార్ట్‌నర్స్
పదేళ్లలో ట్రిలియన్ డాలర్ల స్థాయికి: మంత్రి శ్రీధర్ బాబు



కాలిఫోర్నియాలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. బిజినెస్' రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో పలు కంపెనీల సీఈవోలతో రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు 'ఫ్యూచర్ స్టేట్' అనే ట్యాగ్‌లైన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖరారు చేశారు. ఈ ఫ్యూచర్ స్టేట్ ప్రాజెక్టుల్లో భాగస్వామి అయ్యేందుకు ప్రముఖ టెక్ దిగ్గజం అడోబ్ సంస్థ సానుకూలత వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లో రిసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు ప్రముఖ బయో టెక్నాలజీ కంపెనీ ఆమ్జెన్ సిద్ధమైంది. ఈ ఏడాది చివర్లో ప్రారంభమయ్యే ఈ రిసెర్చి సెంటర్లో 3000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. అలాగే.. కృత్రిమమేధ ఆధారంగా పనిచేసే తదుపరి తరం గ్రీన్ డేటా సెంటర్‌ను త్వరలో హైదరాబాద్‌లో నిర్మించనున్నట్టు ఆరమ్ ఈక్విటీ పార్ట్‌నర్స్ సంస్థ ప్రకటించింది. తెలంగాణకు పెట్టుబడులు సమకూర్చేందుకు అమెరికాలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి వివిధ కంపెనీల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. డాలస్, క్యాలిఫోర్నియా తదితర పట్టణాల్లో పర్యటించి రాబోయే దశాబ్ద కాలంలో ఫ్యూచర్ స్టేట్‌గా నిలవనున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. క్యాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. బిజినెస్' రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో టెక్ యూనికార్న్ సీఈవోలను ఉద్దేశించి మాట్లాడారు. "అమెరికాలో నేను గమనించింది ఏమిటంటే.. ప్రతి రాష్ట్రానికీ ఒక ప్రత్యేక లక్ష్యం ఉంది. దాన్ని సూచించే ఒక నినాదం (ట్యాగ్ లైన్) ఉంది. న్యూయార్క్ స్టేట్‌కి 'అవుటాఫ్ మెనీ.. వన్'.. టెక్సస్‌కు 'లోన్ స్టార్ స్టేట్'.. కాలిఫోర్నియాకు 'యురేకా' అనే నినాదాలున్నాయి. ఇవి నన్ను బాగా ఆకర్షించాయి. మన దేశంలో రాష్ట్రాలకు ఇటువంటి ప్రత్యేక నినాదాల్లేవు. తెలంగాణకు

మిగతా 13వ పేజీలో...

త్వరలో తెలంగాణ సాంస్కృతిక విధానం!

అంతరించిపోతున్న కళారూపాలకు మళ్లీ జీవం
పద్మ గ్రహీతలకు ఆర్థిక సాయం
కళాకారులకు ప్రోత్సాహకాలు, పెన్షన్ల అందజేత 12
జిల్లాల్లో మినీ రవీంద్రభారతిలు
వచ్చే నెల 9న ముఖ్యమంత్రి ప్రకటించే అవకాశం

మత్తు దరిచేరనివ్వని బాల 'మిత్ర'

బడి పిల్లలపై ఏఐ నిఘా నేత్రం
మాదక ద్రవ్యాలకు అలవాటైతే పసిగట్టేలా యాప్ రూపకల్పన
20 స్కూళ్లలో పైలట్ ప్రాజెక్టు 13
టీజీ న్యాబ్, ఐటీ శాఖ కార్యాచరణ
త్వరలో పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్‌కు నో!

కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

సుప్రీంకోర్టు సూచనలపై విస్తృతంగా చర్చించాం
అంబేడ్కర్ రాజ్యాంగంలో క్రీమీలేయర్ నిబంధన లేదు
ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లన్నీ రాజ్యాంగం ప్రకారమే: అశ్విని వైష్ణవ్
ఆవాస్ యోజన కింద మూడు కోట్ల ఇళ్లకు..
ఎనిమిది కొత్త రైల్వే ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదం
ఏపీ, తెలంగాణ, ఒడిశాల్లో 173.63 కి.మీ. కొత్త లైన్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: "డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన రిజర్వేషన్లలో క్రీమీలేయర్ నిబంధన లేదు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల సుప్రీం కోర్టు చేసిన నిర్దిష్టమైన సూచనలపై క్యాబినెట్‌లో పూర్తిస్థాయిలో చర్చించాం. మేధో మథనం తర్వాత.. రాజ్యాంగంలో ఉన్న నిబంధనలకే కట్టుబడి ఉండాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది" అని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశం శుక్రవారం ఢిల్లీలో జరిగింది. అనంతరం ఆ వివరాలను వైష్ణవ్ విలేకరులకు

మిగతా 2వ పేజీలో...

ఏం ధరించాలో ఎలా చెబుతారు?

హిజాబ్‌పైనే నిషేధమా? బొట్టు, తిలకంకు కూడా వర్తిస్తుందా? 2
పేర్ల ద్వారా మతం వెల్లడవటం లేదా?
ఇటువంటి నిర్ణయాలతో విద్యార్థినుల్ని సాధికారికతవైపు ఎలా తీసుకెళ్తారు?
హిజాబ్‌పై నిషేధం విధించిన ముంబై కాలేజీని నిలదీసిన సుప్రీంకోర్టు.. స్టే






క్రికెటర్ సిరాజ్‌కు జూబ్లీహిల్స్‌లో 600 గజాల స్థలం

కేటాయిస్తూ జీవో జారీ చేసిన రెవెన్యూ అధికారులు 11

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ 7
కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
భరించలేకనే తప్పుకొన్న శివరాం?



శ్రీశైలానికి మరింత వరద

3.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో 12
4.13 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో
సాగర్ గేట్లన్నీ రెండో రోజూ ఓపెన్
3.06 లక్షల క్యూసెక్కులు దిగువకు..
ఆల్మట్టి, నారాయణపూర్.. తగ్గిన వరద

బంగ్లా అస్థిరపడితే భారత్‌కు ముప్పు!


ఈశాన్య భారతం, బెంగాల్‌పై తీవ్ర ప్రభావం.. తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్ హెచ్చరిక
మా శత్రువుకు ఆశ్రయమిస్తే భారత్‌తో కలిసి పనిచేయలేం: బీఎన్‌పీ
దాడుల నేపథ్యంలో భారత్‌లో ప్రవేశించడానికి భారీ సంఖ్యలో బంగ్లాదేశీయుల యత్నం
అడ్డుకుంటున్న బీఎస్ఎఫ్.. భారత్-బంగ్లా సరిహద్దు పర్యవేక్షణకు కమిటీ: అమిత్‌షా
హిందువులకు అండగా నిలవాలి: ఆర్ఎస్ఎస్.. మత దాడులు తగవు: ఐరాస

ఢాకా, ఆగస్టు 9: షేక్ హసీనా రాజీనామా దరిమిలా విచ్చలవిడి హింసాకాండతో బంగ్లాదేశ్‌లో అస్థిరత నెలకొంటే ఈశాన్య భారతం, పశ్చిమ బెంగాల్ తీవ్రంగా ప్రభావితమవుతాయని తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ హెచ్చరించారు. మయన్మార్ కూడా ఇందుకు మినహాయింపు కాదన్నారు. అటు హసీనాకు ఆశ్రయమిచ్చినందుకు బంగ్లా ప్రతిపక్ష పార్టీ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ కూడా భారత్‌కు వార్నింగ్ ఇచ్చింది. తమ శత్రువుకు ఆశ్రయమిస్తే భారత్-బంగ్లా మధ్య పరస్పర సహకారం కష్టమవుతుందని స్పష్టం చేసింది. గురువారం ప్రభుత్వ ప్రధాన సలహాదారు(ప్రధానికి ఉండే అధికారాలతో)గా బాధ్యతలు చేపట్టే ముందు యూనస్ ఎన్‌డీటీవీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. హసీనాను తీవ్రంగా వ్యతిరేకించే ఈయన.. తాను ప్రభుత్వ పగ్గాలు చేపట్టాక దేశంలో శాంతిభద్రతల స్థాపనే ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. హసీనా పాలనలో చాలా ఏళ్లుగా శాంతిభద్రతలు లోపించాయని ఆరోపించారు. శాంతిభద్రతలు క్షీణించిన కారణంగానే ఆమె రాజీనామా చేయాలన్న డిమాండ్ పెద్దదైందని.. చివరకు వైదొలగక తప్పలేదని అన్నారు. దీంతో బంగ్లా ప్రజలు పండుగ చేసుకుంటున్నారని.. ఈ ఆనందోత్సాహాలే దేశంలో అస్థిరతను సృష్టించాయని.. త్వరలోనే సుస్థిరత నెలకొంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. హసీనా హయాంలో చట్టపాలన అమలైనట్లయితే ఇలా జరిగి ఉండేది కాదని చెప్పారు. 17 కోట్ల మంది బంగ్లా ప్రజల్లో ఎక్కువ మంది యువకులేనని.. హసీనా ఏలుబడిలో వారు తమ ఓటుహక్కు

మిగతా 2వ పేజీలో...

సిసోడియాకు బెయిల్

17 నెలల తర్వాత ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎంకు ఊరట



బెయిల్ అనంతరం ఆప్ కార్యకర్తలతో సిసోడియా



ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తల్లికి పాదాభివందనం చేస్తున్న సిసోడియా

విచారణ లేకుండా ఎంత కాలం జైల్లో ఉంచుతారు?
ఆయన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే
బెయిల్ నిబంధన.. జైలు మినహాయింపు: సుప్రీంకోర్టు
ఢిల్లీ మద్యం కేసు విచారణలో తీవ్ర జాప్యమే బెయిల్ ఇవ్వడానికి కారణమన్న ధర్మాసనం
త్వరలోనే కేజ్రీవాల్, కవితకు కూడా బెయిల్?

న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాకు ఎట్టకేలకు బెయిలు లభించింది. 17 నెలలుగా తిహాడ్ జైల్లో ఉన్న ఆయనకు సుప్రీంకోర్టు శుక్రవారం బెయిలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. విచారణ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియని పరిస్థితుల్లో సిసోడియాను శాశ్వతంగా జైల్లో ఉంచలేమని, ఇది ఆయన ప్రాథమిక హక్కులకు భంగకరమని స్పష్టం చేసింది. జైల్లో పెట్టడం కంటే బెయిల్ ఇవ్వడం కనీస న్యాయసూత్రం అని

మిగతా 2వ పేజీలో...

కవిత 11 కిలోల బరువు తగ్గింది!

బీపీ పెరగడంతో మాత్రలు వేసుకుంటోంది 12
త్వరలో బెయిల్ వస్తుందని ఆశిస్తున్నాం: కేటీఆర్

కాలం చెల్లిన సెలైన్‌తో రోగికి చికిత్స



నిర్మల్ జిల్లా ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన
ఐదు నెలల క్రితమే గడువు ముగిసిన సెలైన్‌ను ఓ యువకుడికి ఎక్కించిన సిబ్బంది 12
రోగి సోదరుడు గమనించడంతో తప్పిన ముప్పు
స్వల్పంగా అస్వస్థతకు గురైన యువకుడు
అదే ఆస్పత్రిలో మరిన్ని కాలం చెల్లిన ఇంజెక్షన్లు

ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగికి ఎక్కించిన కాలం చెల్లిన సెలైన్ బాటిల్



ప్రతిపాదిత బిల్లుపై ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో మహిళల నిరసన

బాలికల వివాహ వయసు 9 ఏళ్లే!

ఇరాక్ పార్లమెంట్‌లో అనాగరిక బిల్లు 2

బ్యాంక్ ఖాతాకు నలుగురు నామినీలు

ఖాతాదారులకు మరింత వెసులుబాటు
బ్యాంకింగ్ నిబంధనల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం
ప్రస్తుతం ఒక నామినీని మాత్రమే ప్రతిపాదించే అవకాశం 9



దక్షిణాది భాషలు ఏకతాటిపైకి రావాలి

బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌లో వక్తలు.. పాల్గొన్న 450 మంది రచయితలు

బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వంలా ప్రతి భాషకు తనదైన గుర్తింపు ఉందని, దక్షిణాది భాషలను ఏకతాటిపైకి రావాల్సిన అవసరం వచ్చిందని ప్రముఖ సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్ (బీబీఎల్ఎఫ్)-2024ను ఏర్పాటు చేయడం హర్షణీయమని కొనియాడారు. బెంగళూరు కోరమంగళలోని సెయింట్‌జాన్స్ ఆడిటోరియంలో మూడు రోజుల ఉత్సవానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ముఖ్య అతిథులుగా సాహితీవేత్తలు సచ్చిదానందన్, హెచ్ఎస్ శివప్రకాశ్, ఓల్గా, వివేక్ శాన్‌భోగ్, జయమోహన్ పాల్గొన్నారు. బుక్ బ్రహ్మ ఉత్సవ్ డైరెక్టర్ సతీశ్ చప్పరికె స్వాగతోపన్యాసం చేస్తూ.. 450 మంది రచయితలు, 250కి పైగా సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్, ఐదు రాష్ట్రాల నుంచి వందకుపైగా పబ్లికేషన్స్, 120 మంది కళాకారులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. విభిన్న భాషలకు చెందిన పుస్తకాల కోసం 60కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. దక్షిణాదిన కన్నడ, తమిళ, మళయాళ, తెలుగు భాషలకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని సచ్చిదానందన్ అన్నారు. ఈ భాషల సాహిత్యం జనానికి మరింత దగ్గర చేసేలా ఒకే వేదిక ఏర్పాటు కావడం సంతోషకరమని అన్నారు. కన్నడలో వచన సాహిత్యం నేటికీ కొనసాగుతోందని తెలిపారు. కేరళలో కథాకళి, తెలుగులో బుర్రకథ.. ఇలా భిన్నమైనవి మన సంస్కృతిని చాటుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో తుళు, బ్యారి, గిరిజన భాషలు కూడా ఇలాంటి వేదికల్లో పాలుపంచుకునే అవకాశం ఉందని తెలిపారు. హెచ్ఎస్ శివప్రకాశ్ మాట్లాడుతూ సుమారు 8వ శతాబ్దంలో కన్నడ కవితలకు గుర్తింపు వచ్చిందని అన్నారు. కన్నడలో ఆదికవిగా పేరొందిన పంప రచనలను ప్రస్తావించారు. తమిళంలో రాసిన తిరుప్పావై పాశురాలు భక్తికి మోక్షానికి మార్గంగా ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ద్వారా ఎవరైనా తమ భావాలను వ్యక్తం చేసే అవకాశం లభిస్తోందని అన్నారు. వందేళ్ల క్రితం మద్రాస్ కేంద్రంగా ప్రచురణలు సాగేవని ఓల్గా అన్నారు. అందుకే తెలుగు, తమిళ సాహితీవేత్తలు, రచయితలు అక్కడే ఎక్కువగా ఉండేవారని అన్నారు. అప్పట్లో బ్రహ్మ సమాజం కొంతమేర సాహిత్యాన్ని ప్రోత్సహించేందని అన్నారు. బెంగాలీ నుంచి తెలుగు అనువాదం ఉండేదని అన్నారు. 1960 దశకంలో రష్యన్, అమెరికన్, బ్రిటీష్ భాషల నుంచి తెలుగులోకి అనువాదాలు జరిగాయని చెప్పారు. చలం, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి వంటి వారు సమకాలీనులు కావడంతో అప్పట్లో సాహిత్యాన్ని తమ అభిరుచి మేరకు నాటకాలు, సంగీతం ద్వారా కూడా చాటారని అన్నారు. ప్రస్తుతం కాస్మోపాలిటన్ నగరాలలో నాలుగు ప్రధాన భాషలైన తెలుగు, కన్నడ, తమిళ, మళయాళ సాహిత్యం ఎలా ఉందనేది ఈ వేదిక ద్వారా చర్చించనున్నట్టు తెలిపారు. మాతృభాష ఏదైనా, పలు కారణాలతో పొరుగు రాష్ట్రాల్లో స్థిరపడిన కారణంగా అక్కడి భాషపై మక్కువతో సాహిత్యంలో రాణించినవారు ఎందరో ఉన్నారని జయమోహన్ అన్నారు. అందులో తానొకడినని.. మళయాళం మాతృభాష అయినా తమిళంలో రాణించినట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారితో పోలిస్తే పట్టణాలు, నగరాల వారిలో సాహితీ అభిలాష తక్కువేనని వివేక్‌శాన్‌భోగ్ అన్నారు. డిజిటలీకరణతో భావాలు వ్యక్తం చేసే అవకాశం చాలా తగ్గిందని అభిప్రాయపడ్డారు. మరో వేదికపై ప్రముఖ కవి హంపా నాగరాజయ్య నేతృత్వంలో పాలి-కన్నడ శబ్దకోశ పుస్తకాన్ని ఆవిష్కరించారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జయమోహన్



ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్‌కు నో!



(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ నిబంధనలన్నీ రాజ్యాంగం ప్రకారమే ఉంటాయని పునరుద్ఘాటించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఇటీవల సుప్రీం కోర్టు పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. రాష్ట్రాలు తమ పరిధిలో వర్గీకరణ చేసుకోవచ్చని తెలిపింది. అదే సమయంలో, ఎస్సీ, ఎస్టీల్లో క్రీమీలేయర్‌ను గుర్తించడానికి ఓ విధానాన్ని నిర్దేశించుకోవాలని, రిజర్వేషన్లలో నిజమైన సమానత్వం సాధించడానికి ఇదే మార్గమని కూడా వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో, క్యాబినెట్ సమావేశంలో విస్తృత స్థాయిలో చర్చించి.. రాజ్యాంగానికే కట్టుబడి ఉండాలని నిర్ణయించారు. తద్వారా, సుప్రీం కోర్టు సూచించినట్లు ఎస్సీ, ఎస్టీల్లో క్రీమీలేయర్‌ను అమలు చేసేది లేదని తేల్చి చెప్పారు. అలాగే, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మరో మూడు కోట్ల ఇళ్లను నిర్మించాలని మోదీ 3.0 తొలి క్యాబినెట్‌లో తీర్మానించిన విషయం తెలిసిందే. తాజా భేటీలో అందుకు ఆమోదం తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో రెండు కోట్ల ఇళ్లను నిర్మించనుంది. ఇందుకు రూ.3 లక్షల కోట్లు ఖర్చవుతుంది. ఇందులో కేంద్రం రెండు లక్షల కోట్లు; రాష్ట్రాలు లక్ష కోట్లను ఖర్చు చేయనున్నాయి. అలాగే, పట్టణ ప్రాంతాల్లో కోటి ఇళ్లను నిర్మించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు రాబోయే ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లను ఖర్చు చేయనుంది. కాగా, హార్టీకల్చర్ రంగాన్ని విప్లవాత్మకం చేయడంలో భాగంగా రూ.1766 కోట్లతో క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్ (సీపీపీ) పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పంటను, నాణ్యతను దెబ్బతీస్తున్న వైరస్ ఇన్ఫెక్షన్ల సమస్యను పరిష్కరించడమే దీని ధ్యేయమన్నారు.

మోదీ హామీ ఇచ్చారు

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్ విధానాన్ని అవలంబించాలని సూచిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయా వర్గాలకు చెందిన బీజేపీ ఎంపీలు అభ్యంతరం తెలిపారు. క్యాబినెట్ భేటీ కంటే ముందు వారు ప్రధాని మోదీని కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. మోదీని కలిసిన బృందంలో ఉన్న బీజేపీ రాజ్యసభ సభ్యుడు సికిందర్ కుమార్ పార్లమెంటు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. క్రీమీలేయర్ విషయంలో ప్రధాని మోదీ తమతో సుదీర్ఘంగా చర్చించారని.. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌ను అమలు చేయబోమని ఆయన హామీ ఇచ్చారని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానాన్ని తీసుకురావాలనేది ఒక జడ్జి సూచన మాత్రమేనని, అది మెజారిటీ తీర్పులో లేదని కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ తెలిపారు.

8 రైల్వే ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదం

» ఏపీ, తెలంగాణ, ఒడిసాల్లో 173.63 కి.మీ. కొత్త లైన్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖలో ఎనిమిది కొత్త ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ శుక్రవారం ఆమోద ముద్ర వేసింది. ఈ ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ.24,657 కోట్లు. ప్రధాన మంత్రి గతి శక్తి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిసా, మహారాష్ట్ర, జార్ఖండ్, బిహార్, పశ్చిమ బెంగాల్‌ల్లో 900 కిలో మీటర్ల మేర వీటిని చేపడతారు. ఇందులో భాగంగా 64 కొత్త స్టేషన్లను నిర్మిస్తారు. ఒడిసాలోని మల్కనగిరి నుంచి ఏపీలోని తూర్పు గోదావరి మీదుగా తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం వరకూ మల్కాన్‌గిరి- పాండురంగాపురం వయా భద్రాచలం మార్గంలో 173.63 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ నిర్మిస్తారు. 2030-31 నాటికి ఈ ప్రాజెక్టులు పూర్తవుతాయి. ఆకాంక్ష జిల్లాలైన తూర్పు సింగ్‌భమ్, కొత్తగూడెం, మల్కాన్‌గిరి, కలహండి, నవరంగ్‌పూర్, రాయగడ జిల్లాలను ఈ ప్రాజెక్టులు అనుసంధానం చేస్తాయి.

'హర్ ఘర్ తిరంగా' కలకాలం గుర్తుండిపోవాలి

న్యూఢిల్లీ, ఆగస్టు 9: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా(ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం) వేడుకలను కలకాలం గుర్తుండిపోయేలా ఘనంగా నిర్వహించుకోవాలని ప్రధాని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేయాలన్నారు. శుక్రవారం మోదీ త్రివర్ణ పతాకాన్ని తన ఎక్స్ ఖాతా ప్రొఫైల్ ఫొటోగా పెట్టుకున్నారు. ప్రజలు కూడా అలాగే చేయాలని, జాతీయ జెండాలతో సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగంగా 13న ఎంపీలు ఢిల్లీలో త్రివర్ణ పతాకాలతో బైక్ ర్యాలీ నిర్వహిస్తారు.

బ్రెజిల్‌లో విమానం కూలి 62 మంది మృతి?

బ్రెజిల్, ఆగస్టు 9: బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 62 మందితో వెళ్తున్న వోపాస్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎటీఆర్-72 విమానం శుక్రవారం మధ్యాహ్నం సావోపాలో రాష్ట్రంలోని విన్‌హెడో అనే ప్రాంతంలో కుప్పకూలింది. ఇందులో 58 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ప్రమాదంలో ఎంతమంది చనిపోయారో, ఎంత మంది గాయపడ్డారు తెలియాల్సి ఉంది. కాగా, తెగిన గాలిపటంలా.. విమానం పై నుంచి చక్కర్లు కొడుతూ కూలిన దృశ్యాలు వైరల్ అయ్యాయి.

భారత్‌ను ముక్కలు చేస్తాం: పన్నూన్

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ఖలిస్తానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ మరోసారి రెచ్చిపోయారు. వాషింగ్టన్ డీసీ నుంచి మెల్‌బోర్న్ వరకూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని భారత రాయబార కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాన్ని దహనం చేయబోతున్నామని హెచ్చరించారు. భారత్‌లో పంజాబ్ భాగం కానందున, ఆగస్టు 15న సీఎం భగవంత్ సింగ్ మాన్ త్రివర్ణ పతాకం ఎగురవేయకూడదని పేర్కొన్నారు. జలంధర్‌లో జాతీయ జెండా ఎగురవేయకుండా మాన్‌ను అడ్డుకున్నవారికి తమ సంస్థ తరఫున రూ.కోటి ఇస్తామని ప్రకటించారు. పంజాబ్ ప్రజలు మోదీ ప్రభుత్వాన్ని కూలదోస్తుంటే.. తాము భారత్‌ను విచ్ఛిన్నం చేస్తామని, పంజాబ్‌ను భారత్ నుంచి విముక్తం చేసి సిక్కుల మాతృభూమి ఖలిస్థాన్‌ను సృష్టిస్తామని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "షేక్ హసీనా భారత దేశ గూఢచారి. ఆమె పాలనను కూలదోయడం భారత్‌కు ఒక సందేశాన్ని ఇస్తుంది. ఇక తర్వాత వంతు నరేంద్ర మోదీదే" అని పన్నూన్ హెచ్చరించారు.

తప్పుడు ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

న్యూయార్క్, ఆగస్టు 9: భారత సంతతి వ్యక్తులు ట్రావెల్ ఏజెంట్లతో అప్రమత్తంగా ఉండాలని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ హెచ్చరించింది. కొందరు ఏజెంట్లు కాన్సులర్ సేవలకు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం కాన్సులర్ జనరల్ బినాయ ప్రధాన్ ఓ ప్రకటన చేశారు. భారతీయులు పొందే ఓవర్సీస్ సిటిజన్ ఇండియా (ఓసీఐ) కార్డు, వీసా, పాస్‌పోర్టు, తదితర అత్యవసర సేవలకు ఏజెంట్లు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. "దరఖాస్తుదారుల ఏ ఏజెంటును సంప్రదించాల్సిన అవసరం లేదు. కాన్సులేట్ సేవల కోసం నేరుగా మా వద్దకు రావచ్చు. కాన్సులేట్ సేవల కోసం అధికార ఈ-వీసా వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించాలి" అని బినాయ ప్రధాన్ పేర్కొన్నారు.

బంగ్లాదేశ్ అస్థిరపడితే

భారత్‌కు ముప్పు!



సీతల్‌కుచీ సరిహద్దు కంచెకు ఆవల బంగ్లాదేశీయులు

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించుకోలేకపోయారని అన్నారు. వారి హక్కులు వారికి తిరిగివ్వడం తమ ప్రధాన విధిగా యూనస్ పేర్కొన్నారు. అస్థిరతకు ప్రజాస్వామ్యమే ఔషధమని గుర్తెరగాలన్నారు. బంగ్లాలో ఉగ్రవాదం, ఇస్లామిక్ ఛాందసవాద కార్యకలాపాలు, హసీనా తండ్రి, బంగ్లా జాతిపిత షేక్ ముజిబుర్ రహమాన్ విగ్రహాన్ని కూల్చడం గురించి ప్రశ్నించగా.. ఈ ఘటనలకు హసీనాయే బాధ్యురాలని ఆయన ఆరోపించారు. ముజిబుర్ రహమాన్ ప్రతిష్ఠను ఆమె మసకబార్చారని ఆరోపించారు. దేశంలో అసలైన ప్రజాస్వామ్యం నెలకొంటే మైనారిటీలు సురక్షితంగా ఉంటారని చెప్పారు. వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని.. భారత్‌లో మాదిరిగానే వారు తమ ఓటుహక్కు వినియోగించుకుని తమ ప్రతినిధులను ఎన్నుకుంటారని తెలిపారు. ఇంకోవైపు.. హసీనాకు భారత్ మద్దతివ్వడంపై బీఎన్‌పీ సీనియర్ నేత గయేశ్వర్ రాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తమ శత్రువుకు సాయం చేస్తే భారత్‌తో కలిసి పనిచేయడం కష్టమని చెప్పారు. బంగ్లాలోని ఒక పార్టీకి మద్దతివ్వడం కాకుండా యావద్దేశానికి ఇండియా మద్దతివ్వాలని కోరారు. రెండు దేశాలూ పరస్పరం సహకరించుకోవాలి. ఆ స్ఫూర్తి కొనసాగేలా భారత ప్రభుత్వం వ్యవహరించాలి. హసీనా ప్రభుత్వంలో విదేశాంగ మంత్రి గత ఎన్నికల సమయంలో మాట్లాడుతూ.. హసీనా తిరిగి అధికారంలోకి వచ్చేందుకు భారత్ సాయం చేస్తుందని అన్నారు. రెండు దేశాల ప్రజల నడుమ ఎలాంటి సమస్యలూ లేవు. కానీ భారత్ మొత్తం బంగ్లాదేశ్‌ను కాకుండా ఒక్క పార్టీనే ప్రోత్సహించడం సబబా' అని ప్రశ్నించారు. తమ పార్టీ హిందువుల వ్యతిరేకి కాదన్నారు. భారత్‌కు వ్యతిరేకంగా బంగ్లాలో ఉగ్రవాద కార్యకలాపాలు జరుగుతున్నాయనడంలోనూ వాస్తవం లేదన్నారు. తాము స్వాతంత్ర్యం సంపాదించేందుకు ఇండియా తోడ్పడిందని.. ఆ దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించే అవకాశమే లేదని స్పష్టంచేశారు. కాగా.. బంగ్లాలో జాతివ్యతిరేక దాడులకు, హింసాకాండకు తాము వ్యతిరేకమని ఐక్యరాజ్యసమితి తెలిపింది. అక్కడ హిందువులు, ఆలయాలు, వ్యాపారాలపై జరుగుతున్న దాడులు, దోపిడీల గురించి ప్రస్తావించగా.. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ తరఫు ఉప అధికార ప్రతినిధి ఫర్హాన్ హక్ స్పందించారు. బంగ్లాలో మతపరమైన దాడులు జరక్కూడదని ముందే స్పష్టం చేశామన్నారు.

సరిహద్దు పర్యవేక్షణకు కమిటీ

బంగ్లాదేశ్‌లో హిందువులపై ప్రాణాంతక దాడులు, ఆస్తుల లూటీ, ధ్వంసం నేపథ్యంలో ఆ దేశ ప్రజలు భారీ సంఖ్యలో భారత్‌లోకి ప్రవేశించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వారు రాకుండా సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అడ్డుకుంటోంది. ఈ నేపథ్యంలో సరిహద్దు భద్రతను, బంగ్లాలోని భారతీయులు, హిందువులు, ఇతర వర్గాల భద్రతను పర్యవేక్షించేందుకు ప్రధాని మోదీ ఓ కమిటీని నియమించారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెల్లడించారు. ఈ కమిటీ బంగ్లా అధికారులతో నిరంతరం సంప్రదిస్తుంటుందని తెలిపారు. బీఎస్ఎఫ్ తూర్పు కమాండ్ అదనపు డీజీ దీనికి నేతృత్వం వహిస్తారన్నారు. దక్షిణ బెంగాల్ సరిహద్దు బీఎస్ఎఫ్ ఐజీపీ, త్రిపుర సరిహద్దు ఐజీపీ, ల్యాండ్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎల్‌పీఏఐ) సభ్యుడు, కార్యదర్శి మెంబర్లుగా ఉంటారని శుక్రవారం చెప్పారు. కాగా, బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక దాడులు జరగడంపై ఆర్ఎస్ఎస్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. అక్కడ హిందువులు, ఇతర మైనారిటీల భద్రతకు సాధ్యమైనంత కృషిచేయాలని సంఘ్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబోలే శుక్రవారం మోదీ ప్రభుత్వాన్ని కోరారు. దాడులను అడ్డుకోవడానికి అక్కడి తాత్కాలిక ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, హిందువుల ప్రాణాలు, ఆస్తులు పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

బెంగాల్ సరిహద్దుల్లో వేల మంది బంగ్లాదేశీయులు!

కోల్‌కతా, ఆగస్టు 9: హింసాకాండతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్ నుంచి ప్రాణాలు అరచేత పట్టుకుని భారత్‌లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న వేలాది బంగ్లాదేశీయులను బీఎస్ఎఫ్ బలగాలు సరిహద్దులో అడ్డుకుంటున్నాయి. వీరిలో అత్యధికులు హిందువులు కావడం గమనార్హం. గత సోమవారం ఆ దేశప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసినప్పటి నుంచి అక్కడ హిందువులు , బౌద్ధులు, ఇతర మైనారిటీలపై పెద్దఎత్తున దాడులు జరుగుతున్నాయి. వారి ఆస్తులు, వ్యాపారాలు ధ్వంసం చేస్తున్నారు. అవామీలీగ్ పార్టీకి చెందిన ఇద్దరు హిందూ నేతలు హత్యకు కూడా గురయ్యారు. ఈ నేపథ్యంలో ప్రాణభయంతో పలువురు భారత్ వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ బలగాలు భారీగా మోహరించాయి. శుక్రవారం బెంగాల్లోని కూచ్‌బిహార్ జిల్లా సీతల్‌కుచీ సరిహద్దు కంచె దూకి వచ్చేందుకు వెయ్యి మంది ప్రయత్నించగా భారత బలగాలు వమ్ముచేశాయి. సరిహద్దుకు సమీపంలో వారంతా సమావేశమై తమను భారత్‌కు రానివ్వాలని నినాదాలు చేశారు.

బాలికల వివాహ వయసు 9 ఏళ్లే!

» ఇరాక్ పార్లమెంట్‌లో అనాగరిక బిల్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: బాలికల కనీస వివాహ వయసును 9ఏళ్లకు, బాలురకు 15 ఏళ్లకు తగ్గించేందుకు ఇరాక్ ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే పితృస్వామ్య కట్టుబాట్లతో నిండిన సమాజంలో ఇరాక్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ ప్రతిపాదిత బిల్లు మహిళల హక్కులను కాలరాస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అనాగరిక, వివాదాస్పద బిల్లుపై మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ప్రస్తుతం ఇరాక్‌లో బాలికల వివాహ వయసు 18 సంవత్సరాలుగా ఉంది. ప్రస్తుత బిల్లు పాస్ అయితే బాలికలు 9 ఏళ్లు, బాలురు 15 ఏళ్లకు వివాహం చేసుకోవడానికి చట్టపరంగా ఎలాంటి అడ్డంకులూ ఉండవు. ఈ బిల్లును ప్రవేశపెట్టిన ఎంపీ రయీద్ అలీ మాలికీకి స్వలింగ సంపర్కం, లింగమార్పిడి శస్త్రచికిత్సలను నేరంగా పరిగణించే వ్యభిచార వ్యతిరేక చట్టంతో సహా పలు వివాదాస్పద సవరణలను ప్రతిపాదించిన చరిత్ర ఉంది. ఇరాక్‌లో ఇప్పటికే 28శాతం మంది బాలికలకు 18 ఏళ్లలోపే వివాహం జరుగుతోందని గణాంకాలు పేర్కొంటున్నాయి.

సీఏఏ పత్రాలపై ప్రభుత్వ వివరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 9: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) కింద జారీ చేసిన నిబంధనల పరిధిని కేంద్రం విస్తరించింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి భారత పౌరసత్వం ఇచ్చేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. దరఖాస్తుదారుల తల్లిదండ్రులు, తాతలు, ముత్తాతల్లో ఒకరు ఈ మూడు దేశాల్లో ఒకదాని పౌరుడని, లేదా ఆ దేశంలో నివసించారని రుజువు చేస్తూ భారత్‌లోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేక పాక్షిక న్యాయసంస్థలు జారీ చేసిన ఏదైనా డాక్యుమెంట్ ఉండొచ్చని కేంద్ర హోంశాఖ తాజాగా ప్రకటించింది. దీనికి సంబంధించిన భూ రికార్డులు గానీ, న్యాయపరమైన ఉత్తర్వు తదితరాలను ఆమోదిస్తామని తెలిపింది.

నీట్-పీజీ వాయిదాకు సుప్రీంకోర్టు నిరాకరణ

» అయిదుగురి కోసం 2 లక్షల మందిని ఇబ్బంది పెట్టలేమని వ్యాఖ్య.. రేపే పరీక్ష

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ఆదివారం జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను వాయిదా వేయడానికి శుక్రవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. పరీక్షలు రాయాల్సిన నగరాలను అభ్యర్థులకు ఇప్పటికే కేటాయించారని, చివరి నిమిషంలో వాయిదా వేస్తే చాలా అవస్థలు పడుతారని తెలిపింది. అయిదుగురు విద్యార్థుల కోసం 2లక్షల మంది భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టలేమని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. "ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ వచ్చి పరీక్షలు వాయిదా వేయాలని అడుగుతున్నారు. ఇలాంటి పరీక్షను ఎలా వాయిదా వేస్తాం? ఒకవేళ వాయిదా వేస్తే 2లక్షల మంది విద్యార్థులు, 4లక్షల మంది తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకుంటారు" అని వ్యాఖ్యానించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే వాదనలు వినిపిస్తూ తగినన్ని పరీక్షా కేంద్రాలు లేకపోవడంతో ఉదయం ఒక సెట్ వారికి, సాయంత్రం మరొక సెట్ వారికి పరీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏకరూపత, నిష్పక్షపాతం ఉండేలా చూసేందుకే పరీక్షను వాయిదా వేయాలని కోరినట్టు చెప్పారు. పరీక్షలు రాసేందుకు కేటాయించిన నగరాలను జులై 31న ప్రకటించగా, సెంటర్ల వివరాలను గురువారమే వెల్లడించారని, దూరప్రాంతాల్లో సెంటర్లు ఉన్న విద్యార్థులు వెళ్లడానికి సమయం చాలదని, పరీక్షను వాయిదా వేయాలని కోరారు.

ఏం ధరించాలో ఎలా చెబుతారు?

హిజాబ్‌పైనే నిషేధమా? బొట్టు, తిలకానికి కూడా వర్తిస్తుందా?

» పేర్ల ద్వారా మతం వెల్లడవటం లేదా?

» హిజాబ్, బుర్ఖాలపై నిషేధం విధించిన ముంబై కాలేజీని నిలదీసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: కళాశాలకు వచ్చే విద్యార్థులు 'హిజాబ్, బుర్ఖా, నఖాబ్, టోపీ' వంటివి ధరించవద్దంటూ ఓ ముంబై కాలేజీ విధించిన నిషేధాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఏ దుస్తులు ధరించాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ విద్యార్థినులకు ఉందని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ నిషేధం బొట్టు, తిలకంలకు కూడా వర్తిస్తుందా? అని ప్రశ్నించింది. 'ఏం ధరించాలో నిర్దేశించటం ద్వారా మహిళలను, విద్యార్థినులను ఏ విధంగా మీరు సాధికారిత వైపు తీసుకెళ్తారు' అని ప్రశ్నించింది. ఈ సందర్భంగా సదరు కళాశాల 'ఎన్‌జీ ఆచార్య, డీకే మరాఠే కాలేజీ' తరఫు న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ, తమది కో-ఎడ్యుకేషన్ కాలేజీ అని, విద్యార్థులు ఏయే మతాలకు చెందినవారో వెల్లడి కాకూడదనే ఉద్దేశంతోనే ఈ ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందిస్తూ-'అలా అనుకుంటే విద్యార్థుల పేర్ల ద్వారానే వారు ఏ మతానికి చెందిన వారో తెలుస్తుంది కదా? ఇటువంటి నిర్ణయాలను వారిపై రుద్దకండి' అని పేర్కొన్నారు. జస్టిస్ సంజయ్‌కుమార్ కూడా దీనిపై స్పందిస్తూ.. 'స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్ల తర్వాత దేశంలో పలు మతాలు ఉన్నాయని ఇప్పుడు మీరు గుర్తించటం దురదృష్టకరం. విద్యార్థినులు హిజాబ్ మొదలైన వాటిని ధరిస్తున్న విషయాన్ని ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడే మీరు నిద్రలోంచి లేచినట్లుగా గుర్తించారు' అని పేర్కొన్నారు. కాలేజీ క్యాంపస్‌లో ఎవరూ హిజాబ్, టోపీ, బ్యాడ్జీలు ధరించవద్దంటూ జారీ చేసిన ఆదేశాలపై కోర్టు స్టే విధించింది. విచారణను నవంబరు 18కి వాయిదా వేసింది.



కొందరు కాలేజీకి రావటం మానేశారు!

పిటిషన్లు దాఖలు చేసిన విద్యార్థినుల తరఫున వాదనలు వినిపించిన న్యాయవాదులు కొలిన్ గోంజాల్వెజ్, అబిహ జైదీ.. హిజాబ్‌పై నిషేధం వల్ల కొందరు విద్యార్థినులు కాలేజీకి వెళ్లటం మానుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీ తరఫు లాయర్ వాదిస్తూ, కాలేజీకి వచ్చిన తర్వాత హిజాబ్, బుర్ఖాలను తీసి భద్రపర్చుకోవటానికి లాకర్ సదుపాయం కల్పించామని, కాలేజీలో ఉన్న 441 మంది ముస్లిం విద్యార్థినుల్లో పిటిషన్ వేసిన ముగ్గురికి తప్ప ఇతరులెవరికీ అభ్యంతరం లేదన్నారు.

విస్తృత ధర్మాసనం విచారణ?

కర్ణాటకలో గత బీజేపీ ప్రభుత్వం.. విద్యాసంస్థల్లో హిజాబ్‌ను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేయటం, దానిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. దీనిపై 2022 అక్టోబరు 13న సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనంలో ఒక న్యాయమూర్తి అనుకూలంగా, మరో న్యాయమూర్తి వ్యతిరేకంగా తీర్పునిచ్చారు. దీంతో ఈ అంశంపై విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అంశం పెండింగ్‌లో ఉంది.

'గుడ్ మార్నింగ్' బదులు 'జైహింద్' అనండి

విద్యార్థులకు హరియాణా ప్రభుత్వం సూచన

చండీగఢ్, ఆగస్టు 9: స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15 నుంచి అన్ని పాఠశాలల్లోని విద్యార్థులు.. టీచర్లకు తోటి స్నేహితులకు గుడ్ మార్నింగ్‌కు బదులుగా జైహింద్ చెప్పాలని హరియాణా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ఆ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పాఠశాల విద్యా డైరెక్టరేట్ జీవో జారీ చేసింది. "ప్రతిరోజు జైహింద్ చెప్పడం వల్ల విద్యార్థులకు చిన్నప్పటి నుంచే దేశ భక్తి పెరుగుతుంది" అని జీవోలో పేర్కొంది.

సిసోడియాకు బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. బెయిల్ ఇవ్వకుండా నెలల తరబడి సాగదీయడం శిక్షగా పరిణమించకూడదంటూ దిగువ కోర్టు, హైకోర్టులను సుప్రీం ధర్మాసనం మందలించింది. బెయిల్ అనేది నిబంధన, జైలు అనేది మినహాయింపు కావాలని జస్టిస్ గవాయ్ అన్నారు. ఈ కేసులో దాదాపు 493 మందిని సాక్షులుగా పేర్కొన్నారని, సమీప భవిష్యత్తులో సిసోడియాపై విచారణ పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. బెయిల్ కోసం ఒక పౌరుడిని కోర్టుల చుట్టూ తిరిగేలా చేయడం సరికాదని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంబంధించిన విషయాల్లో రాజ్యాంగం కల్పించిన హక్కులను గుర్తించాల్సి ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. సిసోడియాపై దర్యాప్తు ఎప్పుడు పూర్తవుతుందని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజును ప్రశ్నించగా.. కేసులో చార్జిషీటు దాఖలైన నెల రోజుల్లో విచారణ ప్రారంభమవుతుందని చెప్పారు. కేసు విచారణలో జాప్యానికి నిందితులే కారణమని, వారిని విడుదల చేస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని తెలిపారు. అయితే సాక్ష్యాలన్నీ డాక్యుమెంట్ల లోనే ఉన్నప్పుడు, వాటిని ఎలా తారుమారు చేస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. సిసోడియా సచివాలయానికి వెళ్లకుండా ఆదేశాలు జారీ చేయాలన్న ఈడీ, సీబీఐ అభ్యర్థననూ తిరస్కరించింది. పారిపోవడం, సాక్షులను ప్రభావితం చేయడం, సాక్ష్యాలను తారుమారు చేయడమనే కారణాలు సిసోడియాకు వర్తించవని పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో ఆయనపై విచారణలో మితిమీరిన జాప్యమే ఈ బెయిల్ ఇచ్చేందుకు కారణమని ధర్మాసనం తెలిపింది. 2023 ఫిబ్రవరి 26న సిసోడియాను సీబీఐ అరెస్టు చేయగా, ఆ తర్వాత రెండు వారాలకు ఈడీ కూడా అరెస్టు చేసింది. ఈ రెండు కేసుల్లోనూ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అదే సమయంలో ఢిల్లీ మద్యం కేసులో పస ఉందని దిగువ కోర్టు, హైకోర్టు చేసిన నిర్ధారణల్లో తప్పేమీ లేదని స్పష్టం చేసింది. రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని, పాస్‌పోర్టును దర్యాప్తు అధికారులకు అప్పగించాలని, ఢిల్లీ వదిలి వెళ్లరాదని, ప్రతి సోమ, గురువారాల్లో రెండుసార్లు పోలీస్ స్టేషన్‌కు హాజరవ్వాలని సిసోడియాకు షరతులు విధించింది. శుక్రవారం సాయంత్రం సిసోడియా విడుదలయ్యారు.

కేజ్రీవాల్, కవితకూ మార్గం సుగమం..?

సుప్రీంకోర్టు సిసోడియాకు బెయిలు ఇవ్వడంతో ఇదే కేసులో అరెస్టయి జైల్లో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు కూడా బెయిల్ వచ్చే అవకాశాలు ఉన్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించుకున్నారు. కేజ్రీవాల్‌కు ఇప్పటికే ఈడీ కేసులో బెయిల్ లభించిన విషయం తెలిసిందే. ఇక ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ ఇప్పటికే పెండింగ్‌లో ఉందని, వచ్చే వారం ఈ పిటిషన్ విచారణకు రానుందని బీఆర్ఎస్ న్యాయ వర్గాలు తెలిపాయి.

జయాబచ్చన్ వర్సెస్ చైర్మన్

మహిళా సభ్యుల సంబోధన పట్ల రాజ్యసభలో వాడీవేడి సంవాదం

న్యూఢిల్లీ, ఆగస్టు 9: మహిళా సభ్యులతో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడే తీరు బాగోలేదంటూ సమాజ్‌వాదీ పార్టీ సభ్యురాలు, సీనియర్ నటి జయాబచ్చన్ అభ్యంతరం వ్యక్తం చేయడం రాజ్యసభను వేడెక్కించింది. నేరుగా చైర్మన్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం, ప్రతిగా చైర్మన్ స్పందించడం, తిరిగి జయ మాట్లాడటం.. ఇలా పెద్దల సభలో తీవ్రస్థాయిలో వాగ్యుద్ధం రాజుకుంది. చైర్ తనకు క్షమాపణలు చెప్పాలని జయ గట్టిగా డిమాండ్ చేశారు. జయాబచ్చన్‌కు మద్దతుగా కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ నేతృత్వంలో రాజ్యసభలోని విపక్ష పార్టీల సభ్యులంతా సభ నుంచి వాకౌట్ చేశారు. గత సోమవారం రాజ్యసభలో చైర్మన్ తనను 'జయా అమితాబ్ బచ్చన్' అంటూ సంబోధించడాన్ని ఆమె అభ్యంతరపెట్టారు. 'జయాబచ్చన్ అనండి చాలు. నా భర్త పేరును జోడించి పిలవడం ఒక మహిళగా నాకు ఇబ్బందిగా ఉంది. మాకు సొంత అస్తిత్వం లేదన్నట్టు మీ సంబోధన ఉంది" అని తేల్చిచెప్పారు. ఇదే క్రమంలో శుక్రవారం రాజ్యసభ కార్యకలాపాలు మొదలైన కొద్దిసేపటికి చైర్మన్ జగదీప్ ధనఖడ్‌పై జయాబచ్చన్ మరోసారి సభలో ఫిర్యాదు చేశారు. 'మీ మాటతీరు బాగాలేదు' అని ఆమె అన్నారు. దీనిపై చైర్మన్ తీవ్రంగా స్పందించారు. "మీరు ప్రముఖ నటి కావచ్చు. కానీ, సభా మర్యాదలను మీరు అర్థం చేసుకోవాలి" అని సూచించారు. దీనిపై జయ తిరిగి స్పందిస్తూ.. "సర్! నేను జయా అమితాబ్ బచ్చన్‌ను. నేను నటిని. బాడీ లాంగ్వేజ్, ఎక్స్‌ప్రెషన్ (వ్యక్తీకరణ) నాకు అర్థం అవుతాయి. మీ మాట తీరు సబబుగా లేదు. ఈ మాట అన్నందుకు నన్ను మన్నించండి" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. దీనికి చైర్మన్ స్పందిస్తూ.. "మీరు గొప్ప పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్నారు. నటి విషయం డైరెక్టర్‌కు సంబంధించింది. మీకు ఇవన్నీ వేలు పట్టుకుని నేర్పించాల్సిన అవసరం లేదు. లేదు.. లేదు.. ఇక ఆపండి.." అంటూ ఆమె వైపు చేతులు ఊపారు. అనంతరం జయాబచ్చన్ సహా సభలో విపక్ష సభ్యులంతా వాకౌట్ చేశారు. పార్లమెంటు వెలుపల మిగతా రాజ్యసభ సభ్యులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. "సభలో చైర్మన్ అన్‌పార్లమెంటరీ భాషను వాడుతున్నారు. 'న్యూసెన్స్', 'మీరు ప్రముఖులైతే కావచ్చుగానీ నేను అవేవీ పట్టించుకోను' అని సభ్యులతో అంటున్నారు. సభలో మహిళా సభ్యులతో మాట్లాడే తీరు ఇదేనా? ఇది అవమానకరం" అని జయాబచ్చన్ అన్నారు. చైర్ నుంచి క్షమాపణను ఆమె డిమాండ్ చేశారు. కాగా, రాజ్యసభలో అమర్యాదకరంగా, అత్యంత అభ్యంతరకర రీతిలో విపక్ష సభ్యుల ప్రవర్తించారని బీజేపీ మండిపడింది. 'దేశాన్ని బలహీనపరచాలని విపక్షాలు చూస్తున్నాయి. ఇందుకుగాను అవి క్షమాపణలు చెప్పాల్సిందే' అని రాజ్యసభలో కేంద్ర మంత్రి నడ్డా స్పష్టం చేశారు.

5 వేలు తీసుకుంటూ చిక్కిన ఏఈ



చెన్నూరు, ఆగస్టు 9: మంచిర్యాల జిల్లా చెన్నూరులో లంచం తీసుకుంటూ నీటిపారుదల శాఖ ఏఈ.. ఏసీబీ అధికారులకు చిక్కాడు. 2016-17లో మండలంలోని దుగ్నేపల్లిలో మిషన్ కాకతీయ పథకం కింద కాంట్రాక్టర్ బొమ్మ చంద్రశేఖర్‌రెడ్డి పనులు చేపట్టాడు. ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ), ఫిక్స్‌డ్ సెక్యూరిటీ డిపాజిట్ (ఎఫ్ఎస్‌డీ) కింద రూ.79 వేలను ఆ శాఖలో డిపాజిట్ చేశాడు. ప్రస్తుతం పనులు పూర్తయినందున డిపాజిట్ సొమ్మును ఇవ్వాలని కాంట్రాక్టర్ దరఖాస్తు చేయగా, ఏఈ చేతన్ రూ.10 వేలు డిమాండ్ చేశాడు. శుక్రవారం ఏఈకి చంద్రశేఖర్ రూ.5 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

నిజామాబాద్ మునిసిపల్‌లో అవినీతి కొండ

నిజామాబాద్/సుభాష్ నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్ ఇంట్లో ఏసీబీ అధికారులు దాదాపు రూ.3కోట్ల నగదు(2,93,81,000)ను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఆయన బ్యాంకు ఖాతాలో రూ.1.10కోట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు నరేందర్ ఇంట్లో ఉన్న 51తులాల బంగారం, 17 స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలను సీజ్ చేశారు. నరేందర్ ఆఫీసులో రూ.90వేలు దొరికాయి. అధికారులు సీజ్ చేసిన నగదు, బంగారం, ఆస్తి పత్రాల విలువరూ.6,07,81,000. ఒక సూపరింటెండెంట్ ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు దొరకడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. నోట్లను లెక్క పెట్టడానికి రెండు కౌంటింగ్ మిషన్లను ఉపయోగించారు. నిజామాబాద్ జిల్లాలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో ఇంత భారీ స్థాయిలో నగదు పట్టుబడటం ఇదే మొదటిసారని తెలిపారు. నరేందర్‌ను అరెస్టు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న సమాచారంతో ఏసీబీ అధికారులు శుక్రవారం దాసరి నరేందర్ ఇంటితో పాటు ఆయన కార్యాలయం, బంధువుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. ఉదయం 5 గంటలకు మొదలైన సోదాలు అర్ధరాత్రి దాటినా కొనసాగాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన 25 మంది ఏసీబీ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు.

మాస్టర్ ప్లాన్‌కు భిన్నంగా అనుమతులు

మునిసిపల్ కార్పొరేషన్‌లో నరేందర్ చాలా కాలంగా సూపరింటెండెంట్‌గా పనిచేస్తూనే ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగానూ కొనసాగుతున్నారు. ఏళ్లతరబడి ఒకేచోట పనిచేయడంతో అనుమతుల విషయంలో అన్నీ తానే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అయితే, కొంతకాలంగా నరేందర్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులకు నివేదించినా పట్టించుకోకపోవడంతో కొంత మంది ఏకంగా ఏసీబీ డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు శుక్రవారం తనిఖీలను చేపట్టారు. నరేందర్ ఇంట్లో ఏసీబీ తనిఖీలు మొదలయ్యాయని తెలవగానే కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఇతర ఉద్యోగుల్లోనూ అలజడి మొదలైంది. కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్ల నుంచి భవనాల అనుమతుల వరకు ఎక్కువ శాతం నిబంధనలకు విరుద్ధంగానే జరుగుతున్నాయి. కొన్ని భవనాలకు కార్పొరేషన్ పరిధిలోని మాస్టర్ ప్లాన్‌కు భిన్నంగా అనుమతులిస్తున్నారు. నిర్మాణాలు చేపడుతున్నారు.

ల్యాబ్ టెక్నిషియన్ ప్రొవిజినల్ జాబితా వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలోని ల్యాబ్ టెక్నిషియన్ పోస్టుల (గ్రేడ్-2)కు సంబంధించి ప్రొవిజినల్ సెలెక్షన్ జాబితాను శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు జాబితా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు వెల్లడించారు. కాగా, దోస్త్ ప్రత్యేక దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో చేరడానికి గడువును ఈ నెల 13 వరకు పొడిగించారు.

గొట్టిముక్కల ఎగువన రెండు డ్యాంలు

వాటి నుంచే గోదావరి-కావేరి వాటా వినియోగం.. తెలంగాణ విజ్ఞప్తి.. కేంద్రం సూత్రప్రాయ అంగీకారం

- సమ్మక్క బ్యారేజీలో 83-87 మీటర్ల మధ్య నీటిని వినియోగించుకోవాలి.. దిగువన వద్దు
- బ్యారేజీ కన్వేయర్ వాడుకోండి: తెలంగాణ
- రాష్ట్ర అభ్యంతరాలకు సమాధానాలు వచ్చాకే సంతకం పెడతామని స్పష్టం చేసిన అధికారులు



హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో వాటాగా వచ్చే నీటిని సమ్మక్క బ్యారేజీ పరిసరాల్లో కాకుండా.. పూర్వ నల్గొండ జిల్లా గొట్టిముక్కల ఎగువన 45 టీఎంసీల సామర్థ్యంతో రెండు రిజర్వాయర్లను కేంద్ర నిధులతో కట్టించి, వాటి నుంచి వాడుకునే వీలు కల్పించాలని తెలంగాణ కోరింది. గోదావరి-కావేరిలో దక్కే వాటాను రాష్ట్రంలో ఎక్కడైనా వాడుకునే వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వ వినతికి కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. అధ్యయనం అనంతరం దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. 'గోదావరి-కావేరి అనుసంధానం'పై ఆరో సంప్రదింపుల సమావేశం జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్లూడీఏ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది. దీనికి ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ తరఫున జనరల్ (డీజీ) భోపాల్‌సింగ్, దక్షిణాది విభాగం చీఫ్ ఇంజనీర్ (సీఈ) దేవేందర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున.. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, అంతర్రాష్ట్ర వ్యవహారాల చీఫ్ ఇంజనీర్ ఓరుగంటి మోహన్‌కుమార్ హాజరయ్యారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ అభ్యంతరాలను, ప్రతిపాదనలను రాహుల్ బొజ్జా కేంద్రానికి నివేదించారు. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా తరలించే 148 టీఎంసీల నీటిలో 33% సరిపోదని.. 50 శాతం వాటా తెలంగాణకు ఇవ్వాలని కోరారు. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా 5.3 లక్షల ఎకరాలకు నీటిని అందించడానికి అంగీకారం తెలిపిన విషయాన్ని గుర్తు చేసిన అధికారులు.. నల్గొండ జిల్లాలోని గొట్టి ముక్కలలో ఇదివరకే ప్రతిపాదించి, కట్టాలనుకున్న రిజర్వాయర్ కింద 80 వేల ఎకరాలు సాగులోకి రానుందని గుర్తు చేశారు. మిగిలిన 4.5 లక్షల ఎకరాలకూ నీరిచ్చేలా గొట్టిముక్కల ఎగువన రెండు లోయలు ఉన్న ప్రాంతంలో రెండు రిజర్వాయర్లను ఎన్‌డబ్ల్యూడీఏ తన నిధులతో కట్టించాలని స్పష్టం చేశారు. నాగార్జునసాగర్‌ను గోదావరి-కావేరి లింక్‌లో ఆన్‌లైన్ రిజర్వాయర్‌గా వినియోగించుకోవాలని ప్రతిపాదించినప్పటికీ.. ప్రస్తుతం కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణ జరుగుతోందని గుర్తుచేశారు. ఆ విచారణ జరిగి.. నీటివాటాలు, ఆపరేషనల్ ప్రోటోకాల్ తేలిన తర్వాత సాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకోవడానికి ఇబ్బందుల్లేవని స్పష్టంచేశారు.

ఆ నీటిని ముట్టుకోవద్దు..

సమ్మక్క బ్యారేజీని 83 మీటర్లతో కట్టామని.. 83-87 మీటర్ల మధ్యలో నీటిని నిల్వ చేసి, ఆ నీటిని మాత్రమే గోదావరి-కావేరీ అనుసంధానంలో తరలించాలని తెలంగాణ ప్రతిపాదించింది. 83 మీటర్ల కింద నిల్వ ఉన్న నీటిని ముట్టుకోరాదని.. రాష్ట్ర అవసరాలకు రక్షణ కల్పిస్తూ నీటిని తరలించాలని స్పష్టం చేసింది. సమ్మక్క బ్యారేజీ డీపీఆర్ కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లో పెండింగ్‌లో ఉందని, దానికి క్లియరెన్స్ ఇప్పించాలని కోరింది. సమ్మక్కను హెడ్‌గా వాడుకున్నప్పటికీ బ్యారేజీ మాత్రం తెలంగాణ నియంత్రణలో ఉండాలని రాష్ట్ర అధికారులు తేల్చిచెప్పారు. అలాగే.. గోదావరి-కావేరి అనుసంధాన కన్వేయర్ల(నీటిని తరలించే వ్యవస్థలోని కాలువలు, టన్నెల్) నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు ఇబ్బందులు రానున్నాయని, ఈ మార్గంలో రెండు పంటలు పండే భూములు ఉండటంతో రైతాంగం భూమిని అప్పగించడానికి ముందుకు రాకపోవచ్చని అధికారులు గుర్తుచేశారు. దీనికి ప్రత్యామ్నాయంగా సమ్మక్క బ్యారేజీకి చెందిన కన్వేయర్‌ను వినియోగించుకోవాలని ప్రతిపాదించారు.

ఆ తర్వాతే సంతకాలు!

గోదావరి-కావేరి అనుసంధానానికి సంబంధించి అవగాహన ఒప్పందం(ఏంవోఏ)పై సంతకాలు చేయాలని ఎన్‌డబ్ల్యూడీఏ కోరగా.. రాష్ట్ర అధికారులు అందుకు నిరాకరించారు. ఛత్తీస్‌గఢ్ వాడుకోని నీరు గోదావరి-కావేరిలో తరలిస్తుండటం వల్ల తొలుత ఆ రాష్ట్రం సమ్మతి తీసుకోవాలని.. సమ్మక్క బ్యారేజీ ఎత్తు 87 మీటర్ల దాకా పెంచుకోవడానికి(ప్రస్తుతం 83 మీటర్లకే ఎన్‌వోసీ ఇవ్వడానికి ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలు లేవనెత్తుతోంది) ఆ రాష్ట్ర ఆమోదాన్ని పొందాలని, తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలన్నింటికీ సమాధానాలు వచ్చాకే సంతకాలు పెడతామని అధికారులు తేల్చిచెప్పారు. అయితే.. గోదావరి-కావేరి అనుసంధానానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలుపుతున్నామని స్పష్టం చేశారు. కాగా.. గోదావరి-కావేరిలో 50% వాటా డిమాండ్ విషయంలో పట్టు సడలించాలని ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భోపాల్‌సింగ్ తెలంగాణకు విజ్ఞప్తిచేశారు. సాధ్యమైనంత మేర రాష్ట్రానికి న్యాయం చేస్తున్నామని, తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై సానుకూలత ఉందని ఆయన స్పష్టంచేశారు. అనుసంధానానికి అయ్యే ఖర్చు రూ.45 వేల కోట్లలో 90% కేంద్రమే భరిస్తుందని గుర్తు చేసిన ఆయన.. మిగిలిన 10 శాతాన్ని ఆయా రాష్ట్రాలు ఏ మేరకు నీటి వాటాను పొందుతున్నాయో ఆ మేరకు భరించాల్సి ఉంటుందన్నారు. జాతీయ సమగ్రత నేపథ్యంలో దీనికి రాష్ట్రాలు పెద్ద మనసుతో అంగీకారం తెలపాలని కోరారు.


బస్సులో బంగారం చోరీ.. థార్ గ్యాంగ్ పనే

- బంగారం వ్యాపారులే ఆ ముఠా టార్గెట్
- ఏదైనా హోటల్ వద్ద టీ కోసం బస్సు ఆగితే.. వెంటనే బస్సులోకి దూరి బంగారంతో పరార్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బంగారం వ్యాపారులే వాళ్ల టార్గెట్. బంగారం ఎలా తరలిస్తున్నారు.. ఎక్కడికి తీసుకువెళ్తున్నారు.. ఏ బ్యాగులో తీసుకువెళ్తున్నారు.. ఇలా మొత్తం సమాచారాన్నంతా ముందే సేకరిస్తారు. వ్యాపారులు దూరప్రాంతాలకు బస్సులో వెళ్తే వారి వెనకాలే కారులో ఫాలో అవుతారు. బస్సు ఎక్కడైనా టీ, టిఫిన్ల కోసం ఆగినప్పుడు.. సదరు వ్యాపారి తన బ్యాగును బస్సులో పెట్టి కిందికి దిగాడో.. అంతే. వెంటనే ఆ బస్సులోకి దూరుతారు. బంగారం ఉన్న బ్యాగును ఎత్తుకెళ్లిపోతారు. మధ్యప్రదేశ్ ధార్ జిల్లాకు చెందిన అంతర్రాష్ట్ర గ్యాంగ్ దొంగతనాల తీరు ఇది. ఇటీవల రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఓ ట్రావెల్ బస్సులోంచి రూ.కోటిన్నర విలువైన బంగారు ఆభరణాలను కూడా ఈ ముఠానే దోచుకెళ్లింది. రాచకొండ పోలీసులు ఈ 'థార్ గ్యాంగ్'లో ప్రధాన నిందితుణ్ని అరెస్టు చేశారు. రూ.1.26కోట్ల విలువైన 1.8 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు శుక్రవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. పశ్చిమ ముంబైకి చెందిన కునాల్ కొటారి.. ముంబైలోని జవేరి బజార్ ఆరామ్ మాల్‌లోని ఏడీ జువెలరీస్‌లో సేల్స్ మేనేజర్. పుణె, ఏపీలోని ఏడీ జువెలరీస్ బ్రాంచిలకు ఆభరణాలను డెలివరీ చేస్తుంటాడు. ఈ క్రమంలో జూలై 26న కునాల్ రూ.కోటిన్నర విలువైన 2.1కేజీల బంగారు ఆభరణాలను తన వద్ద పనిచేసే భరత్‌కుమార్‌కు ఇచ్చి ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో చునాబట్టి బస్టాపు నుంచి ఏపీకి పంపించాడు. భరత్‌కుమార్‌కు అందులో ఉన్న ఆభరణాలేంటి.. వాటి విలువ ఎంతన్నది తెలియదు. 26న రాత్రి ముంబైలో బయల్దేరిన బస్సు 27న ఉదయం హైదరాబాద్ దాటింది. చౌటుప్పల్‌లో ఎన్‌హెచ్-65 పక్కన ధర్మోజిగూడెం పరిధిలో ఓ దాబా వద్ద టీ, టిఫిన్ కోసం డ్రైవర్ బస్సును ఆపాడు. భరత్‌కుమార్ సహా ప్రయాణికులంతా దాబాలోకి వెళ్లారు. అప్పటివరకు బస్సు వెనకాలే కారులో వచ్చిన దొంగల్లో ఇద్దరు అదే అదనుగా బస్సులోకి వెళ్లి బంగారం ఉన్న బ్యాగును ఎత్తుకెళ్లారు. అదే కారులో పరారయ్యారు. టీ తాగి బస్సులోకి వచ్చిన భరత్‌కుమార్ బ్యాగు పోయిందని గుర్తించి వెంటనే కునాల్‌కు సమాచారం ఇచ్చాడు. కునాల్ ముంబై నుంచి వచ్చి చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డికి బంగారం వివరాలు చెప్పి ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాలతో భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర పర్యవేక్షణలోని పోలీసులు సహా మొత్తం నాలుగు పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. ఘటనా స్థలం నుంచి సేకరించిన సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలతో.. మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్ గ్యాంగ్ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లి గాలించారు. ఎట్టకేలకు ప్రధాన నిందితున్ని పట్టుకున్నారు. ముఠాలోని మరో ఇద్దరు దొంగల కోసం రాచకొండ పోలీసులు వేట కొనసాగిస్తున్నారని సుధీర్‌బాబు వెల్లడించారు.



ఊరికి కీడు సోకిందని వనవాసం

- నల్లగొండ జిల్లా అమ్మనబోలును వీడిన 1,300 కుటుంబాలు
- నెల రోజుల్లో 10 మంది మరణించడంతో నిర్ణయం


నిర్మానుష్యంగా మారిన గ్రామంలోని ఓ వీధి

నార్కట్‌పల్లి, ఆగస్టు 9: 1300 కుటుంబాలు, ఐదు వేల మంది జనాభా ఉన్న ఆ ఊరిలో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా నెల రోజుల వ్యవధిలో పది మందికిపైగా మరణించారు. దీంతో ఊరంతా ఏదో తెలియని అలజడి. ఊరికి కీడు సోకడం వల్లే ఈ మరణాలు సంభవిస్తున్నాయని భావించిన గ్రామ పెద్దలు విరుగుడు కోసం.. గ్రామ ప్రజలంతా ఒక రోజు ఊరికి దూరంగా ఉండాలని తీర్మానించారు. ఈ మేరకు ఆ గ్రామ ప్రజలంతా శుక్రవారం తెల్లవారుజామునే తమ ఇళ్లకు తాళాలు వేసి పొలిమేర దాటారు. వెంట తెచ్చుకున్న వంట సామగ్రితో గ్రామ శివారులోని చెట్లు, వ్యవసాయ బావుల వద్ద, మూసీ నది ఒడ్డున వంట చేసుకుని భోజనాలు చేశారు. సూర్యాస్తమయం అయ్యే దాకా అక్కడే గడిపి వనవాసం ముగించుకుని తిరిగి ఇళ్లకు చేరారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామ ప్రజలు ఈ వనవాసం చేశారు. మరి వారి సమస్య పరిష్కారం అవుతుందో లేదో చూడాలి మరీ..!!

నార్కోటిక్స్ సీపీగా నమ్మించి..
డ్రగ్స్ పేరుతో భయపెట్టి

- 80 ఏళ్ల వృద్ధురాలి నుంచి రూ. 22లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): "ఢిల్లీ నుంచి నార్కోటిక్స్ పోలీస్ కమిషనర్‌ను మాట్లాడుతున్నాను. మీ పేరుతో ఢిల్లీలో డ్రగ్స్ పార్సిల్ దొరికింది. మిమ్మల్ని అరెస్టు చేయాలని ఆర్డర్లు ఉన్నాయి" అంటూ ఓ 80 ఏళ్ల వృద్ధురాలిని బెదిరించి సైబర్ నేరగాళ్లు రూ. 22లక్షలు కొల్లగొట్టారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నగరానికి చెందిన వృద్ధురాలికి గురువారం రాత్రి వాట్సాప్ కాల్ వచ్చింది. ఢిల్లీ నార్కోటిక్ విభాగం నుంచి సీపీని మాట్లాడుతున్నానని, మీ పేరుతో మాదక ద్రవ్యాల పార్సిల్ ఢిల్లీకి వెళ్లిందని ఆమెను భయపెట్టారు. వృద్ధురాలిపై కేసు నమోదు చేస్తున్నామని బెదిరించారు. ఆమె బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బును ఆర్‌బీఐ ఆధీనంలో ఉన్న ఖాతాకు వెంటనే బదిలీ చేయాలని, లేదంటే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. దాంతో వారి మాటలు నమ్మిన వృద్ధురాలు తన బ్యాంకు ఖాతాల్లోని రూ. 22లక్షలను వారు చెప్పిన ఖాతాల్లోకి మళ్లించింది. ఆ తర్వాత అవతలి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎన్నికలతోనే కశ్మీర్‌కు న్యాయం

జమ్మూకశ్మీర్‌లో సాధ్యమైనంత త్వరలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ అన్నారు. ఇక్కడి రాజకీయపక్షాలన్నింటితో ఎన్నికల సంఘం బృందం భేటీ అయినప్పుడు, ఆ పార్టీలన్నీ ఏకకంఠంతో వెంటనే ఎన్నికలు జరగాలని డిమాండ్ చేశాయి. సీఈసీతో పాటు ఇద్దరు కమిషనర్లు కూడా ఈ పర్యటనలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ ఉన్నతాధికారులతో, పోలీసు డైరక్టర్ జనరల్‌తో భేటీ అయ్యారు. అన్ని పార్టీలూ తక్షణమే ఎన్నికలు జరగాలని అంటున్నాయనీ, సాధ్యమైనంత త్వరగా ఆ పనిచేస్తామన్న హామీకి తాము కట్టుబడివున్నామని సీఈసీ మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. సెప్టెంబరు ముప్పైలోగా ఎన్నికలు జరిగిపోవాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఒమర్ అబ్దుల్లా మరోసారి గుర్తుచేస్తున్నారు. సెప్టెంబరులో ఎన్నికలు ఖాయమని మొన్ననే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మరో కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే గురువారం శ్రీనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ, అక్టోబర్‌లో రాష్ట్రహోదా పునరుద్ధరణతో పాటు, అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతాయనీ, మహారాష్ట్ర, హర్యాణా, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీలతో పాటు వీటిని నిర్వహిస్తామన్నారు. ఏది నిజమో, ఏమి జరుగుతుందో తెలియదు కానీ, త్వరలో ఎన్నికలు అంటూ ఈసీ ఎంతో కాలంగా ఊరిస్తూండటంతో ఈ సరి కొత్త హామీ కూడా ఎక్కువమందిలో నమ్మకం కలిగించలేకపోతోంది.

ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియదు కానీ, ఏదో హడావుడి అయితే మొదలైంది. ఆర్టికల్ 370 రద్దుచేస్తున్నప్పుడే కేంద్ర హోంమంత్రి అమిత్ షా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా తిరిగి ఇచ్చేస్తామని, ఎన్నికలు కూడా జరిపేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని అక్కడ పర్యటించిన ప్రతీ కేంద్రమంత్రీ గుర్తుచేస్తున్నారు. అమిత్ షా ఆడిన మాట తప్పరని కూడా భరోసా ఇస్తున్నారు. ఈ నెల ఐదవ తేదీకి 370వ అధికరణను రద్దుచేసి ఐదేళ్ళవుతోంది. ప్రత్యేక ప్రతిపత్తిని పీకివేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చేస్తున్నప్పుడు పాలకులు చాలా మాటలు చెప్పారు. ఉగ్రవాదానికి రక్షణకవచంగా ఉంటున్న ఈ అధికరణ తొలగింపుతో శాంతిసుస్థిరతలు వెల్లివిరుస్తాయనీ, మిగతా దేశంతో అసంపూర్తిగా జరిగిన జమ్మూకశ్మీర్ విలీనం ఇక పరిపూర్ణమవుతుందనీ అన్నారు. ఉగ్రవాదం నశించి, వేర్పాటువాదం బలహీనపడి, ఆర్థికవృద్ధి హెచ్చి నయా కశ్మీర్ అవతరిస్తుందన్నారు. 370 రద్దుతో మొత్తమే మారిపోయిందని ప్రధానితో పాటు చాలామంది బీజేపీ నాయకులు వాదిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అది ప్రతిఫలించడం లేదు. సుదీర్ఘకాలం తీవ్రనిర్బంధం అమల్లో ఉంటూ, సైనిక బలగం ఎంతో హెచ్చిన తరువాత అల్లర్లు, నిరసనలు ఆమాత్రం తగ్గుముఖం పట్టడం సహజం. ఉగ్రవాద ఘటనలు పెద్దగా తగ్గకపోగా, జమ్మూకు వ్యాపించడం మరింత భయపెడుతున్నది. దీనికితోడు ఈ ఐదేళ్ళకాలంలో ఆర్థికవృద్ధి మందగించిందనీ, ఉత్పత్తి పడిపోయిందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ప్రత్యేక ప్రతిపత్తి రద్దుకు ముందు కశ్మీర్ మాత్రమే రగిలిపోయేదని, ఇప్పుడు జమ్మూ, లద్దాఖ్ కూడా మండుతున్నాయన్న వ్యాఖ్యలో అసత్యమేమీ లేదు. ఐదేళ్ళక్రితం ప్రత్యేక ప్రతిపత్తి తొలగింపును స్వాగతించిన మిగతా ప్రాంతాలవారు ఇప్పుడు ఆ నిర్ణయం తమకు తీవ్ర నష్టం తెచ్చిందని బాధపడుతున్నారు.

జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగి పదేళ్ళయింది. 2018లో రాష్ట్ర శాసనసభ రద్దయింది. 2019లో ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఆగస్టులో ఆ రాష్ట్రం రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మారిపోయింది. 2022లో డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయినా సరే, ఇప్పటివరకూ ఎన్నికలు జరపకపోవడానికి కారణాలు ఏమిటో తెలియదు. అత్యంత సమస్యాత్మకమైన పరిస్థితుల మధ్య 1996లో సైతం అక్కడ ఎన్నికలు నిర్వహించగలిగినప్పుడు, ఇప్పుడు ఎందుకు సాధ్యంకాదని నాయకులు అడుగుతున్నారు. ఎన్నికల నిర్వహణకు ఉగ్రవాదం అడ్డుకాబోదనీ, వరుస ఉగ్రవాద దాడులు తమను నిలువరించలేవనీ అటు ఎన్నికల సంఘం అధికారులు, ఇటు లెఫ్టినెంట్ గవర్నర్ ఎంతో గంభీరంగా చెబుతున్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఏలుబడిలో అభివృద్ధి అద్భుతంగా ఉన్నదనీ, ప్రజలు మెచ్చుకుంటున్నారని బీజేపీ నాయకులు అంటున్నారు. మరి, ఎన్నికల నిర్వహణకు వారిని నిలువరిస్తున్నదేమిటో తెలియదు. రాష్ట్ర హోదాను పునరుద్ధరించిన తరువాతే ఎన్నికలు జరపాలని చాలామంది కోరిక. ఐదేళ్ళక్రితం చేసిన అన్యాయాన్ని సాధ్యమైనంత వేగంగా సరిదిద్దాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వం మీద ఉంది.

ప్రజాస్వామ్య లోటుతో బంగ్లా ప్రళయం

జూలై 4, 1776న పదమూడు అమెరికా రాష్ట్రాలు తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. ఫ్రెంచ్ విప్లవం సంభవించి రెండు శతాబ్దాలకు పైగా గడిచిపోయింది. బ్రిటిష్ సామ్రాజ్యం నుంచి స్వేచ్ఛ పొందిన తొలి వలస రాజ్యం ఆస్ట్రేలియా (1901లో). భారత్ 1947లో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నది. అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా ఇప్పటికీ స్వతంత్ర, ప్రజాస్వామిక దేశాలుగా వర్ధిల్లుతున్నాయి. వలస పాలనా శక్తుల (బ్రిటన్, ఫ్రాన్స్, బెల్జియం, పోర్చుగల్ మొదలైనవి) నుంచి విముక్తి పొందిన దేశాలన్నీ చిరకాలం నిజంగా 'స్వతంత్ర' దేశాలుగా లేవు. పలు దేశాల పౌరులు అందరూ పౌర స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు పూర్తిగా నోచుకోవడం లేదు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షికమైన ఎన్నికలలో తాము కోరుకుంటున్న వారిని ఎన్నుకోలేని దుస్థితి నెదుర్కొంటున్నారు. ఒక అంచనా ప్రకారం ప్రపంచ జనాభాలో కేవలం 20 శాతం మంది మాత్రమే నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందుతున్నారు. ప్రజాస్వామిక హక్కులను అనుభవిస్తున్నారు. ఆ అదృష్ట భాగ్య దేశాలలో భారత్ కూడా ఉన్నది. ఇది మనకు సంతోషకరమేకాదు, గర్వకారణం కూడా.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రజాస్వామ్యం ఒకరు ఇచ్చేది కాదు. మరొకరి నుంచి స్వీకరించేదీ కాదు. ఆగస్టు 14, 1947న పాకిస్థాన్ స్వతంత్ర దేశంగా ప్రభవించింది. అయితే అనేకమార్లు సైనిక నియంతృత్వ పాలనలోకి వెళ్లింది. మన మరో పొరుగు దేశం (తొలుత పాకిస్థాన్‌లో ఒక రాష్ట్రంగా ఉన్న) బంగ్లాదేశ్ పాకిస్థాన్‌ను ఏలిన సైనిక ప్రభుత్వాల పద ఘట్టనలో దశాబ్దాల పాటు నలిగిపోయింది. సైనిక పాలకులపై తిరుగుబాటుగా గెరిల్లా ఉద్యమం ఆరంభమయింది. క్రమేణా బలోపేతమై విముక్తి పోరాటంగా పరిణమించింది. భారత్ జోక్యంతో 1971లో బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. 1975–91 సంవత్సరాల మధ్య పలువురు సైనిక పాలకులు వచ్చారు, పోయారు. ప్రధాన రాజకీయ పక్షాలు అవామీ లీగ్, బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) కలసికట్టుగా సైనిక పాలకులను వ్యతిరేకించాయి. ప్రజాస్వామ్యం కోసం పోరాడాయి. 1991లో పౌర ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అవామీ లీగ్ అధినేత్రి బేగం షేక్ హసీనా ప్రధాన మంత్రిగా 1996లో ప్రప్రథమంగా ఎన్నికయ్యారు. ఆ తరువాత 2008, 2014, 2019, 2024లో ఆమె ప్రధానమంత్రిగా ఎన్నికవుతూ వచ్చారు. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఎన్నికలను ప్రతిపక్షాలు బాయ్‌కాట్ చేశాయి.

షేక్ హసీనా నేతృత్వంలో బంగ్లాదేశ్ గణనీయమైన ఆర్థిక పురోగతిని సాధించింది. బంగ్లా తలసరి ఆదాయం భారత్ తలసరి ఆదాయం కంటే అధికం. శ్రీలంక, పాకిస్థాన్, నేపాల్ మొదలైన ఇతర దక్షిణాసియా దేశాల కంటే కూడా బంగ్లాదేశ్ ముందంజ వేసింది. మానవాభివృద్ధి సూచీలో బంగ్లాదేశ్, శ్రీలంక తరువాయి స్థానంలో ఉన్నది; భారత్, నేపాల్, పాకిస్థాన్ కంటే ఉన్నత స్థాయిలో ఉన్నది. బంగ్లాదేశ్‌లో శిశు మరణాల రేటు భారత్‌లో కంటే తక్కువగా నమోదవుతోంది. ఇదిలా ఉంటే ఎన్నికల నిర్వహణలో ఢాకా పాలకుల వ్యవహార శైలిని ఫ్రీడమ్ హౌజ్ నివేదిక తూర్పార బట్టింది. అలాగే పత్రికా స్వాతంత్ర్యం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విషయంలో కూడా బంగ్లా పాలకుల తీరుతెన్నులు అంతర్జాతీయ సంస్థల ఆమోదాన్ని పొందలేదు. ప్రజాస్వామ్య స్వేచ్ఛలను అదుపు చేస్తే లేదా నిరుద్యోగిత, అసమానతలు, వివక్షలపై ప్రజల అసంతృప్తి తగ్గితేనే ఆర్థికాభివృద్ధి సుసాధ్యమవుతుందని పాలకులు భావించడం కద్దు. అయితే ఇది చాలా చాలా అరుదుగా మాత్రమే నిజం. బంగ్లాదేశ్‌లో పాలకుల పట్ల ప్రజల వ్యతిరేకత మహోధృతంగా వెల్లువయింది. ప్రభుత్వోద్యోగాలలో వివక్షా పూరిత, ఆశ్రిత పక్షపాత రిజర్వేషన్ల విధానంతో విద్యార్థిలోకం ఆగ్రహావేశాలకు అవధులు లేకపోయాయి. ప్రజాస్వామ్య ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లాయి.



ప్రజలు పూర్తిగా ఆశాభావాన్ని కోల్పోయినప్పుడే సామూహికోద్యమాలు ప్రజ్వరిల్లుతాయి. స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని మార్చివేసే మార్గం పూర్తిగా మూసుకుపోయినప్పుడు ప్రజల అసంతృప్తి, ఆగ్రహానికి అంతు ఉండదు. ప్రజాందోళనలు ఒకసారి ప్రారంభమయితే అందులో సామాన్య ప్రజలు మాత్రమే ఉండరు. తీవ్రవాద శక్తులు, ఉగ్రవాద బృందాలు కూడా పాల్గొంటాయి. బంగ్లాదేశ్‌లో ఇదే జరిగింది.

ఇదిలా వుండగా ఆర్థిక వ్యవస్థ పెరుగుదల మందగించింది. ధరలు పెరిగాయి. ఉద్యోగాలు మృగ్యమయ్యాయి. పరిస్థితులు విషమిస్తున్నాయన్న వాస్తవాన్ని షేక్ హసీనా గుర్తించలేదు. గుర్తించినా నిరాకరిస్తూ వచ్చింది. ఇది నియంతలు అందరూ చేసే తప్పే. రిజర్వేషన్ల విధానం ఆందోళనాగ్నులకు ఆజ్యం పోసింది. అవినీతి, పోలీసు క్రౌర్యాలు, న్యాయవ్యవస్థ ఉదాసీనత మొదలైనవి కూడా బంగ్లా ప్రజల ఆందోళనను మరింత తీవ్రం చేశాయి. పర్యవసానాలు సుపరిచితమైన కథే కదా. సకల జనులు వీధుల్లోకి వచ్చారు. పోటెత్తారు. పోరాటాల వెల్లువలకు అడ్డు లేకపోయింది. ఇటువంటి పరిణామాలు ప్రభుత్వాలను కూల్చివేయడం సహజమే.

ప్రజలు పూర్తిగా ఆశాభావాన్ని కోల్పోయినప్పుడే సామూహికోద్యమాలు ప్రజ్వరిల్లుతాయి. స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని మార్చివేసే మార్గం పూర్తిగా మూసుకుపోయినప్పుడు ప్రజల అసంతృప్తి, ఆగ్రహానికి అంతు ఉండదు. ప్రజాందోళనలు ఒకసారి ప్రారంభమయితే అందులో సామాన్య ప్రజలు మాత్రమే ఉండరు. తీవ్రవాద శక్తులు ఉగ్రవాద బృందాలు కూడా పాల్గొంటాయి బంగ్లాదేశ్‌లో ఇదే జరిగింది. వివిధ సంస్థలు, పలువురు వ్యక్తులు ఈ వాస్తవాన్ని ధ్రువీకరించారు. విదేశీ జాతీయులు, మైనారిటీ వర్గాలు ఉద్యమ తీవ్రతను చవిచూడడం అనివార్యమవుతుంది. అల్పసంఖ్యాక వర్గాల గృహాలపై దాడులు జరుగుతాయి. వారి వ్యాపార సంస్థలు, ఆరాధనా మందిరాలను ధ్వంసం చేస్తారు.

బంగ్లాదేశ్‌లో పరిస్థితులు అందుకు భిన్నమైనవి కావు. చాలా దేశాలలో అటువంటి ఉపద్రవాలలో మైనారిటీలు తీవ్ర ఇక్కట్లనే ఎదుర్కొన్నారు. కారణమేమిటి? ప్రజాస్వామ్య లోటు. దానివల్లే ప్రజలు వీధుల్లోకి వచ్చి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం అనివార్యమవుతుంది. పరిష్కారమేమిటి? ప్రజాస్వామ్య లోటును పూరించడమే. ప్రజాస్వామ్య లోటును పూరించడమనే కళలో అమెరికా, బ్రిటన్‌లు దాదాపుగా సమగ్ర ప్రావీణ్యాన్ని, పరిణతిని సాధించాయి. పార్టీలోను, పార్లమెంటులోను, ప్రజలలోను అసంతృప్తి తీవ్రమయినప్పుడు బ్రిటిష్ ప్రధానమంత్రులు థాచర్, జాన్సన్, మే స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలిగి కొత్త నాయకుడిని ఎన్నుకొనే అవకాశాన్ని తమ పార్టీకి కల్పించారు. అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్, జో బైడెన్‌లు అధ్యక్ష పదవికి మళ్లీ పోటీ చేసేందుకు నిరాకరించారు. జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసి ప్రభుత్వాధినేతల రాజీనామాలు సాధించవచ్చు. పదవీకాల పరిమితులు కూడా చాలా ఉపయోగపడతాయి. పత్రికా స్వేచ్ఛ సంపూర్ణంగా ఉంటే పరిస్థితులను చక్కదిద్దడం మరింత తేలికవుతుంది సుప్రీంకోర్టు అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్య కాపలాదారుగా వ్యవహరించడం వల్ల చాలా మేలు జరుగుతుంది. స్వతంత్ర ఎన్నికల సంఘం ప్రతి ఐదేళ్లకు ఒకసారి విధిగా ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించడం వల్ల పేదలు, అణగారిన వర్గాలవారు, నిర్లక్ష్యానికి గురవుతున్న వారికి ఎంతైనా ఉపశమనం కలుగుతుంది. పార్లమెంటు ప్రతి నెలా విధిగా సమావేశమవుతూ సభాపతి అనవసర జోక్యం లేకుండా ప్రతి రోజూ అధికార, ప్రతిపక్షాల మధ్య వాద ప్రతివాదనలు అనుమతించడమే ప్రజాస్వామ్య లోటుకు అంతిమ సమాధానమని నేను భావిస్తున్నాను.

ప్రజాస్వామ్య లోటుకు బంగ్లాదేశ్ భారీ మూల్యాన్ని చెల్లించింది. ప్రజా ప్రళయాగ్నులలో ఆహుతి అయిన వారి కోసం నేను దుఃఖిస్తున్నాను.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

కమ్యూనిస్టు చైనా గుట్టువిప్పిన 'నిప్పుకణాలు'!

'గతాన్ని ఎవరైతే నియంత్రిస్తారో వారే భవిష్యత్తునూ నియంత్రిస్తారు. వర్తమానాన్ని ఎవరైతే నియంత్రిస్తారో వారే గతాన్నీ నియంత్రిస్తారు'– జార్జి ఆర్వెల్ నవల '1984' లోని సుప్రసిద్ధ వాక్యాలవి. ఈ వ్యాఖ్యలు నియంత స్టాలిన్ కాలం నాటి రష్యాను ఉద్దేశించి చేసినవి. అయితే ఆర్వెల్ సుభాషితం పూర్తిగానో పాక్షికంగానో అధికార పక్షం, దాని అధినేత తమకు అనుకూలంగా ఉండే చరిత్ర కథనాలను వృద్ధులు, యువజనులు; స్త్రీ పురుషులు; ధనికులు, దరిద్రులు... జనాభాలో ప్రతి ఒక్కరిపై రుద్దేందుకు ప్రయత్నించే నిరంకుశ పాలనా వ్యవస్థలు అన్నిటికీ వర్తిస్తుంది.

సాపేక్షంగా బహిరంగ సమాజం (ఓపెన్ సొసైటీ)లో పాలకులకు ఆమోదయోగ్యమయ్యే ఏ ఒక్క తరహా చరిత్రను మొత్తం ప్రజలు అందరిపై రుద్దలేరు. ఉదాహరణకు అమెరికాలో రిపబ్లికన్లు అధికారంలో ఉన్నప్పుడు జాతి సంబంధాలు ఎలా ఉండేవో, ఎలా ఉండాలో అన్న విషయమై తమ దృక్పథాన్ని రుద్దడానికి ప్రయత్నించవచ్చు. అయితే జాతి సంబంధిత పరిణామాలను భిన్నంగా అర్థం చేసుకున్నవారు ఆ కథనాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం, సవాల్ చేయడం తప్పక జరుగుతుంది. భారత్ లాంటి లోపభూయిష్టమైన లేదా పాక్షిక ప్రజాస్వామ్య వ్యవస్థలో కూడా గతాన్ని గురించి ప్రభుత్వ ప్రాయోజిత దృక్పథాలు, కథనాలపై తీవ్ర చర్చలు జరుగుతాయి. ఉదాహరణకు హిందూ–ముస్లిం సంబంధాలపై స్వాభిప్రాయబద్ధమైన కథనాలను ప్రజలకు నివేదించేందుకు మోదీ ప్రభుత్వం తన శక్తియుక్తులు, వనరులు సమస్తాన్ని సంపూర్ణంగా ఉపయోగించుకున్నది. నవ భారతదేశ నిర్మాణానికి ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేసిన అనుపమేయమైన కృషిని, ఆయన అనితరసాధ్యమైన సేవలను తక్కువ చేసేందుకు కూడా మోదీ సర్కార్ చాలా శ్రద్ధగా నిరంతరం పని చేసింది. అయినప్పటికీ ప్రభుత్వ వైఖరిని అంగీకరించని, నిర్ద్వంద్వంగా తిరస్కరించే వెబ్‌సైట్‌లు, ప్రచురణ సంస్థలు, యూట్యూబ్ చానెల్స్, వార్తాపత్రికలు ఎన్నో ఉన్నాయి. ఆ చారిత్రక అంశాలను భిన్నంగా అవగాహన చేసుకున్నవారు ప్రభుత్వ వాదనలను తీవ్రంగా ఖండిస్తున్నారు. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడిస్తున్నారు. ఈ స్వతంత్ర ఆలోచనాశీలురను అదుపు చేసే లక్ష్యంతోనే మోదీ ప్రభుత్వం ఒక కొత్త 'బ్రాడ్ కాస్టింగ్ బిల్లు'ను తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది.

ఎలా ఆలోచించాలి, ఎలా ఆలోచించకూడదు అంటూ ప్రజల ఆలోచనలను నియంత్రించడంలో చైనా కమ్యూనిస్టు పార్టీ(సిపిసి)కి సాటిరాగల సంస్థ మరేదీ మన కాలంలో లేదనడం సత్యదూరం కాదు. చైనా గతం, వర్తమానం, భవిష్యత్తు విషయమై చారిత్రక కథనాలు ఎలా ఉండాలన్న దానిపై సిపిసి నాలుగు నిర్దేశాలు చేసింది. అవి: 1) కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడూ సరైన విధంగానే వ్యవహరిస్తుంది, తప్పు చేయదు. నాయకుడు (ఒకప్పుడు మావో, ఇప్పుడు జిన్‌పింగ్) సదా సబబుగా, నిర్దుష్టంగా, అమోఘంగా వ్యవహరిస్తారు; 2) పార్టీ కార్యకర్తలు, అధికారులు, మరీ ముఖ్యంగా మహానాయకుడు రేయింబవళ్లు, ఆరు రుతువులూ చైనా సర్వతోముఖ అభివృద్ధికి అవిరామంగా పనిచేస్తుంటారు. ప్రజలకు సుఖసంతోషాలు సమకూర్చడం, జాతిని సర్వశక్తిమంతం చేయడమే ధ్యేయంగా వారి కార్యకలాపాలు సాగుతాయి; 3) పార్టీని దాని విధానాలను, ఆచరణలను విమర్శించేవారు జాతి శత్రువులు, విదేశాల ప్రోద్బలంతోనే వారు ఆ విమర్శలకు పాల్పడుతున్నారు; 4) ఆ విమర్శలను పార్టీ దృఢంగా, సత్వరమే ఖండించి,



ప్రజల ఆలోచనలను నియంత్రించడంలో చైనా కమ్యూనిస్టు పార్టీకి సాటి రాగల సంస్థ మరేదీ మన కాలంలో లేదు. కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తున్నవారు, మాట్లాడుతున్న వారు చంపివేయబడడం సర్వసాధారణం. ఆ పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్న, అధికారిక వాదనలకు భిన్నమైన కథనాలను ప్రజలకు నివేదించేందుకు సాహసించిన కొంతమంది మేధావులు, విద్యావేత్తల గురించి ఇటీవల ఒక పుస్తకం విశాల ప్రపంచానికి తెలియజేసింది. అప్తులు, ఆత్మీయులను కోల్పోయిన బాధే కమ్యూనిస్టు పాలనలోని చీకటి కోణాలను ప్రజలకు నివేదించేలా వారిని పురిగొల్పాయి.

విమర్శకులను తొలగించని పక్షంలో 1949లో కమ్యూనిస్టులు, అధికారానికి రాకముందు ఉన్న అల్లకల్లోల పరిస్థితులు పునరావృతమవుతాయి. విభజనలు, అంతర్యుద్ధంతో దేశం అతలాకుతలమవుతుంది. పాశ్చాత్య దేశాల దుష్ట ప్రభావంలోకి మళ్లీ వెళుతుంది.

చరిత్రపై పార్టీ దృక్పథానికి భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేయడమనేది అమెరికాలో వలే కాదుకదా భారత్‌లో కంటే కూడా చైనాలో చాలా చాలా కష్టం. 1949 నుంచి కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తున్నవారు, మాట్లాడుతున్నవారు ఉద్యోగాల నుంచి తొలగించబడడం, అరెస్ట్ కావడం చిత్రహింసలకు గురవడం, అంతిమంగా చంపివేయబడడం చాలా సాధారణమైపోయింది. అటువంటి పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్న, ఆధునిక చైనా చరిత్ర, ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర గురించి అధికారిక వాదనలకు భిన్నమైన కథనాలను ప్రజలకు నివేదించేందుకు సాహసించిన కొంతమంది మేధావులు, కళాకారులు, విద్యావేత్తలు, సృజనశీలురు గురించి ఇటీవల ఒక పుస్తకం విశాల ప్రపంచానికి తెలియజేసింది. చైనాలో సుదీర్ఘకాలం విలేఖరిగా పనిచేసి చివరకు బీజింగ్ పాలకులచే బహిష్కరణకు గురైన పాత్రికేయుడు, రచయిత ఇయాన్ జాన్సన్ రాసిన. 'Sparks: China's Underground Historians and their Battle for the Future' గురించి నేను ప్రస్తావిస్తున్నాను.



■ రామచంద్ర గుహ

గతానుగతం

మనస్తత్వంలో చంచల స్వభావం, హంతక ప్రవృత్తి మిళితమై ఉన్న విలక్షణ నాయకుడు మావో. 1956లో వివిధ అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వేయి పువ్వులు వికసించాలని, వేయి ఆలోచనలు వర్ధిల్లాలని ఆయన నినదించారు. చైనా ప్రజలు మావో పిలుపునకు ప్రతిస్పందించారు. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయసాగారు. దీంతో మావో తన మాట మార్చారు. తన విజ్ఞప్తిని ఉపసంహరించుకున్నారు. మితవాద ధోరణుల వ్యతిరేక పోరాటం పేరిట రచయితలు, విద్యార్థులు, న్యాయవాదులు, మేనేజర్లు, సివిల్ సర్వెంట్లు, శాస్త్రవేత్తలను, ఇంతెందుకు సొంతంగా ఆలోచించగల సామర్థ్యమున్న వారిని తీవ్ర ఇక్కట్లపాలు చేశారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయాలు, పాఠశాలలు, పరిశోధన కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు ధ్వంసమయ్యాయి. వేలాది బుద్ధిజీవులను నిర్బంధ శ్రమ శిబిరాలకు తరలించారు. మిగిలిన వారిని లొంగదీసుకుని, అణచివేశారు. పార్టీ ఆదేశాలను సర్వత్రా ప్రతి ఒక్కరూ పాటించేలా చేశారు.

జాన్సన్ విపులంగా రాసిన అజ్ఞాత చరిత్రకారులలో చాలా మంది జైలుపాలయిన లేదా చంపివేయబడ్డ వారి బిడ్డలు లేదా తోబుట్టువులే. ఆప్తులు, ఆత్మీయులను కోల్పోయిన బాధే కమ్యూనిస్టు పాలనలోని చీకటి కోణాలను ప్రజలకు నివేదించేలా వారిని పురిగొల్పాయి. గ్రేట్ లీప్ ఫార్వర్డ్, సాంస్కృతిక విప్లవం, టిబెట్ ఆక్రమణ, 'మహానాయకుడు' రూపొందించి స్వీయ పర్యవేక్షణలో అమలుపరిచిన కార్యక్రమాలు, ప్రాజెక్టుల వాస్తవాల గురించి తమ రచనల ద్వారా ప్రజలకు తెలియజేసేందుకు వారు సాహసించారు. జాన్సన్ పేర్కొన్న చరిత్రకారులు, ఇతర మేధావులలో చాలా మంది 21వ శతాబ్ది తొలి దశకంలో చురుగ్గా ఉన్నవారు. అప్పట్లో అసాధారణ బహిరంగతత్వం అమల్లో ఉండేది. ఇంటర్నెట్ వారికొక ఆలంబనగా ఉండేది. ఆ మీడియం ద్వారా వారు తమ రచనలు, సినిమాలకు స్వేచ్ఛగా పరిమిత స్థాయిలో ప్రాచుర్యం కల్పించారు. మరికొంత మంది 1980ల నుంచి క్రియాశీలంగా ఉన్నారు. ఆ దశకంలో వర్ధిల్లిన కళా, సృజనాత్మక స్వేచ్ఛ 1989లో జూన్‌లో తియనాన్మెన్ స్క్వేర్ ఊచకోతలతో ముగిసింది.

2012లో జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ స్వతంత్ర చరిత్రకారుల మేధోకృషికి పరిస్థితులు మరింత ప్రతికూలమయ్యాయి. జిన్‌పింగ్ అధికారానికి వచ్చిన తొలి రోజులలోనే చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్రను సాధ్యమైనంతగా ఒక మహోజ్వల గాథగా ప్రజలకు నివేదించేందుకు ఒక కార్యక్రమాన్ని ప్రారంభించి, లక్ష్య నిర్దేశం చేశారు. ఇందుకు చాలా పెద్ద సంఖ్యలో చరిత్రకారులను నియోగించారు. కమ్యూనిస్టు పార్టీ 'మహా విజయాలు, అద్వితీయ సాఫల్యాల'ను సువర్ణాక్షరాలతో లిఖించాలని వారిని ఆదేశించారు. మావో కాలంలో వలే జిన్‌పింగ్ హయాంలో కూడా స్వతంత్ర మేధావుల కష్టాలు మిక్కుటమయ్యాయి. అయినప్పటికీ కొంతమంది మేధావులు ఆ పరిస్థితులకు ధైర్య సాహసాలతో ఎదురీదారు. జాన్సన్ ఇలా రాశారు: 'నిజమేమిటంటే చైనా స్వతంత్ర చింతన సజీవంగా ఉన్నది. అది ఎప్పుడూ నామరూపాలు లేకుండా పోలేదు'. 'కమ్యూనిస్టు పార్టీయే ఎల్లప్పుడూ గెలవలేదు' అనే సత్యాన్ని కొంతమంది రచయితలు, జర్నలిస్టులు, కళాకారులు, సినిమా స్రష్టలు ప్రజలకు చెప్పడాన్ని కొనసాగిస్తారు.

జాన్సన్ 'నిప్పు కణాలు' నన్ను అప్రతిభుడిని చేశాయి. ఆ స్వతంత్ర చరిత్రకారుల నైతిక స్థైర్యం, భౌతిక ధైర్యమే కాదు వారి మేధా స్పష్టత కూడా నన్ను ఆశ్చర్యపరిచింది. కమ్యూనిస్టు చైనాలో చరిత్ర రచన, బోధన గురించి జియాంగ్ జుయె అనే రచయిత్రి ఏమన్నారో చూడండి: 'మావో, మనం చరిత్రను పునర్లిఖించాలని అన్నారు. అయితే చరిత్ర సంభవించింది. తిరిగి రాయడానికి అదొక నవల కాదు. దానినెలా మీరు తిరిగి రాయగలరు? ధర్మాధర్మ విచక్షణ ఉన్నవారెవరైనా సరే తిరగరాసిన చరిత్రను తిరస్కరించి తీరుతారు'. ఝాంగ్ షిహె అనే పాత్రికేయుడు ఇలా అన్నాడు: 'ఏదైనా ఒక అపకారం ప్రజలకు జరగడాన్ని చూసినప్పుడు నిజంగా ఆగ్రహం చెందే వ్యక్తులలో నేనూ ఒకరిని. తత్కారణంగా ఆ యధార్థ ఘటనల గురించి మాట్లాడాలి గనుక నేను భిన్న దృక్పథంతో రాస్తున్నాను'. విద్యావేత్త అయిన చెన్ హింగ్యుయో ఇలా ఎత్తి పొడిచారు: "మన కాలం రాజకీయాలు 'గుడ్డివాళ్లను ముందుకు తీసుకు వెళుతున్న ఉన్మాదుల' తరహా వ్యక్తులవి కావూ?" మళ్లీ జియాంగ్ జుయె వద్దకు వెళదాం: ప్రత్యామ్నాయ రీతిలో నీవు చేస్తున్న చరిత్ర రచనా కృషి వ్యర్థమైనది, అసంగతమైనది. కమ్యూనిస్టు చైనా లాంటి నిరంకుశ పాలన వ్యవస్థ ఉన్న సమాజంలో ఆ చరిత్ర ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు అన్న తన స్నేహితురాలి ఆక్షేపణకు జుయె ఇలా ప్రతిస్పందించారు. 'నేను విభేదిస్తున్నాను. భిన్న దృక్పథంతో రాయడానికి ప్రయత్నిస్తే అది ప్రాధాన్యం పొందుతుంది. ఒక విపరీత సమాజంలో ఒక మామూలు వ్యక్తిగా నేను ఉండదలిచాను. సత్యసమ్మతమైన విషయాలను నేను చెప్పదలుచుకున్నాను. నా హృదయంలోని ఘోషలను వ్యక్తం చేయాలన్నదే నా ఆరాటం'.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

మన కోచింగ్ సెంటర్లపైనా ఓ కన్నేసి ఉంచాలి!

భారీ వర్షాల కారణంగా మురుగు కాలువ పొంగిపొర్లి ఢిల్లీలో ఒక సివిల్ సర్వీస్ శిక్షణా సంస్థలో బేస్‌మెంట్ లైబ్రరీలోకి వరద నీరు ఉధృతంగా ప్రవహించిన దుర్ఘటనలో ముగ్గురు విద్యార్థులు జల సమాధి కావటం యావత్ దేశాన్ని కలిచివేసింది. చనిపోయిన ముగ్గురిలో ఒకరైన తానియా సోనీ తండ్రి మంచిర్యాల సింగరేణిలో సీనియర్ మేనేజర్ కావడంతో తెలంగాణ అంశం తెరపైకి వచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తానియా సోనీ మృతదేహాన్ని తరలించడంలో తండ్రి విజయ్ కుమార్‌కి సహాయ సహకారాలు అందించాల్సిందిగా ఢిల్లీ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌కి ఆదేశాలు జారీ చేశారు.

మన తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో అనుమతి లేని పలు కోచింగ్ సెంటర్లు, స్టడీ హాళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇప్పుడు ఈ కోచింగ్ సెంటర్లు, స్టడీ హాళ్లు వరంగల్ మరియు ఇతర జిల్లా కేంద్రాలకు కూడా విస్తరించాయి. హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్ల మూలంగా అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్‌లు నిరుద్యోగుల కూడళ్ళుగా పేరుపొందాయి.



అడ్డు అదుపులేని కోచింగ్ సెంటర్లపై మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ యూపీఏ ప్రభుత్వం తొలుత దృష్టి పెట్టింది. కోచింగ్ సెంటర్లను సేవారంగంలోకి తెచ్చి వాటిపై పన్నులు వేశారు. 18 జనవరి 2024న భారత ప్రభుత్వం కోచింగ్ సెంటర్ల నియంత్రణ కోసం విద్యా మంత్రిత్వశాఖ ద్వారా కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మార్గదర్శకాలు ఎక్కడా అమలు కావడం లేదు.

మన రాష్ట్రంలో హైదరాబాద్ అశోక్‌నగర్‌లో గ్రూప్ 1, 2, 3, సివిల్ సర్వీసెస్ కోచింగ్ సెంటర్లు ఎక్కువగా ఉండగా దిల్‌సుఖ్‌నగర్‌లో డీఎస్సీ, ఎస్సై/ కానిస్టేబుల్, గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (GATE), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (SSC), రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ (RRB), బ్యాంకింగ్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (BSRB), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఫర్ అడ్మిషన్స్ (IIMs) ఇన్ ఎంబీఏ సంస్థ నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ (CAT) వంటి శిక్షణను ఢిల్లీకి చెందిన అనేక శిక్షణా సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా దిల్‌సుఖ్‌నగర్‌లోను, ఇతర ప్రాంతాల్లోను నిర్వహిస్తున్నాయి. ఇక అమీర్‌పేట్‌లో కేవలం సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లతోపాటు టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ యాజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్ (TOEFL), ప్రపంచవ్యాప్త బిజినెస్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్స్ (GRE) కోచింగ్ సెంటర్లు ఉన్నాయి.

రాష్ట్రంలో అత్యధిక కోచింగ్ సెంటర్లకు ఎటువంటి అనుమతులు ఉండవు. కేవలం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నామమాత్రపు రుసుముతో ఒక వ్యాపార సంస్థగా నమోదు చేసుకుంటారు. కోచింగ్ సెంటర్లు నడుపుతున్న భవనాలకి భవన యజమానులు అగ్నిమాపక శాఖ విధించిన రక్షణ నిబంధనలు పాటించరు. గృహ అవసరాలకు అని ముందుగా విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకుని ఆ భవనాలను కోచింగ్ సెంటర్‌లు నడుపుకోవటానికి వాడుకుంటూ విద్యుత్ శాఖ ఆదాయానికి గండి కొడుతున్నారు. తనిఖీకి వచ్చిన జీహెచ్ఎంసి, విద్యుత్ శాఖ అధికారుల జేబులు నింపుతూ జరిమానాల నుంచి తప్పించుకుంటున్నారు. ఆ శిక్షణా సంస్థల్లో ఎంతమంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు, వారు ఎంతెంత ఫీజులు చెల్లిస్తున్నారు అనేటువంటి లెక్కల పత్రాలు ఉండవు. తరగతి గదిలో శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థి పైన జీఎస్టీ వంటి పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటూ అవినీతికి పాల్పడుతున్నారు. జీతాలు లేదా ప్యాకేజీలు ఇచ్చే బోధనా సిబ్బంది నుంచి టీడీఎస్ (టాక్స్ డిటెక్టెడ్ సర్వీస్) చెల్లించరు. ఇరుకుగా వెలుతురు లేని గదుల్లో 100 మంది కూర్చోవాల్సిన చోట సుమారు 500మందిని కూర్చోబెట్టి బోధిస్తున్నారు. వందలాదిమంది విద్యార్థులకు ఒకటి రెండు అపరిశుభ్రమైన మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉంచి విద్యార్థి, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు.

రాష్ట్రంలో 33 జిల్లాలకి ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే సుమారు 13 ఎస్సీ ఎస్టీ బీసీ స్టడీ సర్కిల్స్ ఉన్నాయి. వాటిలో ఎస్సై, కానిస్టేబుల్, డీఎస్సీ, గ్రూప్స్, సివిల్స్ సర్వీసెస్ వంటి శిక్షణ లభిస్తుంది. ప్రభుత్వ స్టడీ సర్కిళ్లలో ప్రవేశాల కోసం పోటీ పరీక్ష పెట్టి ప్రతిభ ఆధారంగా పరిమితమైన సీట్లలో నిరుద్యోగులను చేర్చుకొని శిక్షణ ఇస్తారు. ప్రభుత్వ స్టడీ సర్కిళ్లలో సీటు రానివాళ్లు ఇష్టం లేకున్నా ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది లక్షల కన్నా ఆదాయం తక్కువగా ఉన్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష ఉత్తీర్ణులై సివిల్స్ మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థులకు రాజీవ్‌గాంధీ సివిల్ అభయహస్తం పేరుతో సింగరేణి సంస్థ ద్వారా లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేయడాన్ని ఈ సందర్భంగా మనమంతా అభినందించాలి. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో సివిల్ సర్వీసెస్, ప్రిలిమ్స్ మెయిన్స్‌కి రూ.1,50,000వేలు; గ్రూప్ వన్ ప్రిలిమ్స్ మెయిన్స్‌కి రూ.1,00,000; గ్రూప్ 2, గ్రూప్ 3కి రూ.22 వేలు; డీఎస్సీకి రూ.20వేలు; ఎస్సై కానిస్టేబుల్ కోచింగ్‌కి రూ.20 వేలు; ఐఐటి, నీట్, ఎంసెట్, కోచింగ్‌లకు రూ.2లక్షల 50వేలు, ఇతర కోచింగ్‌లైన గేట్, క్యాట్, టోఫెల్, జీఆర్‌ఈల ఫీజు సుమారు ఒక లక్ష వరకు ఉంటుంది. అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్న కొన్ని కోచింగ్ సెంటర్లను నియంత్రించాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వానికి ఉంది. వీటి నియంత్రణకు అసెంబ్లీలో చట్టం తీసుకువచ్చి తల్లిదండ్రులపై ఫీజుల భారం పడకుండా విద్యార్థి నిరుద్యోగుల శ్రేయస్సుకు పాటుపడాలి.

■ కోటూరి మానవతారాయ్
టీపీసీసీ అధికార ప్రతినిధి

రైతుకు పట్టం కట్టిన ప్రభుత్వం

వ్యవసాయ కుటుంబంలో పుట్టి, వ్యవసాయ రంగ సాధక బాధకాలను అనుభవంతో తెలుసుకున్న వ్యక్తిత్వంతో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. తెలంగాణ సామాజిక వ్యవస్థ నిర్మాణం, భౌగోళిక వాతావరణంపై అవగాహన కలిగిన రేవంత్‌రెడ్డి రైతుకు లబ్ధి చేకూరేవిధంగా ప్రభుత్వ విధివిధానాలను రూపొందించారు. వాటికి అనువుగానే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జూలై 25న రూ.2,91,191 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకి పెద్దపీట వేశారు. కుటుంబ సభ్యులంతా శ్రమించే చిన్న రైతులు, కుటుంబమంతా శ్రమిస్తూ ఉన్నా చాలినంత భూమిలేని సన్నకారు రైతుల చేతిలో 87శాతం సాగు భూమి ఉంది. వీరికి వ్యవసాయం ఒక పండగ అయ్యేలా ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో అనేక ఉద్దీపనలను ఇచ్చింది.

2030 వరకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలని ఐక్యరాజ్యసమితి నిర్దేశించింది. ఈ లక్ష్యాలలో పేదరికాన్ని, ఆకలిని రూపుమాపటం, చక్కటి ఆరోగ్య జీవనం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం సాధన వంటివి అగ్రశ్రేణి లక్ష్యాలు. వీటిలో మొదటి రెండు లక్ష్యాల సాధనకు వ్యవసాయ రంగ అభివృద్ధి కీలకం. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు రూ.26,831 కోట్లను కేటాయించారు. సాగు నీటికి రూ.26,885 కోట్లను కేటాయించారు. మూడో ప్రపంచ దేశాలకు అభివృద్ధికి దిక్సూచీగా, ప్రేరణగా నిలిచే రైతు భరోసా పథకంతోపాటు, ఆపదలో ఆదుకోవడానికి రైతు బీమా పథకం, విప్లవాత్మక రుణమాఫీతో రైతు హృదయ దివిటీగా చరిత్రలో ప్రత్యేక స్థానం పొందారు రేవంత్‌రెడ్డి. ల్యాబ్ టు ల్యాండ్ వెలుగులో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో రైతు వేదికలను అనుసంధానించారు. జీవవైవిధ్యంతో కూడిన పంటల సాగుకు, విత్తనోత్పత్తికి కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దనున్నారు. గత పదేళ్ళ పాలనలో జరిగిన మంచిని, అభివృద్ధిని, లోపాలను, వైఫల్యాలను సాపేక్ష దృష్టితో సమీక్షించి మరిన్ని జనహిత పథకాల రూపకల్పన చేస్తున్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో మూడవది అన్ని వయసుల వారికీ ఆరోగ్యకరమైన జీవనం. తెలంగాణాలోని ఐదు వేలకు పైగా ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో భారత ప్రజారోగ్య ప్రమాణాల సంస్థ నిర్దేశించిన నిబంధనల వెలుగులో సదుపాయాలను కల్పించారు. ఇందుకు బడ్జెట్‌లో రూ.11,468కోట్లు కేటాయించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచారు. విద్యా వైద్య సంస్థలలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లను పెంచారు. టీచింగ్ స్టాఫ్ నియామకాలు చేపడుతున్నారు. సుస్థిరాభివృద్ధి నాలుగవ లక్ష్యమైన నాణ్యతగల విద్యను అందించడం కోసం ఈ బడ్జెట్‌లో రూ.21,389 కోట్ల నిధులను కేటాయించారు. విద్యకు ప్రాతిపదిక సూచీలైన 7–14 ఏండ్ల మధ్య అక్షరాస్యతలో 90.56 శాతాన్ని, 15–24 ఏండ్ల మధ్య 86.97 శాతాన్ని సాధించి, జాతీయ సగటు కంటే ఎక్కువగా తెలంగాణ సాధించిన ప్రగతిని మరింత ముందుకు తీసుకుపోయేందుకు కృషి చేస్తున్నారు.

సుస్థిరాభివృద్ధి ఐదవ లక్ష్యం లింగ సమానత్వం. ఈ దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మహిళా జన జీవితాలలో అనూహ్య మార్పును తీసుకువచ్చింది. ఉచిత రవాణాతో శ్రామిక రంగంలో మహిళల వాటా పెరిగింది. ఉచిత రవాణకు రూ.723 కోట్ల నిధులను ఇచ్చారు. గృహజ్యోతి, సబ్సిడీ సిలెండర్‌లతో మహిళా జీవితాలలో వెలుగును నింపింది. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖకు రూ.2,736 కోట్ల నిధులను ఇచ్చారు. అంగన్‌వాడిలలో ప్రీప్రైమరీ తరగతులకు రూపకల్పన చేసారు.

తెలంగాణా జనాభాలో వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులు, మతపరమైన మైనారిటీలు 85శాతం ఉన్నారు. ఈ వర్గాల ఉన్నతి కోసం సామాజిక సమతుల్యత కోసం బడ్జెట్‌లో రూ.33వేల కోట్లు ఇచ్చారు. చారిత్రక నగరి హైదరాబాద్ అభివృద్ధి కోసం పలు రూపాలలో పలు పథకాలకు రూ.18 వేల కోట్ల నిధులు ఇచ్చారు. విపత్తుల నష్టనివారణ కోసం 'హైడ్రా' సంస్థను ఏర్పాటు చేసారు. మున్సిపాలిటీల కోసం రూ.15,594కోట్లు కేటాయించారు.

ప్రజా ఎజెండాయే తన ఆత్మగా భావిస్తూ, జాతీయోద్యమ, నవ భారతాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ పార్టీ తాత్వికతను నింపుకుని, రేవంత్‌రెడ్డి తెలంగాణకు సుపరిపాలను అందిస్తున్నారు. భారత ప్రథమ ప్రధాని నెహ్రూ ఆగస్ట్ 15, 1947నాడు ఎర్రకోట మీద చేసిన చారిత్రాత్మక ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'లో "దేశానికి, సమాజానికి సేవ చేయడమంటే పేదరికం, అజ్ఞానం, అనారోగ్యం, అవకాశాలలో అసమానతను అంతం చేయడమే" అన్నారు. ఈ వారసత్వ కొనసాగింపునకు ఈ బడ్జెట్ ఎంతో దోహదం చేస్తుంది.

– అస్నాల శ్రీనివాస్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
శనివారం 10 ఆగస్టు 2024

'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేద్దాం

హనుమకొండ టౌన్, ఆగస్టు9: ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 15 వరకు తలపెట్టిన హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ ఆఫీస్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 11 నుంచి 14 వరకు తిరంగా యాత్ర, 13 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా, 12 నుంచి 14 వరకు మహనీయుల విగ్రహాలు, స్మారక చిహ్నాల చుట్టూ పరిశుభ్రత కార్యక్రమాలు, 14న విభజన గాయాల స్మారక దినం, 13 నుంచి 15 వరకు అమరవీరుల చిహ్నాల వద్ద పుష్పాంజలి ఘటించాలన్నారు.





శ్రావణ సందడి

శ్రావణమాస తొలి శుక్రవారం.. అందునా నాగులపంచమి కావడంతో నగరంతో పాటు జిల్లాలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళల సామూహిక వరలక్ష్మి వ్రతాలు, ప్రత్యేక పూజలు, పారాయణాలు, అన్నదానాలతో దేవాలయాలు ఆధ్యాత్మిక సందడిని సంతరించుకున్నాయి. వరంగల్ భద్రకాళి దేవాలయం భక్తులతో పోటెత్తింది. మరోవైపు నాగుల పంచమిని కూడా ఘనంగా జరుపుకున్న భక్తులు నాగేంద్రస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నాగేంద్రుడి పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.



ఆదివాసీ పండుగ

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీలో మొదటి గేటు నుంచి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వరకు సాంస్కృతిక ర్యాలీ, పతాకావిష్కరణ జరిపారు. అనంతరం సెనెట్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడారు. వర్సిటీ పరిధిలో 50 ఆదివాసీ ప్రాంతాలున్నాయని దాంతో ఆ తెగలకు చెందిన విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు.



బల్దియాలో భూ ఆక్రమణలకు చెక్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 9 : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధి 66 డివిజన్‌లలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల ఆక్రమణలకు చెక్‌పెట్టడంతో పాటు భూ అక్రమాలు, కబ్జాలకు పాల్పడే వారిపై కొరడా ఝుళిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. సరికొత్త యాప్‌తో కబ్జాదారులు ఆక్రమించిన భూములను గుర్తించేందుకు కసరత్తు మొదలు పెట్టింది. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌లను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో (హైడ్రా), వరంగల్ బల్దియాలో డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ప్రొటెక్షన్ ఫోర్స్) బృందాలను ఏర్పాటు చేసింది. ఇటీవల ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడడంతో రెండు రోజుల కిందట బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అప్రమత్తమయ్యారు. నగరవ్యాప్తంగా ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి నుంచి తిరిగి భూములను స్వాధీనం చేసుకోవడం, అక్రమ కట్టడాలను తొలగించేందుకు డీఆర్ఎఫ్ టాస్క్‌ఫోర్స్ ప్రధాన భూమిక పోషించాలని సూచిస్తూ మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, ట్రాఫిక్ పోలీసు, ఆర్ అండ్‌బీ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. బల్దియాలో నూతనంగా ఏర్పడిన టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రధానంగా ప్రభుత్వ ఆధీనంలో ఉండి అన్యాక్రాంతమైన నాలాలు, డ్రైనేజీ కాల్వలు, రోడ్లు, కాలనీలు, జంక్షన్లు, చెరువులు, కుంటలు, కెనాల్ స్థలాలు, స్మశాన వాటికలు, ప్రభుత్వ విద్యాసంస్థల స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టుపక్కల మిగిలి ఉన్న స్థలాలు ఆక్రమించిన కబ్జాదారులపై కొరడా ఝుళిపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

సీఎం సమీక్షలో అంకురార్పణ

వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై 29 జూన్ 2024న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి హైదరాబాద్ కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో సమీక్ష జరిగింది. వరంగల్ నగరంలో జరిగిన, జరుగుతున్న ప్రభుత్వ భూ ఆక్రమణలపై సుదీర్ఘంగా చర్చించారు. తర్వాత ముఖ్యమంత్రి వరంగల్ నగరంలోపాటు హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆయాశాఖల అధికారులు దృష్టి సారించాలని, ప్రభుత్వ ఆస్తులలో అక్రమ కట్టడాలు కూల్చివేత, ఆక్రమించిన భూములు స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన కమిషనర్ ఆదేశాల మేరకు పది ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో డీఆర్ఎఫ్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో పదిమంది చొప్పున మూడు బృందాలు 24/7 అన్నట్టుగా రియల్టర్లు, కబ్జాదారులు ఆక్రమించిన ప్రభుత్వ భూములు గుర్తించే పనిలో పడ్డారు. టాస్క్‌ఫోర్స్ బృందాలకు రౌడీషీటర్లు, రాజకీయ నాయకులు భయభ్రాంతులకు గురిచేసినా బెదరకుండా ముందుకు సాగుతున్నారు.



ప్రభుత్వ ఆస్తుల రక్షణే మా ధ్యేయం

- శంకర్‌లింగం, డీఆర్ఏఎఫ్ ముఖ్య అధికారి



"బల్దియా పరిధిలోని భూములకు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు డీఆర్ఎఫ్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశాం. పది ప్రభుత్వ శాఖల అధికారులు ఈ దళం లో పని చేస్తారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరంలోనే టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశాం. ప్రతీరోజు కొన్ని డివిజన్లను ఎంపిక చేసుకుని ప్రత్యేక యాప్ ద్వారా ఆక్రమించిన స్థలాలను గుర్తించి జియో ట్యాగింగ్ ద్వారా గుర్తించి ఆన్‌లైన్ చేస్తాం. తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలు కూల్చివేస్తాం."

- ప్రత్యేక భద్రతా దళాలతో రక్షణకు సర్కారు చర్యలు
- 'ఆపరేషన్ డీఆర్ఎఫ్ టాస్క్‌ఫోర్స్' పేరుతో బృందాలు
- పది శాఖల సమన్వయంతో నిర్వహణ
- సీఎం ఆదేశాలతో సర్వం సిద్ధం
- కబ్జాలను గుర్తించేందుకు ప్రత్యేక యాప్
- జియో ట్యాగింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు



హనుమకొండలో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

జియో ట్యాగింగ్‌తో భూముల గుర్తింపు

వరంగల్ నగరంతో పాటు నగర శివార్లు, విలీన గ్రామాలలో ఆక్రమణకు గురైన భూములు, చెరువులు, కుంటలను డీఆర్ఎస్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది జియో ట్యాగింగ్ ద్వారా గుర్తిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ టీములలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందించింది. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌కు ప్రభుత్వ యాప్‌ను అనుసంధానం చేసుకుని కమిషనర్‌కు, కలెక్టర్‌కు, సీఎం క్యాంపు కార్యాలయానికి, పోలీసు కమిషనర్‌కు వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తున్నారు. ఆయా డివిజన్‌లలో బృందాలు విడిపోయి అక్రమ కట్టడాలను గుర్తించి ఆన్‌లైన్‌లో డాటా పొందుపరుస్తున్నారు. అక్రమ కట్టడాలను ఎప్పటికప్పుడు గుర్తించి ఉన్నతాధికారులతో పాటు సంబంధిత డీఎఫ్‌వోకు తెలియజేస్తున్నారు. 8వ తేదీన గ్రేటర్ పరిధిలోని 4, 5, 6, 17 డివిజన్‌లు, 9వ తేదీన 9, 10, 55 డివిజన్‌లలో అక్రమ కట్టడాలను గుర్తించినట్టు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తెలిపారు. అక్రమ కట్టడాల పై పూర్తి సమాచారాన్ని సేకరించిన వెంటనే డీఆర్ఎఫ్ ఫుల్ టీం, టౌన్ ప్లానింగ్, ఇంజ నీరింగ్, పోలీసుల సమన్వయంతో కూల్చివేతలు ప్రారంభించి చట్టపర మైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలా అక్రమ కట్టడాలు, నిర్మాణాలపై నిరంతర ప్రక్రియ జరుగుతుందని, ప్రభుత్వ భూములు ఆక్ర వించిన వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బల్దియా అధికారులు హెచ్చరిస్తున్నారు.



కమిషనరేట్‌లో మొక్కలు నాటుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకుందాం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- కమిషనరేట్‌లో స్వచ్ఛదనం - పచ్చదనం

వరంగల్ క్రైం, ఆగస్టు 9: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. శుక్రవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో ఏఆర్ విభాగం పోలీసుల ఆధ్వర్యంలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ పరేడ్ గ్రౌండ్ మైదానంలో మొక్కలు నాటారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వ అధికారులతో పాటు ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విధిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, విజయ్‌కుమార్, ఆర్ఐలు స్వర్ణన్‌రాజ్, శ్రీనివాస్, శ్రీధర్, చంద్రశేఖర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్ తదితరులు పాల్గొన్నారు.



కాళోజీ కళాక్షేత్రంలో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ ప్రావీణ్య

బాలసముద్రం, ఆగస్టు 9: కాళోజీ కళా క్షేత్ర నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని కాళోజీ కళా క్షేత్ర నిర్మాణ పనులను కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. నిబంధనల మేరకు పనులు చేపట్టాలని అన్నారు. నిర్మాణ పనుల్లో ఆడిటోరియం, పెయింటింగ్, టైల్స్, ఎలక్ట్రికల్, ఆర్ట్‌గ్యాలరీ తదితర పనులపై నిర్మాణ సంస్థ ప్రతినిధులను, అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసేందుకు ఆయా శాఖల అధికారులు నిమగ్నమై చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను కోరారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'లో భాగస్వాములు కావాలి

- మేయర్ గుండు సుధారాణి

వడ్డేపల్లి, ఆగస్టు 9: ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్ వద్ద నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అశ్వినితానాజీ వాకడే తదితరులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఫిల్టర్ బెడ్ వద్ద రోడ్డు డీవైడర్ల మధ్యలో మహిళలతో కలిసి సెంట్రల్ విడియన్‌లలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. వన మహోత్సవంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అందులో భాగంగా వరంగల్ జీడబ్ల్యూఎంసీ పరిధిలో 11 లక్షల మొక్కలు నాటే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. మానవ మ నుగడ చెట్లతోనే ముడిపడి ఉందని అన్నారు. ఈ కార్యక్ర మంలో 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్ కుమార్, జీడబ్ల్యూఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, హార్టికల్చర్ అధికారి రమేష్, సిటీ ప్లానర్ శైలజ, ఆర్అండ్‌బీ డీఈ సురేష్‌బాబు, కాంగ్రెస్ శ్రేణులు రుద్రోజు మణింద్రనాథ్, కందుకూరి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ అశ్వినితానాజీ వాకడే

కూతురు సహా జర్నలిస్టు ఆత్మహత్య

- హనుమకొండలోని తన ఆఫీసులో ఉరేసుకున్న యోగిరెడ్డి
- భార్య కుటుంబసభ్యుల కన్నీరు, విషాదంలో తోటి జర్నలిస్టులు



కూతురుతో జర్నలిస్టు యోగిరెడ్డి (ఫైల్)

బాలసముద్రం, ఆగస్టు9: ఓ యూట్యూబ్ చానల్ జర్నలిస్టు తన కూతురుతో కలిసి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన హనుమకొండ బాలసముద్రంలో శుక్రవారం జరిగింది. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, స్థానికులు, తోటి జర్నలిస్టులు చెబుతున్న వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం వనపర్తి గ్రామానికి చెందిన గెట్టుకొప్పుల యుగంధర్‌రెడ్డి అలియాస్ యోగిరెడ్డి (36) పలు యూట్యూబ్ చానళ్లలో పనిచేశాడు. అయితే ప్రస్తుతం అతడు పనిచేస్తున్న ఓయూట్యూబ్ వారు ఇటీవల అతడిని ఉద్యోగం నుంచి తొలగించారని, ఆ అవమానానికి ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయని, దాంతోనే యోగిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని అనుమానిస్తున్నారు. మూడు రోజుల క్రితం బాలసముద్రంలోని ఏకశిలపార్కు సమీపంలోని తన ఆఫీసులోని కంప్యూటర్లను తీసేశాడని చెబుతున్నారు. కూతురు అంటే ఎంతో ప్రేమ ఉన్న యోగిరెడ్డి.. తాను చనిపోతే తన కూతురు ఆద్యరెడ్డి (10) భవిష్యత్ ఎలా ఉంటుందోనన్న ఆందోళనతోనే కూతురుకు కూడా ఉరేసి.. తాను ఉరేసుకున్నాడని చెబుతున్నారు. అయితే ఉదయం ఇంటినుంచి కూతురిని తీసుకెళ్లిన యోగిరెడ్డి సాయంత్రానికి కూడా ఇంటికి రాకపోవడం, పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చిన

మిగతా 8వ పేజీలో..

సఖీ సేవలను మహిళలు ఉపయోగించుకోవాలి

న్యూశాయంపేట, ఆగస్టు 9: సఖీ సెంటర్ సేవలను మహిళలు ఉపయోగించుకోవాలని సఖీ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. న్యూశాయంపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం సఖీ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ హైస్కూల్ ప్రిన్సిపాల్ సరోజ, టీచర్లు సరళ, సౌందర్య, మహేశ్వరి, అంబప్రసాద్, చంద్రమోహన్, నరసింహరావు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేది ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ


అనిరుధ్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం


ప్రాజెక్టుల్లో పూడికతీతలపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా.. ఈ ప్రాజెక్టు 1967 నాటికే 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

20 నుంచి బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: ఆగస్టు 20 నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ రెండో సెమిస్టర్ 2023-24 ఏడాది రెగ్యులర్ కోర్సు పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 20, 22, 24, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల పరీక్షల జరుగుతాయని తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థుల పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు https:// kakatiya.ac.in కేయూ వెబ్‌సైట్ చూడలని సూచించారు.

13న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9: ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 13న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్.ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని ఇండస్ట్రియల్ డిటెక్టివ్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీలో సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ జాబ్స్ కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పదో తరగతి, ఆపై క్వాలిఫికేషన్స్ ఉన్న 20 నుంచి 40 యేళ్లలోపు వయస్సు ఉన్న యువకులు జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 13న ఉదయం 11 గంటలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9573885532 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఏజీపీగా సోమయ్య ఎజ్రా శాస్త్రీ నియామకం



హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అసెస్‌మెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా హైకోర్టు న్యాయవాది హన్మకొండ సోమయ్య ఎజ్రా శాస్త్రిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ లష్కర్‌సింగారానికి చెందిన హన్మకొండ సోమయ్య ఎజ్రా శాస్త్రీ ఆదర్శలా కాలేజీలో ఎల్ఎల్‌బీ చేసి 2018లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. అనంతరం హైకోర్టులో సీనియర్ న్యాయవాది పడాల ప్రవీణ్ కుమార్ దగ్గర ప్రాక్టీసు మొదలుపెట్టారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో కొంత కాలం న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. అనంతరం హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు కొనసాగించారు. చిన్న వయసులోనే ఏజీపీగా నియమితులు కావడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, ఆగస్టు 9: కాజీపేట సిద్ధార్థనగర్‌లోని డి.అమర్‌నాథ్ అనే వ్యక్తి నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. రూ.29వేల నగదు స్వాధీనం చేసుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురిని విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ధ్రువీకరించారు.

గంజాయి కోసం చైన్‌స్నాచింగ్

జల్సాల కోసం ముఠాగా ఏర్పడి నేరాలు ● నలుగురు నిందితుల ఆరెస్టు
బంగారు పుస్తెల తాడు, ద్విచక్ర వాహనం స్వాధీనం ● సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా


వివరాలను వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

మట్టెవాడ, ఆగస్టు 9: గంజాయి, జల్సాల కోసం ముఠాగా ఏర్పడి నేరాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నలుగు రు నిందితులను అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. శుక్రవారం వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. జూలై 30న మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తవాడకు చెందిన వడ్లకొండ వనజ మెడలోని బంగారు చైన్‌ను భూపాలపల్లికి చెందిన బొల్ల అనిల్, మహ్మద్ బాసిత్‌లు లాక్కొని స్కూటీపై భూపాలపల్లికి పరారైనట్టు తెలిపారు. అనిల్, బాసిత్‌లకు వరంగల్ ములుగు రోడ్డు వద్ద ప్రైవేట్ హాస్టల్‌లో షెల్టర్ ఇచ్చిన భూపాలపల్లి జిల్లా పలిమెల మండలానికి చెందిన మహ్మద్ షోయ బ్‌ఖాన్, చైన్‌స్నాచింగ్‌కు ప్లాన్ వేసిన భూపాలపల్లి రాజీవ్ నగర్‌కు చెందిన మహ్మద్ ఫారూక్‌ఖాన్‌లను శుక్రవారం ములుగురోడ్డు వద్ద పక్కా సమాచారంతో అదుపులోకి తీసు కున్నట్టు వెల్లడించారు. వారిని విచారించగా చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్టు ఒప్పుకున్నట్లు తెలిపారు. దాంతో వారి నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నట్లు డీసీపీ వెల్లడించారు.

నిందితులు గతంలో భూపాలపల్లి, వైజాగ్, పరకాల, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు నేరాలకు పాల్పడ్డరన్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దే శంతో ముఠాగా ఏర్పడి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి వరంగల్ కొత్తవాడలో మహిళ మెడలోంచి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డరని తెలిపారు. నిందితులు ఫారూక్‌ఖాన్, మహ్మద్ బాసిత్‌లు గంజాయి స్లగ్గింగ్ చేయడం, గంజాయి సేవించడం బొల్ల అనిల్, మహ్మద్ బాసిత్‌లు ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు పాల్పడిన కేసులలో నిందితులని అనిల్ పరకాల పోలీస్ స్టేషన్ పరిధి చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడని తెలిపారు. వైజాగ్ పరిధిలో గంజాయి కేసులో నిందితుడని డీసీపీ వివరించారు.

చైన్ స్నాచింగ్ నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, భూపాలపల్లి డీఐ నరేశ్, మట్టెవాడ ఎస్సై విఠల్, సీసీఎస్ ఎస్సై సంపత్, పోలీస్ కానిస్టేబుళ్ళు హరికాంత్, మహ్మద్ అలీ, విజయ్‌కాంత్, మధుసూదన్, తిరుపతయ్య, రాజేందర్ ప్రసాద్, హోంగార్డు నాగేశ్వర్‌రావులను డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్ గోపి, అబ్బయ్య, పాల్గొన్నారు.

ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

● కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ● కేయూలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


కేయూలో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో ఆదివాసీ ప్రొఫెసర్లు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్బోధించారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబురాలు నిర్వహించారు. కేయూ మొదటి గేటు నుంచి అడ్మినిస్ట్రేటీవ్ బిల్డింగ్ వరకు ఆదివాసీ కల్చరల్ ర్యాలీ, పతాకావిష్కరణ , జ్యోతి ప్రజ్వలన, సాంస్కృతిక సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంపన్నమైనది ఆదివాసీ సంస్కృతి అని చెప్పారు. సంస్కృతి పుట్టింది ఆదివాసీల నుంచే అని చెప్పారు. వర్సిటీ పరిధిలో 50 ఆదివాసీ ప్రాంతాలున్నాయని చెప్పారు. వర్సిటీ ఆదివాసీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. ఆదివాసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని అన్నారు. వ్యవసాయమే కాకుండా ఇతర రంగాల్లో ప్రవేశించి నిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

విశిష్ట అతిథిగా హాజరైన ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.భిక్షపతిరావు మాట్లాడుతూ.. ఆదివాసీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. మన పూర్వీకులు సంప్రదాయ పద్ధతులతో వ్యాధులు, రోగాల నివారణ చేశారని అన్నారు. ఆదివాసీలు విద్యపైన దృష్టి సారించాలని అన్నారు. చదువుకున్న ప్రతీ ఒక్క ఆదివాసీ తోటివారిలో విద్యపై అవగాహన కల్పించి వారిని అభివృద్ధి పథంలోకి తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. రిటైర్డు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సారయ్య దొర మాట్లాడుతూ.. ఆదివాసీలు మూలాలను మరవద్దని అన్నారు. శాస్త్రీయమైంది ఆదివాసీల గోత్ర వ్యవస్థ అని చెప్పారు. భావాలు, ఉద్దేశాలు మంచిగా ఉండాలని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 90దేశాల్లో ఆదివాసీలున్నాయని చెప్పారు. 30 ఏళ్లుగా ఆదివాసీలు అనేక సాంస్కృతిక పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీల్లో అవగాహన రావాలన్నారు. ఆదివాసీల అభివృద్ధికి నిధుల కేటాయింపు పెరగాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆదివాసీ యువత సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ వాసం ఆనంద్ కుమార్, రవి, కుమారస్వామి, రాజేశ్, సురేందర్, సాయి, తాటి అనిల్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖలో బదిలీలు

6బి కేటగిరీలో ఆలయాల్లో ఇద్దరు ● 6ఏ కేటగిరీ గుడుల్లో ఆరుగురు

హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగిన బదిలీల్లో మొత్తం 8మంది ఉద్యోగులకు స్థాన చలనం జరిగింది. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పరిధిలోకి వచ్చే 6బీ కెటగిరీకి వచ్చే దేవాలయాల నుంచి ఇద్దరు, రీజనల్ జాయింట్ కమిషనర్ పరిధిలోకి వచ్చే 6ఏ దేవాలయాల్లో ఆరుగురికి బదిలీలు జరిగాయి. 6బి కేటగిరీ కింద వరంగల్‌లోని కట్టమల్లన్న దేవాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మహిపాల్ వరంగల్ ఉర్సు ప్రాంతంలోని నాగేశ్వరాలయానికి, అక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్యాంసుందర్ కట్టమల్లన్న గుడికి బదిలీ అయ్యారు. నాగేశ్వరాలయంలో పనిచేస్తున్న కార్యనిర్వహణాధికారి (ఈవో) కమల రిటైరయ్యారు. ఆమె స్థానంలో వరంగల్ దుర్గేశ్వరాలయం ఈవో ప్రసాద్‌ను నాగేశ్వరాలయం ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు అప్పగించారు. కాగా 6ఏ కేటగిరి కింది వేయిస్తంభాలగుడిలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్ ఐనవోలుకు బదిలీ అయ్యారు. ఐనవోలు ఆలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ మధుకర్ వేయిస్తంబాల గుడికి వచ్చారు. కొత్తకొండ ఆలయంలో పనిచేసే సంజీవరావు ఐనవోలుకు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేసిన నారాయణ కొత్తకొండకు వచ్చారు. వరంగల్ బట్టలబజార్‌లోని రామిలింగేశ్వరాలయం ఈవో వెంకట్రావు హసన్‌పర్తిలోని ఎర్రగట్టు వెంకటేశ్వరాలయానికి, అక్కడ ఈవోగా పనిచేస్తున్న కిషన్‌రావు వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీవిశ్వేరాలయానికి స్థాన చలనం జరిగింది.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 12న స్పాట్ అడ్మిషన్ల క్యాంపు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులతో పాటు అర్హత సాధించని విద్యార్థులు సైతం ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఖాళీగా ఉన్న 7 సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదని ఆయన స్పష్టం చేశారు. స్పాట్‌కు హాజరయ్యే విద్యార్థులు వారి ఒరిజినల్, జిరాక్స్ సెట్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు.

వర్సిటీ అనుమతిలేని కళాశాలల్లో చేరొద్దు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: కాకతీయ యూనివర్సిటీ అనుమతి లేకుండా నడుస్తున్న కళాశాలల్లో విద్యార్థులు అడ్మిషన్లు పొందవద్దని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విద్యార్థులకు సూచించారు. వర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థులు కళాశాల అఫ్లియేషన్‌ను చూసుకోవాలని, ఆయా వివరాలు వర్సిటీ డీన్, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కార్యాలయంలోనూ అందుబాటు లో ఉన్నాయని తెలిపారు. కళాశాలలు పేరు, అడ్రస్, మేనేజ్‌మెంట్ మార్చుకుని వర్సిటీ అనుబంధం ఉన్నట్లు తప్పుడు సమాచారంతో కొన్ని కళాశాలలు అడ్మిషన్లు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. తప్పుడు కళాశాలల్లో చేరిన విద్యార్థులకు వర్సిటీకి ఎలాంటి సంబంధం ఉండదని హెచ్చరించారు.

బయోటెక్నాలజీలో ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 9: రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం పరిశోధకుడు ప్రసన్నకుమా ర్ టీపీ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శుక్రవారం చైతన్య డీమ్డ్ వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.జగదీశ్వర్ ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'మైక్రోబియల్ ప్రొఫైలింగ్ ఆఫ్ జీవామృతం అండ్ ఆప్టిమైజేషన్ స్టడీస్ ఆఫ్ ఫర్మెంటేషన్ పారామీటర్స్ ఫర్ ది మాస్ ప్రొడక్షన్ ఆఫ్ బయోఫర్టిలైజర్ అనే అంశంపై చైతన్య టూబీ డీమ్డ్ వర్సిటీ బయోటెక్నాలజీ ప్రొఫెసర్ మురళీకృష్ణ పర్యవేక్షణలో ప్రసన్నకుమార్ పరిశోధన పూర్తి చేశారు. ప్రసన్నకుమార్ టీపీ అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన ప్రసన్నకుమార్ వీసీలు డాక్టర్ సీ.హెచ్.వి పురుషోత్తమ్ రెడ్డి, ప్రొఫెసర్ జి.దామోదర్, చీఫ్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ డాక్టర్ సాల్వికారెడ్డి, రీసర్చ్ డీన్ ప్రొఫెసర్ టి.క్రిష్టోఫర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవీందర్‌తో పాటు పలువురు అభినందించారు.

27న వాగ్దేవిలో ఫిజియోథెరపీపై అంతర్జాతీయ సదస్సు

హనుమకొండ టౌన్, ఆగస్టు9: వాగ్దేవి ఫిజియోథెరపీ కళాశాల స్థాపించి 25 యేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా అక్టోబర్ 27న కళాశాలలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. దేశ, విదేశాల నుంచి ఫిజియోథెరపీ వైద్య విద్యలోని ప్రముఖ ప్రొఫెసర్ విచ్చేసి ఫిజియోథెరపీ ప్రాక్టీస్ అండ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై ప్రసంగిస్తారన్నారు. సదస్సులో ఫిజియోథెరపీ విద్యార్థులకు పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, క్విజ్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు కళాశాల డైరెక్టర్ వాహినిదేవి తెలిపారు. సిల్వర్‌జూబ్లీలో భాగంగా అక్టోబర్ 26న ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సంపత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫిజియోథెరపీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



పోలీస్ శిక్షణ కేంద్రంలో మొక్కనాటుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మడికొండ, ఆగస్టు 9: పరిసరాల పరిశుభ్రతను పాటించడం వల్ల ప్రతీ ఒక్కరు ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. శుక్రవారం మడికొండలోని పోలీస్ శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మొక్క నాటారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో అధికారులతో పాటు ప్రజలం దరూ పాల్గొని పరిసర ప్రాంతాలలో విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వా ములు కావాలని సీపీ కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అదనపు డీసీపీ రవి, వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు, ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, ప్రతాప్, ట్రెయినీ కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

● హనుమకొండ కల్చరల్: స్వచ్ఛదనం, పచ్చదనం చివరి రోజులో భాగంగా 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ నిర్వహించారు. శుక్రవారం భవాని నగర్ కాలనీలోని ప్రధాన సెంటర్లలో మొక్కలు నాటడంతోపాటు కాలనీలోని ప్రతి ఇంటికి పూలమొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్పెషల్ ఆఫీసర్ యూసఫ్ ఉద్దీన్, వార్డు ఆఫీసర్ పి.శ్రీనివాస్, భవానీనగర్ డెవలప్‌మెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, సభ్యులు ఆర్‌పీలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ చౌరస్తా: స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పదో డివిజన్‌లోని పద్మాక్షి, లెప్రసీ కాలనీలోని స్వామి వివేకానంద హైస్కూల్‌లో, మచిలీబజార్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ సీఐ సతీష్, గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్, 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శోభనబోయిన కుమార్ యాదవ్, మునిసిపల్ ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రఘు, వార్డు ఆఫీసర్ అనిత, ఆర్‌పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎం కృష్ణకళ, జవాన్లు రమేశ్, శ్రీనివాస్, రంజిత్, వీరన్న, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

● హనుమకొండ(ఆంధ్రజ్యోతి): హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఔషధ ఉద్యానవనంలో వివిధ రకాల ఔషధ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గ్రీన్ రెవెల్యూషన్, మెడిసినల్ ప్లాంట్స్, థెరప్యూటిక్ యూజెస్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం భద్రకాళి దేవాలయం ఆవరణలో కూడా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. వివిధ రకాల పూలమొక్కలు, ఔషధ మొక్కలను నాటారు. కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్ దేవేందర్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వాహినీదేవి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు డాక్టర్ శరవణ భవను అభినందించారు.

● కాజీపేట: వర్షాకాలంలో ప్రతీ ఒక్కరు పరిశుభ్రతపై దృష్టి సారించడమే కాకుండా విరివిగా మొక్కలు నాటాలని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అన్నారు. కాజీపేట 62వ డివిజన్ సోమిడిలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ హాజరై పాఠశాలలో మొక్కలు నాటారు. డివిజన్ ఇన్‌చార్జి ఏఈ రామన్న, మునిసిపల్ సిబ్బంది నార్లగిరి శ్రీనివాస్, భాగ్యలత, హరిత, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● న్యూశాయంపేట: స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం శుక్రవారం హంటర్‌రోడ్‌లోని కాకతీయ జూలాజికల్ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా జులాజికల్ పార్కు రేంజ్ ఆఫీసర్ జె.శిరీష మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ డి.రాందాస్, బీట్ ఆఫీసర్లు టి.సురేష్, డి.శారద, జూపార్కు సిబ్బంది పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



మహా మండపాన్ని ప్రారంభిస్తున్న రఘుపతిరావు

గీసుగొండ, ఆగస్టు 9: దైవచింతనతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత వస్తాయని 'ఆంధ్రజ్యోతి' వరంగల్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతిరావు అన్నారు. భక్తుల ఆర్థిక సహ కారంతో నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్మించిన మహా మండపాన్ని శుక్రవారం ఆయన ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు ఆలయాలు దోహదం చేస్తాయని, ప్రతీ గ్రామంలో గుడి, బడి ఉండాలని వేదపండితులు చెప్పారన్నారు. నాగేంద్రస్వామి ఆలయంలో మహా మండప ఏర్పాటుకు సహకరించిన కమిటీ చైర్మన్, దాతలకు, భక్తులకు ఆయన అభినందించారు. నియమ నిష్ఠలతో, పట్టు దలతో మండప నిర్మాణం పూర్తి చేసిన ప్రధాన అర్చకులు సుదర్శనాచార్యులు, శ్రీహర్షను ఘనంగా సత్కరిం చారు. అనంతరం రఘుపతిరావు దంపతులకు అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, కోశాధికారి రాజేందర్, మాజీ ఎంపీటీసీ వీరారావు, శ్రీరాములు రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దేవుడి వనభోజనాలు

ఐనవోలు, ఆగస్టు 9 : నందనం రాంనగర్ గ్రామాల్లో పెద్దేవుడి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ ఏడాది శ్రావణ మాసంలో శుక్రవారం రెండు గ్రామాల్లోని సబ్బండ కులాలకు చెందిన వారు పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా రాంనగర్ శివారులో ఆకేరు వాగు పక్కన ఉన్న పెద్దేవుడి ఆలయానికి ప్రతీ ఇంటి నుంచి బుట్టల్లో వంట సామగ్రి పెట్టుకొని ముకుమ్మడిగా వెళ్లారు. ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదిక్షణ చేసి ఆరుబయట చెట్లలో వంటలు చేసుకున్నారు వనభోజనాల పండుగతో రెండు గ్రామాల్లో సందడి నెలకొంది. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, యూత్ కాంగ్రెస్ నాయకుడు దిలీప్‌రాజులు పెద్దేవుడిని దర్శించుకున్నారు. మాజీ జడ్పీవైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, రెండు గ్రామాల మాజీ సర్పంచ్‌లు బి. శ్రీనివాస్‌రావు, యాకర మంజులాయాదగిరి, మాజీ ఎంపీటీసీ లక్ష్మీకుమారస్వామి, గ్రామ అధ్యక్షుడు బండి సంపత్‌గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు యాకర సాంబయ్య, బుచ్చిరెడ్డి, రాకేష్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్, మండల సత్యం, జున్న రవి, డి. హరీష్, రాజారాం, సమ్మయ్య, యాకాంబ్రం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఆగస్టు9: సబ్‌స్టేషన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గోపాల్‌పూర్, కేయూసీ, యాదవ్‌నగర్, న్యూశాయంపేట, మచిలీబజార్, ఆర్‌ఈసీ, సోమిడి, మడికొండ, రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, వడ్డేపల్లి పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, బాలసముద్రం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు.

ఇంద్రనగర్ కాలనీలో చైన్ స్నాచింగ్

నిందితులకోసం గాలిస్తున్న పోలీసులు

బాలసముద్రం, ఆగస్టు9: హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని ఇంద్రనగర్‌లో ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు చైన్‌ను లాక్కెళ్లిన ఘటన శుక్రవారం జరిగింది. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండకు చెందిన మంద లీల (55) అనే మహిళ కంగన్‌హాల్‌షాపునకు నడుచుకుంటు వెళ్తోంది. ఈక్ర మంలో ఇంద్రానగర్ సమీపంలో ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లారు. లీల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం సీసీఎస్ పోలీసులతో కలిసి సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. బాధితురాలు భర్త మందా రాంరెడ్డి ఆర్టీసీలో రిటైర్డ్ అయి హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ సమీపంలో సొంతి ఇంటిలో లీల భర్తతో కలిసి నివాసం ఉంటున్నట్టు తెలిపారు. లీల భర్త రాంరెడ్డి స్వగ్రామం తొర్రూర్ మండలం మాడుర్ గ్రామానికి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లినట్లు తెలిపారు. మహిళ మెడలో చైన్ లాక్కెళ్లి పరారీలో ఉన్న నిందితుల కోసం సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీస్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

బస్తీబడి పిల్లలకు అల్పాహారం పంపిణీ

హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శాయంపేట సుజిత్‌నగర్‌లోని బస్తీ బడిలో చదువుకుంటున్న పిల్లలకు శుక్రవారం ప్రేరణ ఫౌండేషన్ అల్పాహారం, పండ్లు అందచేసింది. విద్యా, ఆరోగ్య విషయాలపై వారికి అవగాహన కలిగించింది. ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, ఆధ్వర్యంలో జరుగగా ప్రధానో పాధ్యాయుడు ఉప్పలయ్య పాల్గొన్నారు.

సీఐ, ఎస్సైలను సస్పెండ్ చేయాలి

వరంగల్ లీగల్, ఆగస్టు 9: న్యాయవాద దంపతులపై దాడిచేసిన జనగామ పోలీసులను సస్పెండ్ చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రెండో రోజు న్యాయవాదులు విధులు బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. గత బుధవారం ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ పిలుపు మేరకు రెండు రోజులు న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం కూడా ఉభయ జిల్లాల న్యాయవాదులు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సైలను సస్పెండ్ చేసేంత వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై పి.తిరుపతి, కానిస్టేబుల్ కరుణాకర్‌ను బదిలీ చేశారని, కానీ విచక్షణారహితంగా న్యాయవాద దంపతులపై దాడికి పాల్పడిన పోలీసులను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లాదె రమేష్, ఉపాధ్యక్షుడు పోశిని రవీందర్, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్లను సన్మానించిన టీఎన్జీవోలు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు9: హనుమకొండలోని రిజిస్ట్రార్ కార్యాలయానికి నూతనంగా వచ్చిన సబ్ రిజిస్ట్రార్‌లు జె.రామనరసింహరావు, డి.ఆనంద్‌లను టీఎన్జీవో జిల్లా నాయకులు సన్మానించారు. శుక్రవారం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్‌లను కలిసిన టీఎన్జీవోస్‌లు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్‌తోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నడిరోడ్డుపై యువకుల హల్‌చల్

మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి

కాజీపేట, ఆగస్టు 9: నడిరోడ్డుపై ఇద్దరు యువకులు హల్‌చల్ చేశారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకుంటూ, కర్రలతో దాడిచేసుకున్నారు. ఈ ఘటన చూస్తున్న వాహనదారులు భయాందోళనకు గురైయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట చౌరస్తా సమీపంలో శుక్రవారం సాయంత్రం ఇద్దరు యువకులు మద్యం మత్తులో తన్నుకున్నారు. అందుబాటులో ఉన్న సీసాలు, కర్రల తో ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. అసలు వీరు ఎవరు.. ఎందుకు తన్నుకుంటున్నారో ఎవ్వరికి అర్థం కాలేదు. సుమారు అరగంట వరకు చౌరస్తాలో హల్‌చల్ చేశారు. ఈ రోడ్డుమీదుగా వెళ్లే వాహనదారులు, బాట సారులు ఆవైపు వెళ్లేందుకు సాహసం చేయలేదు. ఎవరో సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని చెదరగొట్టి అక్కడి నుంచి పంపించారు. ఈ ఘటనతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

మాదిగలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించి అమలు చేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ కాకతీయ యూనివర్సిటీలో తెలంగాణ మాదిగ జేఏసీ బాధ్యుల సమావేశం మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లికొండ వీరేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పిడమర్తి రవి హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలమైన తీర్పు వెల్లడించినట్లు తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ జనాభా దామాషా ప్రకారం అమలు చేయాలని అన్నారు. రాష్ట్రాలకు అధికారం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ 7 శాతం రిజర్వేషన్ల కోసమే 30 ఏళ్ల ఉద్యమం చేసిందా? అని ప్రశ్నించారు. తెలంగాణ మాదిగల చిరకాల వాంఛ అయిన 12శాతం అమలు చేయాలని అన్నారు. రాష్ట్రం నుంచి మాదిగలకు రాజ్యసభ సీటుకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 11న హైదరాబాద్ జగ్జీవన్‌రామ్ భవన్‌లో మాదిగ సంఘాల సదస్సుకు అందరూ హాజరై దిగ్విజయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాదిగ జేఏసీ అధ్యక్షుడు బొల్లికొండ వీరేందర్, మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్, కాడపాక రాజేందర్, బరిగెల బాబు, దుప్పటి కిశోర్, చక్రి, విజయ్, యాలాద్రి, రవి, నవీన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ గురుకులంలో ముగిసిన లయన్స్ క్వెస్ట్ కార్యక్రమం



శిక్షణలో పాల్గొన్న కుందూరు వెంకట్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ జనగామ అంజిరెడ్డి, ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9 : వరంగల్- ఖమ్మం బైపాస్ రోడ్ ఉర్సుగుట్ట సమీపంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల/కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 'లయన్స్ క్వెస్ట్' కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. గురుకుల ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాలల ఉపాధ్యాయులకు లయన్స్ క్వెస్ట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా 320ఎఫ్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నేర్చుకున్న విషయాలను విద్యార్థుల ఉన్నతికి ఉపయోగించాలన్నారు. ఆర్సీవో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థినులు ఉన్నత లక్ష్యంతో చదువాలని సూచించారు. ప్రిన్స్‌పాల్ అంజిరెడ్డి ఆరోగ్య విషయాలపై విద్యార్థినులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ ఉపాధ్యాయురాలు భార్గవి కృతజ్ఞతలు తెలిపారు. కొండపెల్లి రేణుక ట్రైనర్‌గా వ్యవహరించిన కార్యక్రమంలో 39 గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేటి బీసీల సత్యాగ్రహ దీక్షకు తరలిరండి

బీసీ సంఘాలకు పిలుపునిచ్చిన వినయభాస్కర్

రాంనగర్, ఆగస్టు 9: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద శనివారం నిర్వహించనున్న బీసీల సత్యాగ్రహ దీక్షకు బీసీలు పెద్దఎత్తున తరలిరావాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ పిలుపిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ ఓబీసీ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వినయభాస్కర్ మాట్లాడుతూ.. బీసీల కుల, జన గణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కలిసి పోరాడుదామన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగే సత్యాగ్రహ దీక్షకు వరంగల్ నుంచి పెద్ద ఎత్తున బీసీలు, బీసీ సంఘాల నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు బొంగు అశోక్, చెన్నం మధు, బీసీ నాయకులు తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, పులి రజనీకాంత్, క్రాంతికుమార్, బుద్దె వెంకన్న, శరత్‌చంద్ర, వీరస్వామి, రాకేష్‌యాదవ్, శ్రీకాంతాచారి, సతీష్, రాకేష్, నరేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కూతురు సహా జర్నలిస్టు ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

భార్య స్వప్న ఆఫీసు వద్దకు వెళ్లి చూడగా కూతురు సహా యోగిరెడ్డి ఉరేసుకుని కనిపించడంతో ఆమె నిర్ఘాంతపోయారు. ఇద్దరినీ అలా చూసిన ఆమె కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణరెడ్డి, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు గల కారణాలు తెలుసుకునేందుకు వివరాలు సేకరిస్తున్నారు.

జర్నలిస్టుల సంతాపం..

యువజర్నలిస్టు యోగిరెడ్డి కూతురుతో కలిసి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో తోటి జర్నలిస్టులు విషాదంలో మునిగిపోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న కొందరు జర్నలిస్టులు కన్నీరు పెట్టుకున్నారు. పోలీసులు యోగిరెడ్డి కుటుంబసభ్యులకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు.

ఎంజేపీ ఆర్‌సీవోను సస్పెండ్ చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9: ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాలల కార్యదర్శి ఆదేశాలు పాటించకుండా అక్రమాలకు పాల్పడుతున్న ఆర్‌సీవో మనోహర్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కడపాక రాజేందర్, బొట్ల నరేష్, అజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హంటర్‌రోడ్ న్యూశాయంపేటలోని ఎంజేపీ కార్యాలయం ఎదుట వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని ఎంజేపీ పాఠశాలలు, కళాశాలల్లో ఎలాంటి డెమోలు లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా గెస్ట్ ఫ్యాకల్టీలను నియమిం చుకున్నారని ఆరోపించారు. ఇటీవలే నల్లబెల్లి గురుకుల పాఠశాలలో నాణ్యతలేని భోజనంతో పాటు కుళ్లిన కూరగాయలు వాడుతున్నారని నిర్ధారణ అయినప్పటికీ ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వద్ద డబ్బులు దండుకొని ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఆయనపై జిల్లా కలెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, సంబంధిత సెక్రెటరీ ఆయనను వెంటనే ఉద్యోగం నుంచి తీసివేయాలన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 9: పవిత్ర శ్రావణమాస వేడుకల పర్వంలో భాగంగా శుక్రవారం గరుడ పంచమి, నాగుల పంచమి పర్వాన్ని పురస్కరించుకొని నగరంలోని అనేక పుట్టలున్న ప్రాంతాలకు మహిళలు తరలివచ్చి నాగేంద్రుడిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో కొలిచారు. చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో నాగుల పంచమిని పురస్కరించుకొని శ్రీవల్లీ దేవసేన నాగేంద్రుడికి నవరసాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో కుంకుమ హరిద్ర సుగంధ లేపనంతో క్షీరాభిషేకం నిర్వహించారు. అదే విధంగా పబ్లిక్‌గార్డెన్‌లో ఉన్న పుట్టల వద్ద కూడా పెద్ద సంఖ్యలో మహిళలు చేరుకొని నాగమయ్యకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బ్రాహ్మణవాడలోని నాగుల గుడి వద్దకు కూడా మహిళలు చేరుకొని అక్కడున్న నాగేంద్రస్వామిని అభిషేకించారు. ఏకశిలా పార్కు సమీపంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం, రామ్‌నగర్‌లోని అంజనేయస్వామి ఆలయం, ఎక్సైజ్‌కాలనీలోని వెంకటేశ్వర ఆలయం వద్ద నున్న పుట్టల వద్దకు కూడా మహిళలు అధిక సంఖ్యలో చేరుకొని నాగేంద్రుడిని కొలుస్తూ మొక్కులు బడులు చెల్లించుకున్నారు.

సత్ఫలితాలను ఇస్తున్న పొలం బాట : సీఎండీ

హనుమకొండ టౌన్, ఆగస్టు 9: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం బాటకు మంచి సత్ఫలితాలు వస్తున్నాయని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ సర్కిల్ పరిధిలోని అన్ని విభాగాల అధికారులతో సీఎండీ శుక్రవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు విధిగా నిర్వహణ చేపట్టడం ద్వారా అంతరాయాలు, బ్రేక్‌డౌన్స్ చాలావరకు తగ్గుతాయన్నారు. ఓవర్ లోడ్ పడకుండా టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎబి స్విచ్‌ల ఆపరేట్ అయ్యేటట్టు చూసుకోవాలన్నారు. కొత్త సర్వీసుల మంజూరును డిజిటలీకరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు, సీజీఎంలు, ఎస్ఈ, డీఈ, ఏడీఈలు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన బల్దియా అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 9: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు ఇటీవల వివిధ విభాగాల అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా, బాధ్యతలు చేపట్టిన అధికారులు శుక్రవారం మేయర్ గుండు సుధారాణిని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించారు. సుధారాణిని కలిసిన వారిలో బల్దియా అదనపు కమిషనర్ చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, డీసీపీ (డిప్యూటీ సిటీ ప్లానర్) రవీంద్ర రాడేకర్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ హేమ భాను, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ప్రతిభలు ఉన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు సుధారాణి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదివాసీల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

హనుమకొండ డీటీడబ్ల్యూవో ప్రేమకళ

వడ్డెపల్లి, ఆగస్టు 9: సమాజంలో వెనుకబడిన ఆదివాసీల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని హనుమకొండ జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి (డీటీడబ్ల్యూవో)ఆర్.ప్రేమకళ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివాసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి అశోక కాలనీలోని గిరిజన భవన్ వరకు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా డోలు వాయిద్యాలు, నృత్యాలతో నిర్వహించిన ర్యాలీ ఆద్యంతం ఆకట్టుకుంది. ఆదివాసీ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం గిరిజన భవన్‌లో నిర్వహించిన సభలో కొమురం భీం చిత్రపటానికి ప్రేమకళ పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ప్రేమకళ మాట్లాడుతూ.. 1994 నుంచి అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకున్నప్పటికీ ఈ యేడు మొట్టమొదటి సారిగా ప్రభుత్వం అధికారికంగా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగ సంఘం ట్రైసిటీ ప్రతినిధి చాప బాబుదొర, జిల్లా నాయకులు వాసం పాపయ్య, సారయ్య దొర, సిద్దబోయిన లక్ష్మీనారాయణ, సోయం ఓదెలు, మహిళా నేతలు శోభ, స్వరూప, లక్ష్మి, యాకలక్ష్మి, బుగ్గ నాగయ్య, వజ్జ తిరుపతి, ధనసరి రమేష్, సమ్మయ్య రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



వంటిల్లు

చల్లని వాతావరణంలో నాన్‌వెజ్ వంటకాల మీదకు మనసు మళ్లుతుంది. మీ పరిస్థితి కూడా అదే అయితే ఇవిగో ఈ నాన్‌వెజ్ రెసిపీలు వండుకుని కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేయండి.

మాన్‌సూన్ స్పెషల్స్

ఉసిరికాయ మాంసం వేపుడు

కావలసిన పదార్థాలు
మటన్: అరకిలో
ఉసిరికాయలు: 5
ఉల్లిపాయలు: 4
అల్లం వెల్లుల్లి పేస్ట్: 2 టీస్పూన్లు
ధనియాలు: 2 టీస్పూన్లు
జీలకర్ర పొడి: 1 టీస్పూన్
పచ్చిమిరపకాయలు: 10
ఉప్పు, కారం, పసుపు: తగినంత
నూనె: వేపుడుకు సరిపడా
కొత్తిమీర: ఒక కట్ట
వెల్లుల్లి: 10 రెబ్బలు

తయారీ విధానం
వెల్లుల్లి, ఉసిరి, పచ్చిమిర్చి, రెండు ఉల్లిపాయలను ముక్కలుగా చేసుకొని, కొత్తిమీరతో కలిపి రుబ్బుకోవాలి. మటన్‌లో మరో రెండు ఉల్లిపాయలను ముక్కలుగా చేసి, అల్లంవెల్లుల్లి ముద్ద, ధనియాల పొడి, జీలకర్ర పొడి, నూనె కలిపి మెత్తగా ఉడికించు కోవాలి. తర్వాత ముందుగా నూరిపెట్టుకున్న ఉసిరి ముద్ద వేసి, నీరంతా ఇగిరిపోయి పొడిగా తయారయ్యే వరకూ వేయించుకోవాలి. చివర్లో కొత్తిమీర చల్లుకుని అన్నం లేదా చపాతీతో తినాలి.


అనంతగిరి కోడి కీమా బాల్స్



కావలసిన పదార్థాలు
చికెన్: అర కిలో
మిరియాల పొడి: ఒక టీస్పూను
తోక మిరియాలు: అర టీస్పూను
క్యాప్సికమ్ (రెడ్, ఎల్లో): రెండు
ఉల్లిపాయ తురుము: ఒక కప్పు
కొత్తిమీర: ఒక కట్ట
కారం: రెండు టీస్పూన్లు
వెల్లుల్లి పొడి: ఒక టీస్పూను
కోడిగుడ్డు: ఒకటి
మొక్కజొన్న పిండి: టీస్పూన్
శనగపిండి: ఒక టీస్పూన్
ఉప్పు, నూనె: వేపుడుకు సరిపడా

తయారీ విధానం
చికెన్ కీమాలో వెల్లుల్లి పొడి, కారం, ఉప్పు, శనగపిండి, కొత్తిమీర తరుగు, ఉల్లి తరుగు, క్యాప్సికమ్ ముక్కలు, కోడిగుడ్డు, మొక్కజొన్న పిండి, మిరియాలు, మిరియాల పొడి వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చుట్టి, కాగే నూనెలో వేసి వేయించుకోవాలి. మంట మధ్యస్తంగా ఉంచి, ఉండలు బయటా, లోపలా సమంగా వేగేవరకూ ఉంచుకుని తీయాలి.

మేడారం కోడి పులావ్



కావలసిన పదార్థాలు
చికెన్: అరకిలో
నూనె: సరిపడా
ఉల్లిపాయలు: 2
కరివేపాకు: 2 రెమ్మలు
పచ్చిమిరపకాయలు: 5
బియ్యం: అరకిలో
చెక్క, లవంగ, యాలకులు: తగినన్ని
కొత్తిమీర, పుదీనా: చెరొక కట్ట
ధనియాల పొడి: 2 టీస్పూన్లు
అల్లంవెల్లుల్లి పేస్ట్: తగినంత
ఉప్పు: రుచికి సరిపడా

తయారీ విధానం
బియ్యం కడిగి నానబెట్టుకోవాలి. చికెన్‌లో ఉప్పు, కారం, అల్లంవెల్లుల్లి, పచ్చిమిరపకాయ ముక్కలు, కొద్దిగా నూనె కలుపుకుని అరగంట పాటు పక్కన పెట్టుకోవాలి. వేరే గిన్నెలో నూనె కాచి మసాలా దినుసులు, ధనియాల పొడి, తరిగిన ఉల్లి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించుకోవాలి. తర్వాత ముందుగా కలిపి పెట్టుకున్న చికెన్ మిశ్రమం వేసి కొత్తిమీర, పుదీనా వేసి 15 నిమిషాలు వేయించుకోవాలి. తర్వాత బియ్యానికి సరిపడా నీళ్లు పోసి, కొద్దిగా ఉప్పు వేసి మరిగించాలి. నీళ్లు మరిగిన తర్వాత నానబెట్టుకున్న బియ్యం కలిపి చిన్న మంట మీద మూత పెట్టి ఉడికించుకోవాలి. 10 నిమిషాల్లో మేడారం కోడి పులావ్ సిద్ధమైపోతుంది.



షెఫ్ **యాదగిరి**
వివాహ భోజనంబు
బంజారాహిల్స్, హైదరాబాద్

మేకప్

ఈ మేకప్ రెయిన్ ప్రూఫ్

వర్షాలు కురిసేటప్పుడు మేకప్ చెదిరిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి తేమకూ, చెమ్మకూ చెక్కుచెదరని మేకప్ మెలకువలు అలవరుచుకోవాలి. అందుకోసం ఇవిగో ఈ చిట్కాలు పాటించాలి.

వాటర్‌ప్రూఫ్ ఇలా: వాటర్‌ప్రూఫ్, దీర్ఘకాల ఫార్ములాలను కలిగి ఉండే సౌందర్య సాధనాలను ఎంచుకోవాలి. ఇవి వాతావరణంలోని తేమకు, అకస్మాత్తుగా కురిసే వర్షానికీ చెక్కుచెదరకుండా ఉంటాయి. ఇందుకోసం వాటర్‌ప్రూఫ్ ఐలైనర్, మస్కారా, మ్యాట్ లిక్విడ్ లిప్‌స్టిక్స్ ఎంచుకోవాలి. చివర్లో మేకప్‌ను లాక్ చేయడం కోసం సెట్టింగ్ స్ప్రే వాడుకోవాలి. బ్లాటింగ్ పేపర్లు, మ్యాటిఫయింగ్ పౌడర్లు రోజంతా మేకప్‌ను తాజాగా ఉంచుకోవడంలో సహాయపడతాయి

లిప్‌స్టిక్ లవ్లీగా: వర్షాకాలంలో క్రీమీ, గ్లాసీ లిప్‌స్టిక్ వాడకం మానేయాలి. లాంగ్‌వేరింగ్, మ్యాటి లిక్విడ్ లిప్‌స్టిక్స్ ఎంచుకోవాలి. బోల్డ్‌గా, ముదురు రంగుల లిప్‌స్టిక్స్ ఈ కాలానికి నూటవుతాయి. ఎరుపు, బెర్రీ, డీప్ ప్లమ్ రంగులు ఈ కాలంలో చాలా బాగుంటాయి. ఇవి కారిపోవు. తేమతో కూడిన వాతావరణంలో వెలిసిపోకుండా ఉంటాయి.



మేకప్ ఇలా: వాటర్‌ప్రూఫ్, స్మడ్జ్‌ప్రూఫ్, లాంగ్ లాస్టింగ్ మేకప్‌లను ఈ కాలంలో ఎంచుకోవాలి. గాలిలో తేమకూ, చెమ్మకూ చెదిరిపోకుండా ఉండే క్రీమ్, జెల్ ఆధారిత సౌందర్య సాధనాలను ఎంచుకుంటే అవి చర్మానికి అంటిపెట్టుకుని ఉంటాయి. ఈ కాలంలో పౌడర్ ఆధారిత మేకప్ సామాగ్రికి దూరంగా ఉండాలి. బ్లష్ నుంచి ఐషాడో వరకూ క్రీమ్ బేస్‌డ్ ఉత్పత్తులనే వాడుకోవాలి.

ఆకలి పెంచే చాక్లెట్.. ఖాడవం



చాక్లెట్లు పెడితే పిల్లలకు పళ్లు చెడిపోతాయని, కడుపులో ఎలిక పాములు పెరుగుతాయని, ఆకలి చచ్చిపోతుందనీ, తిన్నది వంటపట్టదనీ... ఇలా రకరకాలుగా భయపడతాం. కానీ, దంతాలను బాగు చేసి, కడుపులో నులిపురుగుల్ని చంపి, ఆకలిని పెంచి, తిన్నది వంటబట్టేలా చేసే చాక్లెట్ గురించి క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో ఓ అద్భుతమైన ఫార్ములా ఇచ్చాడు. ఈ చాక్లెట్లను మల్టీనేషనల్ కంపెనీలు మాత్రమే తయారు చేసేవి కాదు, మనకు మనమే ఇంట్లో తయారు చేసుకోగలిగేవి. ఆ చాక్లెట్ల పేరే 'ఖాడవం'.

లోకం గురించి, జనం గురించి ఆలోచించేవాళ్లను ఋషులంటారు. తన గురించి తన వ్యాపార సామ్రాజ్యం గురించి మాత్రమే ఆలోచించేవాళ్లను కాపురుషులంటారు. క్షేమశర్మ... పిల్లలే కాదు, పెద్దలు కూడా తినదగిన, తినాల్సిన చాక్లెట్ లేదా క్యాండీని తయారు చేసుకునే విధానాన్ని ఇలా వివరించాడు:

***కోలామలకజం చూర్ణా
శుంఠ్యేలాశర్కరాన్వితమ్!
మాతులుంగ రసేనాక్తం శోషితం
సూర్యరశ్మిభిః!***

- ఎండిన ఉసిరికాయలు... వనమూలికలు అమ్మే షాపుల్లో లేదా, పెద్ద పచారీ కొట్లలో దొరుకుతాయి. ఈ కాయల్ని పగలకొట్టి, లోపలి గింజల్ని తీసేయండి. మిగిలిన ఉసిరకను మిక్సీ పట్టి, జల్లించిన మెత్తని పొడిని సిద్ధం చేసుకోండి.
- నల్ల మిరియాల పొడిని కూడా ఇలానే చేసి, పక్కన పెట్టుకోండి.
- అల్లాన్ని ఎండిస్తే అదే శొంఠి. దీన్ని పైపైన కాల్చి, మిక్సీ పడితే మెత్తని పొడి వస్తుంది. ఈ పొడిని జల్లించగా వచ్చిన పీచుని కూడా ఒకట్రెండుసార్లు మిక్సీ పట్టండి. పీచు పారేయవద్దు. అదే డయటరీ ఫైబర్. పేగులకు బలాన్నిస్తుంది.
- ఈ మూడింటికీ ప్రత్యేకంగా కొలతలు చెప్పలేదు. ఉసిరికాయ పొడికి చాలినంత మిరియాలు, శొంఠి, ఏలకుల పొడులు కలపండి. దీనికి పంచదార జత చేసి, అన్నీ బాగా కలిసేలా మరోసారి మిక్సీ పట్టండి.
- ఒక మట్టి ముంతలోకి ఈ పొడిని తీసుకుని, అది మునిగే దాకా మాదీఫల రసం కానీ, నిమ్మ రసం కానీ పొయ్యండి. మూతపెట్టి ఒక రోజంతా నాననివ్వండి.
- మర్నాడు ఉదయం ఆ రసంతో సహా మిశ్రమాన్ని ఒక మూకుడులోకి తీసుకుని, మంచి ఎండలో ఎండనివ్వండి.
- రాత్రికి మళ్లీ అందులో నిమ్మ రసం కలిపి, రాత్రంతా నాననిచ్చి, మర్నాడు మళ్లీ ఎండలో పెట్టండి.

***ఏవంతు బహుశోభ్యక్తం శోషితంచ పునః పునః!
ఈషల్లవణ సంయుక్తం చూర్ణా ఖాడవముచ్యతే!***

ఈ విధంగా నిమ్మ రసంలో నానబెట్టి, ఎండబెట్టడం వల్ల నిమ్మలోని సారం అంతా ఉసిరి, మిరియాలు, శొంఠి పొడికి పట్టుకుంటుంది. దీన్ని 'భావన చేయటం' అంటారు. 'భావన' అంటే 'వాసన పట్టటం' అని నిఘంటువు అర్థం. ఏదైనా ద్రవంలో నాననివ్వటాన్ని 'భావన చేయటం' అంటారు. శొంఠి పొడి, కరక్కాయ, జీలకర్ర, వాము, లేదా సోంపును ఇలా భావన చేసి... భావన జీలకర్ర/ భావనశొంఠి లాంటివి తయారు చేస్తారు. ఏదైనా ఒక ద్రవ్యాన్ని అల్లం రసంలో ఏడుసార్లు భావన చేస్తే... అది శుద్ధి అవుతుంది. ఆయుర్వేద పద్ధతిలో ఇలా దోషాలు లేకుండా వనమూలికలు, లోహాలను భావన చేస్తారు.

ఇప్పుడు మనం ఉసిరికాయ, మిరియాలు, శొంఠి... ఈ మూడు గొప్ప వనమూలికలను నిమ్మ రసంలో భావన చేశాం. కనీసంలో కనీసం ఏడు రోజులు భావన చేయటంవల్ల ఈ మూడు ద్రవ్యాలూ నిమ్మ రసంతో శక్తిమంతమవుతాయి. తద్వారా కొన్ని అదనపు ఔషధ గుణాలను పొందుతాయి. బాగా ఎండిన



తరువాత దీన్ని మరొకసారి మిక్సీ పట్టండి. ఇందులో తగినంత ఉప్పు కూడా కలపమన్నాడు క్షేమశర్మ. అందువల్ల ఇది తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు రుచుల్ని కలిగి, ఆరు రసాల సమన్వితం అవుతుంది. ఈ పొడిని 'ఖాడవ' అంటారని వివరించాడు క్షేమశర్మ. ఆప్టే సంస్కృత నిఘంటువు 'ఖాడవ' అంటే 'క్యాండీ' అనే అర్థాన్నిచ్చింది.

> **'ఖాడవం ముఖవైశద్య కారకం రుచిధారకమ్!
> హృద్రోగశమనం చేతి ముఖవైరస్యనాశనమ్!'
> ఇలా తయారు చేసిన 'ఖాడవం' అనే చాక్లెట్‌ను చప్పరిస్తే ఆకలి అమాంతం పెరుగుతుంది. నాలుక మీద జిగురు పోయి, నోటికి రుచి తెలుస్తుంది. గుండెకు మంచిది. ఉసిరికాయ జీవన క్రియల్ని పెంపు చేసే ద్రవ్యం. ఈ విధంగా రోజూ ఉసిరికాయను పిల్లలకు కూడా ఇవ్వటానికి ఈ బిళ్లలు తోడ్పడతాయి. నోటి దుర్వాసన పోతుంది. దంత వ్యాధులు ఉపశమిస్తాయి. ఖాడవం పేగుల్ని శుభ్రపరుస్తుంది. జీర్ణశక్తిని దెబ్బ తీసే దోషాలన్నీ పోగొడుతుంది.**

ఈ పొడిని మన చాక్లెట్‌గా మలచుకోవాలి. దీని కోసం పంచదార లేత పాకం పట్టి, అందులో ఈ పొడిని కలపండి. తడిపిన తెల్లని వస్త్రాన్ని పరిచి, దానిమీద చెంచాతో చిన్నచిన్న బిళ్లల్లా లేదా వడియాల్లా పెట్టి ఆరనిస్తే అందరూ ఇష్టంగా తినే క్యాండీలు తయారవుతాయి. ఒక్కో బిళ్లని బుగ్గన పెట్టుకుని చప్పరించటమే!

విషపూరితమైన రంగులు, రసాయనాలు, ప్రిజర్వేటివ్స్, కృత్రిమ తీపి పదార్థాల్లాంటివి కలిపి తయారు చేసే చాక్లెట్లు, బిళ్లలే గొప్ప అనుకొంటున్నాం. అవేవి అవసరం లేని అద్భుతమైన క్యాండీని 'ఖాడవం'గా పరిచయం చేశాడు క్షేమశర్మ. దీన్ని ఇంట్లోనే చేసుకోవచ్చు.

● గంగరాజు అరుణాదేవి

బిజినెస్



లంబోర్ఘిని ఉరుస్ ఎస్ఈ
ప్రారంభ ధర రూ.4.57 కోట్లు

న్యూఢిల్లీ: ఇటలీకి చెందిన లగ్జరీ కార్ల కంపెనీ లంబోర్ఘిని భారత మార్కెట్లోకి ప్లగ్ ఇన్ హైబ్రిడ్ వెర్షన్ ఎస్‌యూవీ ఉరుస్ ఎస్ఈ విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.4.57 కోట్లు (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). ప్రపంచ మార్కెట్లోకి మరికొన్ని హైబ్రిడ్ వాహనాలను విడుదల చేయగానే వాటిని కూడా భారత్‌కు తీసుకు రానున్నట్లు కంపెనీ ప్రకటించింది. ట్విన్-టర్బో 4.0 వీ8 ఇంజన్‌తో కూడిన ఈ సరికొత్త ఉరుస్ ఎస్ఈ కారును విద్యుత్ మోటార్‌తో కూడా పనిచేసే విధంగా మార్పులు చేసినట్లు కంపెనీ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ ఫ్రాన్సిస్కో స్కార్డయోనీ చెప్పారు. 25.9 కేడబ్ల్యూహెచ్ లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన ఈ ఎస్‌యూవీ.. ఎలక్ట్రిక్ మోడ్‌లో నడిస్తే 60 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది.

హైదరాబాద్‌లో అమెజాన్ సత్వర సహాయ హబ్

న్యూఢిల్లీ: అమెజాన్ ఇండియా.. ఏవైనా ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినట్టయితే బాధితులకు 72 గంటల్లోగా సహాయక సామగ్రి అందించేందుకు దేశంలో నాలుగు హబ్‌లు ఏర్పాటు చేసింది. అవి థానే, ఫరీదాబాద్, హైదరాబాద్, పుర్బా బర్ధమాన్ నగరాల్లో ఉన్నాయి. ఈ కేంద్రాలు బాధితులకు సత్వర సహాయ సామగ్రిని తరలించగలుగుతాయని అమెజాన్ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,090 ▲	64,250 ▲	88,000 ▲
ముంబై	69,663 ▲	63,811 ▲	80,263 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	430
వరంగల్	407	గోదావరి	426
చిత్తూరు	493	విశాఖపట్నం	430
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	88
వరంగల్	80	గుంటూరు	88
కరీంనగర్	80	ఒంగోలు	88
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	90
కర్నూలు	80	నెల్లూరు	90
విశాఖపట్నం	84	అనంతపురం	88
గోదావరి	88		

బ్యాంక్ ఖాతాకు నలుగురు నామినీలు

ఖాతాదారులకు మరింత వెసులుబాటు

» బ్యాంకింగ్ నిబంధనల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం



న్యూఢిల్లీ: ప్రస్తుతం ఒక వ్యక్తి తన బ్యాంక్ ఖాతాకు ఒక నామినీని మాత్రమే ఎంచుకునే వీలుంది. త్వరలో ఖాతాదారు తన అకౌంట్‌కు గరిష్ఠంగా నలుగురిని నామినీలుగా ఎంచుకునే వెసులుబాటు లభించనుంది. ఇందుకు వీలు కల్పించే 'బ్యాంకింగ్ నిబంధనల (సవరణ) బిల్లు, 2024'ను కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు బ్యాంక్ అకౌంట్లు, లాకర్ల ఖాతాకు ఏకకాలంలో, వరుసగా నలుగురి పేర్లను నామినీలుగా చేర్చే సదుపాయం కల్పిస్తుంది. దురదృష్టవశాత్తూ బ్యాంక్ ఖాతాదారు మరణిస్తే, తన అకౌంట్‌లోని సొమ్ము లేదా లాకర్‌లోని వస్తువులు నామినీకి చెందుతాయి. అయితే, నామినీ వాటిని బ్యాంక్ నుంచి క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. గత వారమే కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన బ్యాంకింగ్ నిబంధనల సవరణ బిల్లులో ప్రతిపాదించిన మరిన్ని అంశాలు..

- క్లెయిమ్ చేయని డివిడెండ్లు, షేర్లు, బాండ్లను ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఈపీఎఫ్)కు బదిలీ చేసే అధికారం కల్పించడంతోపాటు వ్యక్తులు ఆ ఫండ్ నుంచి తమ సొమ్మును తిరిగి క్లెయిమ్ చేసుకునేందుకు అనుమతించాలని బిల్లు ప్రతిపాదించింది.
- డైరెక్టర్‌షిప్‌కు సబ్‌స్టాన్షియల్ ఇంట్రెస్ట్ పరిమితిని ఆరు దశాబ్దాల క్రితం నిర్దేశించిన రూ.5 లక్షల స్థాయి నుంచి రూ.2 కోట్లకు పెంచాలని బిల్లు ప్రతిపాదించింది.
- బ్యాంక్‌లు తమ ఆడిటర్లకు చెల్లించే పారితోషికంపై మరింత స్వేచ్ఛ కల్పించాలని బిల్లు ప్రతిపాదించింది. అలాగే, నియంత్రణ నియమాళికి లోబడి బ్యాంక్‌ల రిపోర్టింగ్ తేదీలను ప్రస్తుతం పాటిస్తున్న రెండు, నాలుగో శుక్రవారాలకు బదులు ప్రతినెలా 15వ తేదీతో పాటు నెల చివరి రోజుకు మార్చాలని బిల్లు ప్రతిపాదించింది.
- సహకార బ్యాంక్‌ల్లో చైర్మన్, పర్మినెంట్ డైరెక్టర్లు మినహా మిగతా డైరెక్టర్ల పదవీకాలాన్ని 8 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పొడిగించాలని బిల్లు ప్రతిపాదించింది.
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934, బ్యాంకింగ్ నియమాళి చట్టం 1949, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1955, బ్యాంకింగ్ కంపెనీస్ (అక్విజిషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్) చట్టం 1970, బ్యాంకింగ్ కంపెనీస్ (అక్విజిషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్) చట్టం 1980లను సవరించాలని కూడా బిల్లు ప్రతిపాదించింది.

భారతీయ వాయుయాన్ విధాయక్ బిల్లుకు ఆమోదం

దేశంలో విమానయాన రంగ అభివృద్ధి మరింత పుంజుకోనుంది. ఇందుకు దోహదం చేసే 'భారతీయ వాయుయాన్ విధాయక్ బిల్లు'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 1934 నాటికి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో ప్రభుత్వం ఈ బిల్లు తీసుకొచ్చింది. దీంతో దేశంలో పౌర విమానయాన వ్యాపారం మరింత సులభతరం అవుతుందని భావిస్తున్నారు. ఈ బిల్లును ప్రవేశపెడుతూ దేశంలో విమాన చార్జీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు.

మార్కెట్లో రికవరీ ర్యాలీ

సెన్సెక్స్ 819 పాయింట్లు అప్



ముంబై: ఈ వారం ఆరంభ నష్టాల నుంచి స్టాక్ మార్కెట్లు క్రమంగా కోలుకున్నాయి. వారాంతం ట్రేడింగ్‌లో ప్రపంచ మార్కెట్లతో పాటు దేశీయ ఈక్విటీ సూచీలూ ర్యాలీ తీశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,098 పాయింట్ల వరకు పెరిగి 79,984.24 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 819 పాయింట్ల లాభంతో 79,705.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 302 పాయింట్లు ఎగబాకినప్పటికీ, చివర్లో 250.50 పాయింట్ల లాభంతో 24,367.50 వద్ద క్లోజైంది. అమెరికాలో నిరుద్యోగ భృతి క్లెయిమ్‌ల గణాంకాలు సానుకూలంగా నమోదు కావడంతో ఆర్థిక మాంద్యం భయాలు తగ్గుముఖం పట్టాయి. దాంతో అమెరికాతో పాటు ప్రపంచ మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్ మెరుగుపడిందని ఈక్విటీ నిపుణులు పేర్కొన్నారు. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.46 లక్షల కోట్లు పెరిగి రూ.450.21 లక్షల కోట్లకు (5.37 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.
- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 28 లాభపడ్డాయి. టెక్ మహీంద్రా షేరు 2.74 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా మోటార్స్, ఎం అండ్ ఎం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌సీఎల్ టెక్, ఎస్‌బీఐ షేర్లూ రెండు శాతానికి పైగా పెరిగాయి. మార్కెట్ దిగ్గజ షేర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.82 శాతం, ఇన్ఫోసిస్ 1.71 శాతం, టీసీఎస్ 1.42 శాతం రాణించాయి.

ఓలా ఎలక్ట్రిక్ లిస్టింగ్ హిట్ .. తొలిరోజే 20 శాతం ఎగబాకిన షేరు

విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు మంచి స్పందన లభించింది. శుక్రవారం కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.76తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 0.01 శాతం డిస్కౌంట్‌తో రూ.75.99 వద్ద లిస్టయినప్పటికీ, ఇంట్రాడేలో క్రమంగా పుంజుకుంది. మధ్యాహ్నానికల్లా అప్పర్ సర్క్యూట్ లిమిట్ 19.97 శాతం పెరిగి రూ.91.18కి చేరుకున్న షేరు.. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి అదే స్థాయి వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) రూ.40,217.95 కోట్లుగా నమోదైంది. మంగళవారంతో ముగిసిన ఈ రూ.6,145 కోట్ల ఐపీఓకు 4.27 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

ఇంధన విప్లవానికి
భారత్ కేంద్రం కావాలి

» అమర రాజా 'ఎవాల్వ్' సదస్సులో అమితాబ్ కాంత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తక్కువ కర్బన వ్యర్థాలను విడుదల చేసే టెక్నాలజీలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచస్థాయిలో ఇంధన విప్లవానికి భారత్ కేంద్రంగా మారాలని జీ-20 షెర్పా, నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ పిలుపు ఇచ్చారు. ఆధునిక బ్యాటరీ టెక్నాలజీలపై చర్చించేందుకు అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ (ఏఆర్ఈఎం) పూర్తి యాజమాన్య సంస్థ అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ (అరాక్ట్) నిర్వహించిన "ఎవాల్వ్ 2024" సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్య చేశారు. ఎవాల్వ్ సదస్సు వంటివి పరిశ్రమకు చెందిన నాయకులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలను ఒకే వేదిక పైకి తెస్తాయని ఆయన అన్నారు. "ఇంధన పరివర్తన: భవిష్యత్ సంసిద్ధత, భారత ప్రాధాన్య వైఖరి" పేరిట అరాక్ట్ ఈ కార్యక్రమం నిర్వహించింది. తక్కువ కర్బన టెక్నాలజీలతో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ ద్వారా ప్రపంచానికే నాయకత్వం వహించగల స్థాయిలో భారత్ ఉన్నదని కాంత్ అన్నారు. కీలకమైన టెక్నాలజీ, సరఫరా వ్యవస్థలకు సంబంధించిన సవాళ్లకు దీటైన పరిష్కారాలు కనుగొనేందుకు భాగస్వామ్య వర్గాలన్నింటినీ ఒకే వేదిక పైకి తీసుకురావడం ఎవాల్వ్ 2024 లక్ష్యమని ఏఆర్ఈఎం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జయదేవ్ గల్లా అన్నారు.



ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.2,054 కోట్ల డివిడెండ్‌ను అందజేసింది. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి (బ్యాంకింగ్) సమీర్ శుక్లాకు యూబీఐ ఎండీ, సీఈఓ ఏ. మణిమేఖలై ఈ డివిడెండ్ చెక్‌ను అందజేశారు.

కెనరా బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేట్లు పెంపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ నిధుల సమీకరణ ఆధారిత వడ్డీ రేటును (ఎంసీఎల్ఆర్) 0.05 శాతం మేరకు పెంచింది. ఈ పెంపు వల్ల కెనరా బ్యాంక్ వినియోగ రుణాలు ప్రియం అవుతాయి. బ్యాంక్ తాజా నిర్ణయం ప్రకారం ఆటో, వ్యక్తిగత రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8.95 శాతం నుంచి 9 శాతానికి పెరుగుతుంది. మూడు సంవత్సరాల కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్ఆర్ 9.40 శాతానికి పెరుగుతుంది. అలాగే నెల, మూడు నెలలు, ఆరు నెలల కాల పరిమితి రుణాలపై వడ్డీ రేటు 8.35 శాతం నుంచి 8.80 శాతం మధ్యన ఉంటుంది. ఈ కొత్త రేట్లు ఈ నెల 12వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంక్ ప్రకటించింది.

సమాచార నాణ్యతా ముఖ్యమే

» ఇందుకోసం రెండు వ్యవస్థలు : సెబీ

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్‌ను మరింత సంస్కరించేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సిద్ధమైంది. ఇందులో భాగంగా పెర్ఫార్మెన్స్ వ్యాలిడేషన్ ఏజెన్సీ, డేటా బెంచ్‌మార్కింగ్ ఇనిస్టిట్యూషన్ పేరుతో రెండు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సెక్యూరిటీస్ మార్కెట్లో మదుపరులకు అందే సమాచార నాణ్యత పెంచేందుకు సెబీ ఈ చర్యలు ప్రతిపాదించింది. ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ (ఐఏ), రీసెర్చి అనలిస్టులు (ఆర్ఏ), ఆల్గో ప్రొవైడర్ల సేవల నాణ్యతను పెర్ఫార్మెన్స్ వ్యాలిడేషన్ ఏజెన్సీ మదింపు చేస్తుంది. ఇక వివిధ ఆస్తులకు సంబంధించిన ప్రామాణిక డేటా వివరాలను డేటా బెంచ్‌మార్కింగ్ ఇనిస్టిట్యూషన్ పర్యవేక్షిస్తుంది. గత ఆర్థిక సంవత్సరం వార్షిక నివేదికలో సెబీ ఈ వివరాలు వెల్లడించింది.

మున్సిపల్ బాండ్స్‌లోనూ మదుపు చేయండి: బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్ సంస్థలు మున్సిపల్ బాండ్స్‌లోనూ మదుపు చేయాలని సెబీ ఈడీ ప్రమోద్ రావు కోరారు. మన దేశ ఆర్థిక వ్యవస్థతో పోలిస్తే ప్రస్తుతం ఈ బాండ్స్ మార్కెట్ 30,000 కోట్ల అమెరికా డాలర్లు మాత్రమేనన్నారు. అమెరికాలో మున్సిపల్ బాండ్స్ మార్కెట్ 4లక్షల కోట్ల డాలర్లు ఉంటుందన్నారు.

హైదరాబాద్ రియల్టీ అదుర్స్

» జూలైలో 7,124 రిజిస్ట్రేషన్లు
» గత ఏడాదితో పోలిస్తే 48 శాతం అప్
» నైట్ ఫ్రాంక్ ఇండియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ రెసిడెన్షియల్ మార్కెట్లో జోరు కొనసాగుతోంది. గత నెల (జూలై)లో జీహెచ్ఎంసీ పరిధిలో రూ.4,266 కోట్ల విలువైన 7,124 ఇళ్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రిజిస్ట్రేషన్లు విలువపరంగా 48%, యూనిట్లపరంగా 28% పెరిగినట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక తెలిపింది. ఇక ఈ ఏడాది జనవరి నుంచి చూస్తే గత ఏడు నెలల్లో జీహెచ్ఎంసీ పరిధిలో 46,368 యూనిట్ల ఇళ్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 17% ఎక్కువ. ఈ రిజిస్ట్రేషన్లతో రాష్ట్ర ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ ద్వారా సమకూరే ఆదాయం 40% పెరిగి రూ.28,578 కోట్లకు చేరింది.

రూ.50 లక్షల్లోపు రిజిస్ట్రేషన్లే ఎక్కువ: ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో అమ్ముడయ్యే ఇళ్లలో రూ.50 లక్షలు అంతకంటే తక్కువ ధర ఉండే ఇళ్లే ఎక్కువ. గత ఏడాది ఈ తరహా ఇళ్ల వాటా 61% ఉంటే, ఈ ఏడాది జూలైలో ఇది 69 శాతానికి చేరిందని తెలిపింది. ఇదే సమయంలో రూ.కోటి అంతకంటే ఎక్కువ విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు 9 నుంచి 13 శాతానికి చేరాయి. విలువపరంగా చూస్తే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జూలైలో రూ.కోటి అంతకంటే ఎక్కువ విలువైన ఇళ్ల అమ్మకాలు 94% పెరిగాయి.

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.



ఏఐసీటీఈ

ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు

- డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.
- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు

- డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్

- టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి/ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఆదాయ ధ్రువీకరణ పత్రం; సంబంధిత కోర్సులో అడ్మిషన్ పొందిన లెటర్; ట్యూషన్ ఫీజు రిసీట్; ఆధార్ లింక్‌తో ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్; ఐఎఫ్ఎస్‌సీ కోడ్; కుల ధ్రువీకరణ పత్రం; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 15
- **డీఎన్‌ఓ/ఎస్ఎన్‌ఓ/ఎంఎన్‌ఓ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

దిక్సూచి DIKSUCHI

జేఎన్‌టీయూహెచ్‌లో స్పాట్ అడ్మిషన్స్



హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్(డీయూఎఫ్ఆర్)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో విదేశీ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో సీట్లు అలాట్ చేస్తారు. ఎఫ్ఎన్/పీఐఓ/సీఐడబ్ల్యూజీ/ఎన్ఆర్ఐ కేటగిరీల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్దేశిత ఫీజులతో క్యాంపస్‌కు హాజరు కావాలి.

నాలుగేళ్ల బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ-ఏఐఎంఎల్ 6, సీఎస్ఈ-సైబర్ సెక్యూరిటీ 5, ఈసీఈ 4, ఈఈఈ 6, మెకానికల్ 6, సివిల్ 6, కెమికల్ 6, మెటలర్జీ 8, బయోటెక్నాలజీ 6, జియో ఇన్ఫర్మాటిక్స్ 8 సీట్లు చొప్పున మొత్తం 61 సీట్లు ఉన్నాయి.

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగాల్లో ఒక్కోదానిలో 5 సీట్లు చొప్పున మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

మూడేళ్ల మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్-సీట్లు

- బీబీఏ ప్రోగ్రామ్‌లో 6 సీట్లు ఉన్నాయి.
- **స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 12 నుంచి
- **వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఫిల్మ్ డైరెక్షన్‌లో ఆన్‌లైన్ కోర్సు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్(సీఎఫ్ఓఎల్)- 'ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. మొత్తం 33 సీట్లు ఉన్నాయి.

కోర్సు వివరాలు: కోర్సు వ్యవధి అయిదు రోజులు. ఆగస్టు 26 నుంచి కోర్సు ప్రారంభమౌతుంది. ప్రతి రోజూ ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు, మరల మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు సెషన్స్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. ఈ కోర్సులో సినిమా, లాంగ్వేజ్ ఆఫ్ సినిమా, స్పేస్ అండ్ టైమ్ ఆఫ్ సినిమా, ఫిల్మ్ ఫోరం, ఫిల్మ్ ఇమేజ్, ఫిల్మ్ సౌండ్, ఎలిమెంట్స్ ఆఫ్ స్టోరీ, స్క్రీన్‌ప్లే, వర్కింగ్ విత్ యాక్టర్స్, రోల్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్టర్ తదితర అంశాలు వివరిస్తారు.

అర్హత: పదోతరగతి/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. అభ్యర్థులు కనీసం 4 జీబీ ర్యామ్ గల డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్, విండోస్ 7/8/10 ఆపరేటింగ్ సిస్టమ్, ఆడియో-వీడియో సాఫ్ట్‌వేర్, హెడ్‌ఫోన్/ఇయర్‌ఫోన్, హెచ్‌డీ వెబ్ క్యామ్, రోజుకి కనీసం 5 జీబీ ఇంటర్నెట్ ప్యాక్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్ ఏర్పాటు చేసుకోవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** ftii.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/RXxeHDnలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

షూటింగ్ షురూ



అభిమానులంతా ఎప్పుడెప్పుడు షూటింగ్ మొదలవుతుందా అని ఎదురుచూస్తున్న క్రేజీ ప్రాజెక్ట్‌లో డైరెక్టర్ ప్రశాంత్ నీల్, జూనియర్ ఎన్టీఆర్ సినిమా ఒకటి. 'ఎన్టీఆర్ నీల్' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, డైరెక్టర్ నీల్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఈ సినిమాపై ఎన్ని అంచనాలు ఉన్నాయో తెలిసిందే. ఆ అంచనాలను మించి ఈ సినిమా ఉంటుంది. ఓ వైవిధ్యమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది" చెప్పారు. పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కనున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2026 జనవరి 9న విడుదల కానుంది.



మురారి చూస్తూ మూడుముళ్లు

అభిమాన హీరో సినిమా రిలీజ్ అవుతోందంటే క్షీరాభిషేకాలు, హారతులు, తీన్‌మార్ డప్పుల మోతలతో ఫ్యాన్స్ సందడి చేయడం తెలిసిందే. ఇప్పుడు మహేశ్‌బాబు అభిమానులు మరో అడుగు ముందుకేశారు. శుక్రవారం ఆయన నటించిన 'మురారి' చిత్రం రీ రిలీజ్ అయింది. ఈ సందర్భంగా కొందరు అభిమానులు థియేటర్లలో ప్రేక్షకులకు అక్షింతలు పంచగా, మరికొందరు థియేటర్లలోనే పెళ్లి చేసుకొన్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తెలుగు సినిమాల్లో పెళ్లి పాటల ప్రస్తావన తెస్తే అందులో 'మురారి' చిత్రంలోని 'అలనాటి రామచంద్రుడు' గీతం తప్పకుండా ఉంటుంది. అందుకేనేమో 'మురారి' సినిమా రీ రిలీజ్‌ను తమ పెళ్లికి వేదికగా చేసుకున్నారు మహేశ్‌బాబు అభిమానులు. 'అలనాటి రామచంద్రుడు' గీతం తెరపై ప్లే అవుతోన్న సమయంలో తన ప్రియురాలు మెడలో మూడు ముళ్లు వేశాడు ఓ యువకుడు. మరికొన్ని థియేటర్లలో అభిమానులు ప్రేక్షకులకు అక్షింతలు పంచారు. మహేశ్‌బాబు, సోనాలి బింద్రే పెళ్లి సీన్ రాగానే వాటిని తెరపైకి విసురుతూ వారంతా సందడి చేస్తున్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం 2001లో విడుదలై ఘన విజయం అందుకొంది.



బచ్చన్ అలరిస్తాడు

'మిస్టర్ బచ్చన్' సినిమాతో కథానాయికగా తెలుగుతెరకు పరిచయమౌతున్నారు భాగ్యశ్రీ బోర్సే. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్‌లో తన అందం, అభినయంతో కుర్రకారు మనసును దోచేసిన ఆమె.. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. "ఇందులో నేను పోషించిన పాత్ర పేరు జిక్కీ. సినిమాలో నా పాత్ర చాలా కీలకమైనది. దర్శకుడు హరీశ్ శంకర్ ఈ కథ చెప్పగానే నచ్చేసింది. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. అంచనాలను మించేలా దర్శకుడు ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఇది బాలీవుడ్ సినిమా రైడ్‌కు రీమేక్‌గా తెరకెక్కినా ఇందులో వినోదం, ప్రేమకథ అదనంగా ఉంటాయి. రవితేజ లాంటి అగ్ర నటుడితో కలసి నటించడం చాలా మధురానుభూతి. మిక్కీ.జే.మేయర్ సంగీతం ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. థియేటర్లో ప్రతి క్షణం ఎంజాయ్ చేసే సినిమా ఇది" అని చెప్పారు.



సూర్యకు స్వల్ప గాయం

తమిళ హీరో సూర్య స్వల్పంగా గాయపడ్డారు. ఆయన తాజాగా నటిస్తున్న చిత్రం షూటింగ్‌లో ఈ ప్రమాదం జరిగింది. అభిమానులు ఆందోళన చెందడంతో సూర్య స్నేహితుడు, సహ నిర్మాత రాజశేఖర్ పాండ్యన్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'ప్రియమైన అభిమానులారా.. ఇది కేవలం చిన్న గాయం మాత్రమే. దయచేసి ఎవరూ ఆందోళన చెందకండి. మీ అందరి ఆదరాభిమానాలు, ప్రేమ, ప్రార్థనలతో సూర్య బాగానే ఉన్నారు' అని పేర్కొన్నారు. కాగా, 'కంగువా' సినిమా తర్వాత కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో 'సూర్య44' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ కొత్త చిత్రం తెరకెక్కుతోంది. ఊటీలో రెండో షెడ్యూల్ షూటింగ్ జూలై 26 నుంచి శరవేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా 'నవానగర్ ప్యాలెస్'లో జూనియర్ ఫైటర్లతో కలిసి పోరాట సన్నివేశాన్ని చిత్రీకరిస్తుండగా, సూర్య తలకు స్వల్ప గాయమైంది. ఆ వెంటనే ఆయన్ని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈ ఘటన కారణంగా షూటింగ్ నిలిపివేశారు. చికిత్స అనంతరం సూర్య మళ్లీ లొకేషన్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

కీలక షెడ్యూల్‌లో...



తమిళ స్టార్ హీరో అజిత్‌కుమార్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు-తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ బైలింగువల్ చిత్రానికి 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సంక్రాంతి కానుకగా 2025లో చిత్రం విడుదలవుతోంది.

కొత్తగా...

నిరీక్షణకు తెర



'కేజీఎఫ్' తర్వాత యశ్ ఏ సినిమా చేస్తారా అని ఎదురు చూస్తున్న అభిమానుల నిరీక్షణకు తెర పడింది. ఆయన హీరోగా నటించే పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్.. ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' చిత్రం షూటింగ్ బెంగళూరులో పూజా కార్యక్రమాలతో మొదలైంది. యశ్ పుట్టిన రోజున ప్రారంభమైన ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. పవర్‌ఫుల్ కథతో, ఎమోషనల్ సీన్స్‌తో విజువల్‌గా ఉన్నతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తామని నిర్మాత వెంకట్ కె నారాయణ చెప్పారు.

నిర్మాతగా మారిన దర్శకుడు



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించే 'తల్లి మనసు' చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం అన్నపూర్ణ స్టూడియోలో మొదలైంది. ముహూర్తపు షాట్‌కు ఏషియన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ నారంగ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ నిర్మాత పోకూరి బాబూరావు తొలి క్లాప్ ఇచ్చారు. 'టైటిల్‌ను బట్టి చూస్తేనే ఇది ఎంత మంచి సబ్జెక్టో మీకు అర్థమవుతుంది' అన్నారు ముత్యాల సుబ్బయ్య. ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథా చిత్రమిదని దర్శకుడు శ్రీనివాస్ చెప్పారు.

ఎన్టీఆర్ మునిమనవడితో



నందమూరి హరికృష్ణ, బాలకృష్ణలతో సినిమాలు రూపొందించిన దర్శకుడు, సీనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని అయిన వై.వి.ఎస్. చౌదరి తాజాగా ఓ చిత్రాన్ని రూపొందించనున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ (ఎన్.టి.ఆర్.)పతాకంపై ఆయన సతీమణి గీత ఈ సినిమాను నిర్మించనున్నారు. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు నందమూరి తారక రామారావు ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. అలాగే తెలుగు అమ్మాయి వీణా రావుని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వై.వి.ఎస్. చౌదరి చెప్పారు.

'డీల్' కుదిరిందా?



హీరో హను కోట్ల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'డీల్'. పద్మారమా కాంతారావు, కొల్వి రామకృష్ణ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హను కోట్ల మాట్లాడుతూ "ఇదో డిఫరెంట్ కథతో వస్తున్న సినిమా. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని తెలిపారు.

కర్ణాటక నాటక అకాడమీ పురస్కారాన్ని తిరస్కరించిన ప్రకాశ్‌రాజ్



కర్ణాటక నాటక అకాడమీ వార్షిక పురస్కారాన్ని విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ తిరస్కరించారు. ఈ మేరకు 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు. అభిమానులు, అకాడమీని క్షమాపణలు కోరారు. పురస్కారాన్ని తీసుకునేందుకు తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, క్షమించాలని అన్నారు. ఇప్పుడిప్పుడే నాటకరంగంవైపు వెనుతిరిగానని, చేయాల్సిన పనులు ఎక్కువే ఉన్నాయని పేర్కొన్నారు. తనకంటే ఎంతో మంది అర్హులు రంగస్థలంలో ఉన్నారని, అందుకే తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, పురస్కారాన్ని తిరస్కరించానని తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

సుప్రీం కోర్టులో లాపతా లేడీస్ ప్రదర్శన

బాలీవుడ్ చిత్రం 'లాపతా లేడీస్'కు అరుదైన గౌరవం దక్కింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు చరిత్రలో తొలిసారి ప్రదర్శించిన సినిమాగా చరిత్ర సృష్టించింది. సుప్రీం కోర్టు వజ్రోత్సవాలను పురస్కరించుకొని 'లాపతా లేడీస్'ను శుక్రవారం సాయంత్రం కోర్టు ఆడిటోరియంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు ఇతర న్యాయమూర్తులు, న్యాయస్థానం సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలసి ఈ చిత్రాన్ని వీక్షించారు. తన సొంత ప్రొడక్షన్‌లో ఆమిర్‌ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ఆయన మాజీ భార్య కిరణ్‌రావు దర్శకత్వం వహించారు. వారిద్దరూ ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లింగ సమానత్వం నేపథ్యంలో తెరకెక్కిన 'లాపతా లేడీస్' చిత్రం ఈ ఏడాది మార్చిలో విడుదలైంది. కమర్షియల్‌గా విజయం సాధించకపోయినా, విమర్శకుల ప్రశంసలతో పాటు పలు పురస్కారాలు అందుకుంది.

నేనా.. సింగిలా..!



కీర్తి సురేశ్ నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఉన్న ఆమె.. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "ప్రస్తుతం నా కెరీర్‌ను ఎంతో బాగా ఆస్వాదిస్తున్నాను. నా దృష్టిలో పెళ్లి అంటే ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ జీవితాంతం కొనసాగడమే" అని పేర్కొన్నారు. ఓ విలేఖరి మీరు సింగిలా అని ఆమెని అడగ్గా.. "నేను మీకెప్పుడు సింగిల్ అని చెప్పలేదు కదా" అని బదులిచ్చారు. దీంతో ఆమె రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు నిజమేనేమో అని అభిమానులు భావిస్తున్నారు.

దుబాయ్‌లో అమ్మేస్తాడేమో...

తాప్సీ పన్ను నటించిన 'ఖేల్ ఖేల్ మే' ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె మీడియాతో ముచ్చటించి ఓ ఆసక్తికర విషయాన్ని తెలియజేశారు. "నేను, నా భర్త మథియస్ బో 2013లో మొదటిసారి కలుసుకున్నాం. మొదటి సారి తనతో డేటింగ్‌కు వెళ్లాల్సినప్పుడు నన్ను దుబాయ్ రమ్మని మథియస్ ఆహ్వానించాడు. ఆ విషయం నా మిత్రురాలికి చెబితే.. జాగ్రత్త.. ఆయన నిన్ను దుబాయ్‌లో అమ్మేస్తాడేమో.. ఎందుకైనా మంచిది.. మా అక్క నంబర్ తీసుకో" అని ఓ స్నేహితురాలు చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు.



ప్రేమకథను ప్రశంసిస్తున్నారు



విజయ్‌శంకర్ హీరోగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం శుక్రవారం సినిమా విడుదలై మంచి టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించింది. కథకు అందరూ కనెక్ట్ అయ్యారు. ప్రేమకథ కొత్తగా ఉందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ సినిమా విజయం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉంది. యూత్, ఫ్యామిలీ.. ఇలా అన్ని వర్గాలకు చెందిన ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు" అని చెప్పారు.

ప్రణయ గాథ



ఎస్.ఎస్. సైదులు, భ్రమరాంబిక, అర్పిత లోహి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం '1980ల రాధేకృష్ణ'. ఇస్మాయిల్ షేక్ దర్శకత్వంలో ఊడుగు సుధాకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన ప్రేమ కథ. ఈ సినిమా ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది" అని చెప్పారు.

2008 నుంచి మన రెజ్లర్లు పతకం లేకుండా ఒలింపిక్స్ నుంచి వెనుదిరిగిందే లేదు. కానీ పారిస్‌లో మెడల్ మాత్రం అతి సమీపం వరకు వచ్చినట్టే వచ్చి చేజారింది. గెలవాల్సిన మ్యాచ్‌లో నిషా దహియా గాయంతో వైదొలగడం.. ఇక కనీసం రజతం ఖాయమనుకున్న వినేశ్ ఫొగట్‌పై అనర్హత వేటుతో భారత క్రీడాభిమాని ఆవేదన మరింత రెట్టింపయ్యింది. ఈసారిక రిక్తహస్తాలతో వెనుదిరగడమేనా అనుకున్న వేళ.. నేనున్నానంటూ.. 21 ఏళ్ల అమన్ సెహ్రావత్ ముందుకొచ్చాడు. సెమీస్‌లో ఓడిన అతను కాంస్య పతక పోరుకు సై అంటూ ఉడుం పట్టుతో ప్రత్యర్థిని పడగొట్టాడు. మెడల్‌ను సగర్వంగా మెడలో వేసుకుని త్రివర్ణపతాకాన్ని రెపరెపలాడించాడు.

అమన్.. అదరహో

57 కిలోల ఫ్రీస్టయిల్‌లో కాంస్యం కైవసం

భారత్ ఖాతాలో ఆరో పతకం





పారిస్: కుస్తీలో భారత్ బోణీ కొట్టింది. పురుషుల 57 కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో 21 ఏళ్ల అమన్ సెహ్రావత్ కాంస్య పతకం సాధించాడు. తద్వారా పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి రెజ్లర్‌గా అమన్ నిలిచాడు. శుక్రవారం ప్యూర్టోరికోకు చెందిన డారియన్ క్రజ్‌ను అమన్ 13-5 తేడాతో చిత్తుగా ఓడించాడు. తద్వారా 2008 బీజింగ్ ఒలింపిక్స్ నుంచి భారత రెజ్లర్లు పతకాలతోనే స్వదేశానికి వెళ్లే సంప్రదాయాన్ని కొనసాగించినట్టయ్యింది. అలాగే హరియాణాకు చెందిన అమన్‌కిది తొలి ఒలింపిక్స్ కావడం విశేషం. గురువారం జరిగిన సెమీస్‌లో అమన్ జపాన్ రెజ్లర్ రీ హిగుచి చేతిలో ఓడి కాంస్య పతక పోరుకు అర్హత సాధించాడు. ఓవరాల్‌గా భారత్ తరఫున ఒలింపిక్ పతకం సాధించిన ఏడో రెజ్లర్‌గా అమన్ సెహ్రావత్ నిలిచాడు. సుశీల్ ఒక్కడే రెండు పతకాలు సాధించాడు.

పూర్తి ఆధిపత్యం

రాత్రి 11.10 గంటలకు ఆరంభమైన కాంస్య పోరులో అమన్ వ్యూహాత్మకంగా ప్రత్యర్థిపై పట్టు సాధించాడు. మొదట తను ప్రత్యర్థికి చిక్కకుండా రింగ్ దాటి బయటకు వెళ్లడంతో పాయింట్ కోల్పోయినా.. ఆ తర్వాత డారియన్‌ను పడేయడంతో రెండు పాయింట్లు సాధించి ఆధిక్యం పొందాడు. కానీ అటు డారియన్ కూడా వెంటనే కోలుకుని రెండు పాయింట్లతో పోటీ ఇచ్చాడు. ఆ వెంటనే అమన్ వేగంగా కదిలి పడగొట్టడంతో 4-3తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఓ దశలో 6-5తో డారియన్ నుంచి కాస్త పోటీ ఎదురైనా ఆ తర్వాత తను అలిసిపోయినట్టు కనిపించాడు. అటు అమన్ మాత్రం పదేపదే అతడిని టేక్‌డౌన్ చేయడంతో పాయింట్లు వేగంగా పెరిగాయి. ప్రత్యర్థికి మరో పాయింట్ ఇవ్వకుండా 13-5తో ముగించడంతో భారత శిబిరంలో కంచు సంబరాలు ఆరంభయ్యాయి.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

'త్రివర్ణ పతాకం గుర్తుతో కూడిన జెర్సీని ధరించడం నాకెంతో గర్వంగా ఉంటుంది. అందుకే బౌట్‌లో దిగిన ప్రతి సారీ అత్యుత్తమ ప్రదర్శన చేసి దేశం గర్వపడేలా చేస్తా..'

ఈ మాట అన్నది భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్. అలా అద్భుత ప్రదర్శన చేస్తున్నాడు కాబట్టే రెజ్లింగ్‌లో ప్రవేశించిన అనతికాలంలోనే ఒలింపిక్స్ కాంస్య పతకం సహా అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో మరపురాని విజయాలు అందుకున్నాడు. 21 ఏళ్లకే విశ్వ క్రీడల్లో పతకం నెగ్గే స్థాయికి ఎదిగిన అమన్ బాల్యం విషాద మయం. హరియాణాలోని ఝజ్జర్ జిల్లా బిరోహర్ గ్రామం అమన్ స్వస్థలం. 11 ఏళ్ల వయస్సులోనే తల్లిదండ్రులు సోమ్‌వీర్ సెహ్రావత్, కమలేష్ సెహ్రావత్‌లను కోల్పోయాడు.

తల్లిదండ్రులను కోల్పోయి.. డిప్రెషన్‌లోకి వెళ్లి!

దాంతో అమన్, అతడి చెల్లి పూజా సెహ్రావత్ ఆలనాపాలనను తాతయ్య సుధీర్ సెహ్రావత్ చేపట్టాడు. తల్లిదండ్రులను కోల్పోయి తీవ్ర డిప్రెషన్‌కు లోనైన అమన్ కోలుకున్నాడంటే అందుకు అతడి నానమ్మ మంగేరామ్ సెహ్రావతే కారణం. అమన్‌కు చిన్నతనం నుంచే రెజ్లింగ్‌పట్ల ఎంతో అనురక్తి. ఊరిలో జరిగే బురద కుస్తీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనేవాడు. 2012 ఒలింపిక్స్‌లో సుశీల్ కుమార్ రజత పతకం గెలవడం అమన్‌లో రెజ్లింగ్‌పట్ల మరింత స్ఫూర్తి రగిల్చింది. అది గమనించిన అతడి తాతయ్య ఢిల్లీలోని ప్రఖ్యాత ఛత్రశాల్ స్టేడియంలో చేర్పించాడు. కోచ్ లలిత్ కుమార్ ఆధ్వర్యంలో కొద్ది సమయంలోనే రాటుదేలిన సెహ్రావత్ 2021లోనే తొలి జాతీయ టైటిల్ తన ఖాతాలో వేసుకున్నాడు. పట్టుదల, అంకితభావం, అద్భుత నైపుణ్యాల ఆలంబనగా రెజ్లింగ్‌లో తన కెరీర్‌కు బాటలు వేసుకొన్న అమన్ 2022లో అండర్-23 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. తద్వారా ఈ టోర్నమెంట్‌లో పసిడి పతకం చేజిక్కించుకున్న తొలి భారత రెజ్లర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఆపై 2022 ఆసియా క్రీడల్లో పురుషుల 57 కిలోల విభాగంలో కాంస్య పతకం చేజిక్కించుకొని సత్తా చాటాడు. తదుపరి ఏడాది ఆస్తానా వేదికగా జరిగిన ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకంతో అబ్బురపరిచాడు. ఇదే ఊపులో జాగ్రెబ్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. ఆ టోర్నీలో చైనాకు చెందిన ఝౌ వాన్‌హావోను 10-0తో చిత్తు చేసి విజేతగా నిలవడం 21 ఏళ్ల అమన్ అద్భుత నైపుణ్యాలకు తార్కాణం. ఇక.. తాను ఆరాధ్య రెజ్లర్ రవి దహియాకు షాకిచ్చిన అమన్ ఒలింపిక్ బెర్త్ పట్టేయడం విశేషం.

1 అతి పిన్న వయసులో ఒలింపిక్ పతకం సాధించిన భారత ప్లేయర్‌గా అమన్ (21 ఏళ్లు)

8 రెజ్లింగ్‌లో భారత్‌కు ఇది ఎనిమిదో ఒలింపిక్ పతకం



ప్రభావం చూపని గోల్ఫర్లు

మహిళల గోల్ఫ్ వ్యక్తిగత విభాగం మూడో రౌండ్‌లోనూ భారత్‌కు చెందిన అదితి అశోక్, దీక్షాడాగర్ ప్రభావం చూపలేదు. 14వ స్థానంతో శుక్రవారం ఆట కొనసాగించిన అదితి రౌండ్ ముగిసేసరికి 40వ స్థానంలో నిలిచింది. అలాగే దీక్ష 14వ స్థానంతో ఆరంభించి 42వ స్థానంలో నిలిచింది. శనివారం ఆఖరి, నాలుగో రౌండ్ జరుగుతుంది.

అథ్లెటిక్స్‌లో పోరాటం ముగిసె..



ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో భారత అథ్లెట్ల పోరాటం ముగిసింది. శుక్రవారం పురుషుల 4X400మీ. రిలే టీమ్ కొద్దిలో ఫైనల్ అవకాశాన్ని కోల్పోయింది. ఆసియా గేమ్స్‌లో స్వర్ణం సాధించిన వీరిపై ఒలింపిక్స్‌లోనూ అంచనాలు నెలకొన్నాయి. అయితే ముహమ్మద్ అనాస్, ముహమ్మద్ అజ్మల్, అమోజ్ జాకబ్, రాజేశ్ రమేశ్‌లతో కూడిన ఈ బృందం శుక్రవారం జరిగిన హీట్స్ 2 క్వాలిఫికేషన్‌లో 3:00.58 సెకన్ల టైమింగ్‌తో సీజన్ బెస్ట్ సాధించింది. అయితే రెండో స్థానంలో నిలిచిన నైజీరియా నిబంధనల ఉల్లంఘనతో డిస్‌క్వాలిఫై కావడంతో భారత్ ఐదు నుంచి నాలుగో స్థానానికి చేరింది. అలాగే భారత్‌కన్నా కేవలం 0.32 సెకన్ల వేగంతో రేసును ముగించి మూడో స్థానంలో నిలిచిన ఇటలీ ఫైనల్‌కు వెళ్లింది. రెండు హీట్స్‌ల నుంచి టాప్-3 టీమ్స్‌తో పాటు ఓవరాల్‌గా వారి తర్వాత అత్యంత వేగంగా పరిగెత్తిన రెండు టీమ్స్ ఫైనల్స్‌కు వెళతాయి. ఆ క్రమంలో భారత జట్టు మొత్తం 16 జట్లలో పదో స్థానంలో నిలిచింది. ఇక మహిళల 4X400మీ. రిలే క్వాలిఫికేషన్ హీట్2లో పోటీపడిన విద్యా రామ్‌రాజ్, జ్యోతిక శ్రీ దండి, పూవమ్మ రాజు, శుభా వెంకటేషన్ 3:32.51 సెకన్ల టైమింగ్‌తో చివరిదైన 8వ స్థానంలో నిలిచారు.

రజతమైనా అద్భుతమే..

భారత స్టార్‌తో మోదీ ఫోన్ సంభాషణ



న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాను ప్రధాని మోదీ ప్రశంసించారు. గురువారం రాత్రి జరిగిన పారిస్ ఒలింపిక్స్ పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ రజత పతకం అందుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు నీరజ్‌కు శుక్రవారంనాడు ప్రధాని ఫోన్ చేసి నాలుగు నిమిషాలపాటు సుదీర్ఘంగా మాట్లాడారు. గాయం కారణంగా తాను పసిడి పతకాన్ని నిలబెట్టుకోలేకపోయానని ప్రధానికి ఈ సందర్భంగా చోప్రా తెలిపాడు. దాంతో.. స్వర్ణ పతకం సాధించలేదని బాధపడొద్దని అతడికి సూచించారు. 'గాయం ఉన్నా రజత పతకం కైవసం చేసుకోవడం అద్భుతం. నీ ఫీట్ యువతరాన్ని అబ్బురపరుస్తుంది. దేశం కోసం ఏదైనా చేయాలనే స్ఫూర్తిని వారిలో రగులుస్తుంది' అని నీరజ్‌తో మోదీ అన్నారు. గాయాన్ని అధిగమించి ముందుకు ఎలా సాగాలో తర్వాత వివరంగా చర్చిద్దామని చోప్రాతో మోదీ అన్నారు.

గాయంతోనే బరిలో దిగా

అందుకే వేగం తగ్గింది.. త్వరలో శస్త్రచికిత్స

నీరజ్ వెల్లడి

న్యూఢిల్లీ: గాయం తనను బాధిస్తోందని, త్వరలో దానికి శస్త్రచికిత్స చేయించుకోనున్నట్టు స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వెల్లడించాడు. గాయంతోనే తాను పారిస్‌లో అతి కష్టంగా బరిలోకి దిగానని, అది ఎప్పుడు తీవ్రం అవుతుందోనన్న ఆందోళన కూడా వెంటాడిందని తెలిపాడు. ఒలింపిక్స్ డిఫెండింగ్ చాంపియన్ నీరజ్..పారిస్ క్రీడలకంటే ముందే తొడ కండరాల నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. అయినా సీజన్‌లో తన అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చోప్రా, 89.45 మీ. దూరం జావెలిన్ విసిరి రజతం దక్కించుకున్నాడు. 'గాయం గురించి ఆలోచిస్తూనే ఫైనల్లో ఈటెను విసిరా. ఎందుకంటే ఆ సమయంలో గాయపడకూడదు కదా. అందుకే ఫైనల్లో నాలో వేగం తగ్గింది. ఈ విషయాన్ని అంతా గమనించి ఉంటారు' అని చోప్రా తెలిపాడు. 'శస్త్ర చికిత్స చేయించుకోవాలని డాక్టర్ ఎప్పుడో సూచించాడు. కానీ వరల్డ్ చాంపియన్‌షిప్ ముందు, తర్వాత..ఆ విషయమై నిర్ణయం తీసుకోవడానికి నాకు సమయం లేదు. ఎందుకంటే..ఆపరేషన్ చేయించుకొన్న అనంతరం ఒలింపిక్స్‌కు సిద్ధం కావాలంటే చాలా సమయం పడుతుంది' అని వివరించాడు.

పస్తులుండి.. చందాలు పోగేసి..

పాక్ ఒలింపిక్ వీరుడి స్ఫూర్తిదాయక ప్రస్థానం

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అర్షద్ నదీమ్.. క్రీడా ప్రపంచంలో ఇప్పుడీ పేరు మారుమోగుతోంది. పారిస్ క్రీడల జావెలిన్ త్రో ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, భారత హీరో నీరజ్ చోప్రాను వెనక్కినెట్టి ఒలింపిక్ చాంపియన్‌గా అవతరించాడు. ఎవరూ ఊహించని విధంగా 92.97 మీటర్ల దూరంలో ఈటెను విసిరి ఒలింపిక్ రికార్డుతో పాటు స్వర్ణం సాధించాడు. తన దేశం పాకిస్థాన్‌కు విశ్వక్రీడల్లో తొలిసారి పసిడికాంతులు వెదజల్లి ఒక్కసారిగా స్టార్‌గా మారిపోయాడు. ఇప్పుడతనికి విశ్వవ్యాప్తంగా ప్రశంసలతో పాటు అతని దేశంలో అనేకమంది పోటీలుపడుతూ రివార్డులు ప్రకటిస్తున్నారు. కానీ, ఈస్థాయికి వచ్చేందుకు నదీమ్ పడిన కష్టం అంతాఇంతా కాదు. ఒకప్పుడు తినడానికి తిండిలేక పస్తులుండి.. తన గ్రామస్థులు చందాలు వసూలు చేసి ఇచ్చిన డబ్బుతో శిక్షణకెళ్లి.. ఇలా ఎన్నో అటుపోట్లు, సవాళ్లు ఎదుర్కొంటూ ఒలింపిక్ హీరోగా మారిన 27 ఏళ్ల నదీమ్ జీవితం స్ఫూర్తిదాయకం.



నదీమ్ పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని ఖనేవాల్ అనే గ్రామంలో జన్మించాడు. ఏడుగురు సంతానంలో మూడోవాడు. తండ్రి భవన నిర్మాణ కార్మికుడు. ఆ నిరుపేద కుటుంబానికి తండ్రి సంపాదనే ఆధారం. దీంతో పూట గడవక నదీమ్ కుటుంబ సభ్యులతో కలిసి తిండికి పస్తులుండిన సందర్భాలు అనేకం. ఏడాదిలో ఒక్క పండుగరోజు మాత్రమే మాంసం వండుకొని తినేవాళ్లు. ఇలా ఎన్నో కష్టాలు పడుతూనే తన లక్ష్యం ఆటల్లో రాణించడంపై నదీమ్ దృష్టి పెట్టేవాడు. పాఠశాల స్థాయిలో క్రికెట్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ లాంటి క్రీడల్లో సత్తా చాటాడు. జిల్లాస్థాయిలో క్రికెట్ కూడా ఆడాడు. ఒకరోజు అథ్లెటిక్స్‌లో జావెలిన్‌ను అద్భుతంగా త్రో చేయడం గమనించిన కోచ్ రషీద్ అహ్మద్ అతడిని ఆ క్రీడ వైపు ప్రోత్సహించాడు. కానీ సరైన జావెలిన్ కొనేందుకు, నాణ్యమైన డైట్ తీసుకునేందుకు డబ్బులు లేకున్నా రషీద్ మాత్రం ప్రాక్టీస్ ఆపలేదు. ఈ క్రమంలో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, ఇంటర్‌బోర్డు మీట్, జాతీయస్థాయిలో అనేక పతకాలు సాధించాడు. ఈ సమయంలో ఇతర ప్రాంతాల్లో టోర్నీలకు వెళ్లేందుకు డబ్బులు లేకపోతే.. తమ గ్రామవాసులు, బంధువులు చందాలు పోగు చేసి సహాయం చేసే వారని నదీమ్ తండ్రి అష్రాఫ్ వెల్లడించాడు. ఎన్నో సందర్భాల్లో తమ ఊరివాళ్లు అండగా నిలిచారని, వాళ్ల మేలును ఎప్పటికీ మరిచిపోలేమని అతను చెప్పుకొచ్చాడు. ఆర్థిక పరిస్థితి కారణంగా పంజాబ్ యూనివర్సిటీలోని ఓ పురాతన జిమ్‌లో నదీమ్ ప్రాక్టీస్ చేసేవాడు. ఆ జిమ్‌లో ఏసీ ఉండేది కాదు, ఉక్కపోతను భరిస్తూనే అక్కడ తుప్పుపట్టిపోయిన ఎన్నోఏళ్ల నాటి పరికరాలతోనే శిక్షణ కొనసాగించేవాడని నదీమ్ కోచ్ తెలిపాడు.

దోస్తానా..



పారిస్‌లో నీరజ్ చోప్రాను అధిగమించి నదీమ్ విజేతగా నిలిచి ఉండొచ్చు. కానీ, వీళ్లిద్దరు అసలు ప్రత్యర్థులే కాదు. ఎందుకంటే, ఇద్దరికీ మంచి దోస్తానా ఉంది. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచినప్పుడు నీరజ్‌ను నదీమ్ మనస్ఫూర్తిగా అభినందించి వినమ్రతను చాటుకున్నాడు. టోక్యోలో ఐదోస్థానంలో నిలిచిన నదీమ్..నీరజ్ స్ఫూర్తితోనే తాను వచ్చే క్రీడల్లో సత్తాచాటుతానని చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌కు సన్నద్ధమయ్యే క్రమంలో ఎప్పుడో 2015 నుంచి వాడుతున్న తన బల్లెం (ఈటె) దెబ్బతినడంతో కొత్తది ఇవ్వాలంటూ పాక్ క్రీడాధికారులను కోరాడు. అప్పుడు నీరజ్ కూడా నదీమ్‌కు అండగా నిలవాలంటూ పాక్ ప్రభుత్వానికి సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశాడు. ఆ తర్వాత వెంటనే అక్కడి ప్రభుత్వం కూడా నదీమ్‌కు కొత్త జావెలిన్‌ను సమకూర్చింది. నదీమ్ సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురైనప్పుడు అతనికి నీరజ్ మద్దతుగా నిలిచాడు.

టర్నింగ్ పాయింట్ ఇలా...

2015లో పూర్తిస్థాయిలో జావెలిన్ త్రోయర్‌గా మారిన నదీమ్ అంతర్జాతీయస్థాయిలో జావెలిన్ త్రోలో రాణించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. 2016లో ప్రపంచ అథ్లెటిక్స్ నుంచి స్కాలర్‌షిప్ దక్కించుకున్నాడు. తద్వారా మారిషస్‌లో శిక్షణకు వెళ్లాడు. ఇదే అతనికి టర్నింగ్ పాయింట్. అక్కడ శిక్షణలో రాటుదేలిన నదీమ్ 2018 ఆసియా క్రీడల్లో కాంస్యం గెలిచి తన ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేశాడు. ఆ తర్వాత పలుమార్లు గాయాలు వేధించినా వాటిని అధిగమిస్తూ ముందుకుసాగాడు. 2022లో తొలిసారి 90 మీటర్ల దూరంలో ఈటెను విసిరి కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం గెలిచాడు. నిరుడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించాడు. ఇప్పుడిక ప్రతి క్రీడాకారుని స్వప్నమైన ఒలింపిక్స్‌లో బంగారు పతకాన్ని గెలిచి తన దేశానికే గర్వకారణమయ్యాడు.

ఇద్దరూ మాకు బిడ్డలే





నీరజ్, నదీమ్ తల్లిదండ్రుల ఆనందం

ఇరుదేశాల సరిహద్దుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఉండొచ్చు కానీ, ఆ మాతృమూర్తుల మనసుల్లో మాత్రం ఎలాంటి కల్మషం లేదు. ఆటగాళ్ల పోటీని దేశాల మధ్య పోరుగా చూడొద్దనీ.. ఇద్దరినీ తమ బిడ్డల్లాగే భావిస్తామంటూ తమ సహృదయతను చాటుకున్నారు. నీరజ్-నదీమ్ పోరును భారత్-పాక్ పోరుతో పోల్చడం సరికాదని నీరజ్ అమ్మానాన్న, నదీమ్ తల్లిదండ్రులు కోరుతున్నారు. 'ఇక్కడ శత్రుదేశాల మధ్య పోరుగా చూడొద్దు. నీరజ్ ఎలాగో అర్షద్‌ను కూడా మా బిడ్డలాగే అనుకుంటాం. ఫైనల్లో మా పిల్లలే పోటీపడుతున్నట్టుగా అనిపించింది. ఇద్దరూ అత్యుత్తమ ప్రతిభ కల ఆటగాళ్లు. ఒకరు స్వర్ణం, మరొకరు రజతం గెలవడం మాకు సంతోషంగా ఉంది' అని నీరజ్ అమ్మానాన్న సరోజ్ దేవి, సతీష్ కుమార్ పేర్కొన్నారు. 'వాళ్లిద్దరూ స్నేహితులే కాదు.. అన్నదమ్ములు. నీరజ్ మా బిడ్డతో సమానం. అతనికోసం మేం ప్రార్థిస్తాం. నీరజ్ మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నా' అని నదీమ్ తల్లి రజియా పర్వీన్ పాక్ మీడియాతో చెప్పారు.

సిరాజ్‌కు ఇంటిస్థలం కేటాయింపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): టీమిండియా పేసర్ మహ్మద్ సిరాజ్‌కు తెలంగాణ ప్రభుత్వం ఇంటిస్థలాన్ని కేటాయించింది. కొద్దిరోజుల కిందట సిరాజ్‌కు ఇంటిస్థలం ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం తెలిసిందే. రేవంత్ ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెంబర్ 78లో 600 గజాల స్థలాన్ని సిరాజ్‌కు కేటాయిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
చైనా	32	25	21	78
అమెరికా	31	39	38	108
ఆస్ట్రేలియా	18	16	14	48
బ్రిటన్	14	20	23	57
ఫ్రాన్స్	14	20	22	56
భారత్	0	1	5	6

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

వినేశ్ కేసుపై విచారణ పూర్తి

తీర్పుపై ఐఓఏ ఆశాభావం

పారిస్: అనర్హతను సవాలు చేస్తూ భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ వేసిన కేసుపై ఇక్కడి క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానం (సీఏఎస్)లో శుక్రవారం విచారణ జరిగింది. పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల ఫైనల్లో గత బుధవారం అమెరికా రెజ్లర్ సారా హిల్డ్‌బ్రాంట్‌తో వినేశ్ తలపడాల్సి ఉంది. అయితే నిర్దేశిత బరువుకంటే 100 గ్రాములు అదనంగా ఉండడంతో ఫైనల్ ఆడకుండా వినేశ్‌పై వేటు వేసిన విషయం తెలిసిందే. దీనిని సీఏఎస్‌లో ఫొగాట్ సవాలు చేసింది. సీఏఎస్ అడ్‌హాక్ డివిజన్ ఎదుట జరిగిన శుక్రవారంనాటి విచారణకు వినేశ్ వర్చువల్‌గా హాజరైంది. ఆమె తరపున ఫ్రాన్స్ న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఆపై యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) లాయర్లు వాదనలు వినిపించారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తరపున హాజరైన హరీశ్ సాల్వే, విదుష్పత్ సింఘానియా గంటపాటు తమ వాదనలు వినిపించారు. కాగా..తీర్పు వినేశ్‌కు అనుకూలంగా వస్తుందన్న ఆశాభావాన్ని భారత ఒలింపిక్ సంఘం వ్యక్తంజేసింది.

భారత పతాకధారులుగా శ్రీజేష్, మను



న్యూఢిల్లీ: ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు దేశ పతాకధారులుగా టీమిండియా హాకీ వెటరన్ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్, స్టార్ షూటర్ మనుభాకర్‌లను ఎంపిక చేసినట్టు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ప్రకటించింది. ఆదివారం జరగనున్న ఈ ముగింపు ఉత్సవంలో శ్రీజేష్, మను జాతీయ జెండాను చేతబూని, భారత బృందాన్ని ముందుండి నడిపించనున్నారు. వాస్తవానికి శ్రీజేష్‌తో పాటు నీరజ్ చోప్రా పేరును కూడా ఐఓఏ పరిశీలించింది. ఈ విషయమై నీరజ్‌తో ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష చర్చించగా, శ్రీజేష్ తనకంటే యోగ్యుడని.. పైగా అతడికి ఇవే చివరి ఒలింపిక్స్ కాబట్టి ఆ గౌరవం ఆయనకే ఇవ్వాల్సిందిగా సూచించాడు. ఆరంభ వేడుకలకు ప్యాడ్లర్ శరత్ కమల్, షట్లర్ పీవీ సింధు పతాకధారులుగా వ్యవహరించడం తెలిసిందే.

జూనియర్ హాకీ టీమ్ కోచ్‌గా శ్రీజేష్

న్యూఢిల్లీ: భారత హాకీ జట్టుకు ఒలింపిక్ కాంస్యం దక్కడంలో కీలక పాత్ర పోషించిన కీపర్ పీఆర్ శ్రీజేష్ కొత్త బాధ్యతలు తీసుకోబోతున్నాడు. ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించిన అతడు ఇక జూనియర్ పురుషుల హాకీ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. 'ఆటగాడి నుంచి కోచ్‌గా మారబోతున్న శ్రీజేష్ యువకులకు ఆదర్శంగా నిలుస్తాడని భావిస్తున్నాం. అలాగే అతని కోచింగ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం' అని హాకీ ఇండియా వెల్లడించింది. మరోవైపు ఈ సరికొత్త పాత్ర నిర్వహించేందుకు ఆత్రుతగా ఉందని శ్రీజేష్ తెలిపాడు. కనీసం 15 మంది కోచ్‌లతో పనిచేసిన అనుభవం ఉందని, దాన్ని వృధా చేయకుండా బాధ్యతలను నిర్వర్తిస్తానని అన్నాడు.

పారిస్‌లో నేటి భారతం

గోల్ఫ్: మహిళల వ్యక్తిగత ఫైనల్: అదితి అశోక్, దీక్షా డాగర్ (మ. 12.30)

రెజ్లింగ్: మహిళల 76 కిలోల ప్రీక్వార్టర్‌ఫైనల్ : రీతికా హుడా X బెర్నాడెట్ (హంగేరి) (మ. 2.51)

కాలం చెల్లిన సెలైన్‌తో రోగికి చికిత్స

» నిర్మల్ జిల్లా ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన

» ఐదు నెలల క్రితమే గడువు ముగిసిన సెలైన్‌ను జ్వరం వచ్చిన యువకుడికి ఎక్కించిన సిబ్బంది

ఖానాపూర్, ఆగస్టు 9: ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది నిర్వాకం.. రోగుల పాలిట శాపంగా మారుతోంది. కాలం చెల్లిన మందులు, ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్లను ఇష్టానుసారం వినియోగిస్తుండడం.. రోగుల ప్రాణం మీదకు వస్తోంది. తాజాగా నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఇలాంటి ఉదంతమే చోటు చేసుకుంది. కడెం మండలం లింగాపూర్‌కు చెందిన అజారుద్దీన్ జ్వరంతో బాధపడుతూ ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా.. పరీక్షించిన వైద్యులు అతడికి సెలైన్ బాటిల్‌ను ఎక్కించాలని సిబ్బందికి సూచించారు. దీంతో ఆస్పత్రిలో ఉన్న ఓ బాటిల్‌ను తీసుకొచ్చిన సిబ్బంది.. అతడికి ఎక్కించడం ప్రారంభించారు. కానీ, కాసేపటికే అజారుద్దీన్ మరింత అస్వస్థతకు గురయ్యాడు. ఇది గమనించిన అతడి సోదరుడు ఆ బాటిల్‌ను పరిశీలించగా.. 2024 మార్చి నెల వరకే దాని కాలపరిమితి ఉన్నట్లు కనిపించింది. ఈ విషయాన్ని వెంటనే ఆస్పత్రి సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా.. దాన్ని తొలగించి మరొకటి పెట్టారు. ఈ ఘటనలో బాధిత యువకుడికి ఎటువంటి అపాయం కలగకపోయినా.. కొంత మేర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో సిబ్బందిపై రోగి బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం బయటకు పొక్కడంతో పలువురు విలేకరులు ఆస్పత్రికి వెళ్లారు. ఈ క్రమంలో అక్కడి టేబుల్‌ను పరిశీలించగా... కాలం చెల్లిన మరిన్ని ఇంజక్షన్లు దర్శనమిచ్చాయి. వాస్తవానికి నిర్ణీత గడువుకు మూడు నెలల ముందే ఆయా మందులను ప్రత్యేకంగా ఒక బాక్స్‌లో వేసి, నెల రోజుల ముందు వరకు మాత్రమే ఉపయోగిస్తారు. కానీ, ఖానాపూర్ ఆస్పత్రిలో అలాంటి నిబంధనలేమీ పాటిస్తున్న దాఖలాలు కనిపించలేదు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా కాలం చెల్లిన మందులను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచిస్తామని చెప్పారు. పని భారం వల్ల మందులను తొలగించడంలో జాప్యం జరిగిందని తెలిపారు. ఈ నిర్లక్ష్యానికి కారణమైన వారిని గుర్తించి ఉన్నతాధికారులకు వివరాలు అందజేస్తామన్నారు. గడువు ముగిసిన సెలైన్ బాటిల్ ఎక్కించిన అజారుద్దీన్‌కు ఎటువంటి ఇబ్బందీ లేదని, అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.



అస్వస్థతకు గురైన అజారుద్దీన్



గత నెలలో కాలపరిమితి ముగిసిన అమికాసిన్ ఇంజక్షన్



కేటీఆర్‌ను కలిసిన కొడంగల్ నియోజకవర్గ రైతులు

ఫార్మా కంపెనీల కోసం భూములివ్వాలని బెదిరిస్తున్నారు

» కేటీఆర్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేసిన రైతులు

హైదరాబాద్, వికారాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మా కంపెనీల కోసం భూములు ఇవ్వాలంటూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని దౌల్తాబాద్ మండల రైతులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. శుక్రవారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి వచ్చిన రైతులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి.. తమకు అండగా నిలవాలని కోరారు. దుద్యాల్ మండలంలోని హకీంపేట్, పోలెపల్లి, లకచర్ల గ్రామాల్లో దాదాపు మూడు వేల ఎకరాల భూమిని రైతుల నుంచి బలవంతంగా తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వారు కేటీఆర్‌కు వివరించారు. ఫార్మా కంపెనీలు వస్తే కాలుష్యం పెరుగుతుందని తమకు ఈ ఫ్యాక్టరీలు వద్దని రైతులు చెబుతున్నప్పటికీ సీఎం అన్న తిరుపతిరెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటామని కేటీఆర్ వారికి భరోసా ఇచ్చారు.

జేపీసీలో నలుగురు తెలుగు ఎంపీలు

» తెలంగాణ నుంచి డీకే అరుణ, అసదుద్దీన్ ఒవైసీ

» ఏపీ నుంచి లావు శ్రీకృష్ణదేవరాయలు, విజయసాయిరెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టం సవరణ బిల్లు పరిశీలనకు కేంద్రం ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లో తెలుగు రాష్ట్రాలకు చెందిన నలుగురు ఎంపీలు ఉన్నారు. 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో జేపీసీని ఏర్పాటు చేశారు. ఇందులో తెలంగాణ నుంచి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ(బీజేపీ), హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ(ఎంఐఎం), ఏపీ నుంచి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు(టీడీపీ), రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి(వైసీపీ) సభ్యులుగా ఉన్నారు.

కోర్సులకు అనుమతిపై ప్రభుత్వానిదే నిర్ణయం

» హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొత్త కోర్సుల ప్రారంభం, డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లు పెంచుకోవడం, లేదంటే తగ్గించడం, కోర్సుల విలీనం వంటి అంశాల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వానిదే తుది నిర్ణయమని హైకోర్టు స్పష్టం చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి కొత్త కోర్సులు, సీట్ల పెంపు, తగ్గింపు వంటి అంశాలపై తమ దరఖాస్తులను ఉన్నత విద్యాశాఖ తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ అరోరాస్ టెక్నలాజికల్ అకాడమీ సహా పలు ఇంజినీరింగ్ కాలేజీలు దాదాపు 27 పిటిషన్‌లు దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ కాలేజీల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. తమకు జేఎన్‌టీయూ, జాతీయ టెక్నికల్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ అనుమతులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం మాత్రం తమ విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. జేఎన్‌టీయూ ఇచ్చినది షరతులతో కూడిన అనుమతి అని, అది కేవలం ప్రభుత్వానికి, టెక్నికల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్‌కు దరఖాస్తు చేసుకోవడానికి మాత్రమే పనికివస్తుందని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. స్థానికంగా ఉన్న విద్యా అవసరాలు, విద్యా సంస్థల మధ్య అనారోగ్యకరమైన పోటీని నివారించడం, సమానత్వం పాటించడానికి తగిన నిర్ణయాలు తీసుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి విద్యా చట్టం సెక్షన్ 20 ప్రకారం నిర్ణయాధికారం ఉందని తెలిపింది. ప్రభుత్వ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టంచేస్తూ పిటిషన్‌లను కొట్టేసింది.

పెట్టుబడులపై మీవే బోగస్ ఎంవోయూలు

» పదేళ్లలో చేసుకున్న ఒప్పందాలపై చర్చకు సిద్ధమా?

» కేటీఆర్‌కు టీపీసీసీ సవాల్

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి బీఆర్ఎస్ హయాంలో బోగస్ కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్నారని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. భువి బయో కెమికల్స్ అనే కంపెనీ రూ.1040 కోట్లు, ధాత్రీ బయో సిలికేట్ అనే కంపెనీ రూ.160 కోట్ల మేరకు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టనున్నాయని, రెండు కంపెనీలు కలిసి 2,250 మందికి ఉపాధి కల్పించనున్నాయని జూన్ 10, 2022లో అప్పటి మంత్రి కేటీఆర్ ప్రకటించారన్నారు. ఆ రెండు కంపెనీలతో ఎంవోయూలూ కుదుర్చుకున్నట్లు వారి అధికార పత్రికలో ప్రముఖంగా వేశారని వెల్లడించారు. కానీ అప్పటికి ఆ రెండు కంపెనీలే లేవని పేర్కొన్నారు. భువి బయో కెమికల్స్ కంపెనీ జూలై 14, 2022న, ధాత్రి బయో సిలికేట్ జూలై 19న రిజిస్టర్ అయ్యాయని తెలిపారు. అసలు పుట్టకముందే సదరు కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. వాటికి మెట్‌పల్లిలో 95 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. ఆ భూమిని రైతుల దగ్గరి నుంచి బలవంతంగా తీసుకోగా.. రైతులు కోర్టుకు వెళ్లారని, ఆ ప్రక్రియ నిలిచిపోయిందని వెల్లడించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టుబడులపైన చేసుకున్న ఎంవోయూలపై చర్చకు సిద్ధమా అంటూ కేటీఆర్‌కు ఆయన సవాల్ విసిరారు.

గురుకుల భవనం పై నుంచి దూకిన విద్యార్థిని

» కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు... ములుగులో ఘటన

ములుగు, ఆగస్టు 9: ములుగు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ఓ విద్యార్థిని శుక్రవారం పాఠశాల భవనం మూడో అంతస్థు నుంచి కిందకు దూకింది. ఈ ఘటనలో బాలిక తీవ్రంగా గాయపడింది. ములుగు మండలం జంగాలపల్లికి చెందిన కొయ్యడ సుమలత-రాజు దంపతుల కుమార్తె కార్తీకశ్రీ గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కొన్నేళ్ల క్రితం తండ్రి మరణించడంతో తల్లి సంరక్షణలో ఉంది. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భవనం మూడో అంతస్థులో ఉన్న మూత్రశాలల వైపు వెళ్లిన కార్తీకశ్రీ అక్కడి నుంచి కిందకు దూకింది. దీంతో గాయపడ్డ బాలికను ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. బాలిక పక్కటెముకలు, కాళ్ల, చేతులకు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వ్యక్తి మోదీ

» ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ

» ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాతో భేటీ



న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏకైక వ్యక్తి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాత్రమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంద కృష్ణ మాదిగ శుక్రవారం రాత్రి న్యూఢిల్లీలో కలిశారు. దాదాపు 30 నిమిషాలు ప్రధానితో భేటీ అయిన మందకృష్ణ ఎస్సీ వర్గీకరణకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మంద కృష్ణను ఆప్యాయంగా పలకరించి హత్తుకున్న ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని కోరారు. వర్గీకరణ అంశంపై కొందరు సుప్రీం కోర్టు వెళ్లే ఆలోచనలో ఉన్న నేపథ్యంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని అన్నారు.

త్వరలో సాంస్కృతిక పాలసీ!

అంతరించిపోతున్న కళారూపాలకు మళ్లీ జీవం.. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి పూర్వవైభవం

» సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ కోసం రూపకల్పన

» వచ్చే నెల 9న ముఖ్యమంత్రి ప్రకటించే అవకాశం

» ఆరోజు హనుమకొండలో కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం

» పాలసీతో పద్మ అవార్డీలకు పక్కాగా ఆర్థిక సాయం

» కళాకారులకు ప్రోత్సాహకాలు.. పెన్షన్ల అందజేత

» కళా ప్రదర్శనలకు జిల్లాల్లో మినీ రవీంద్రభారతి



హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అంతరించిపోతున్న కళారూపాలు మళ్లీ పునరుజ్జీవం పొందనున్నాయి. రాష్ట్రంలో పలు రకాల పాలసీలకు రూపకల్పన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. త్వరలో 'సాంస్కృతిక పాలసీ'ని కూడా తీసుకురాబోతోంది. ఒకప్పుడు వీధి నాటకాలు, పేరిణి నృత్యాలు, ఒగ్గు కథలు, కోలాటాలతో కళల కాణాచిగా పరిఢవిల్లిన తెలంగాణకు మళ్లీ సాంస్కృతిక పూర్వ వైభవాన్ని తేవడమే లక్ష్యంగా ఈ విధానాన్ని రూపొందిస్తోంది. ఇందులో చాలా అంశాలను పొందుపరుస్తోంది. కళలను మళ్లీ ప్రదర్శనకు పెట్టడమే కాకుండా.. కళాకారులను ఆదరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. సెప్టెంబరు 9న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ 'కల్చరల్ పాలసీ'ని హనుమకొండ వేదికగా ప్రకటిస్తారని తెలుస్తోంది. నిజానికి తెలంగాణలో ఒకప్పుడు 160కి పైగా జానపద, కళారూపాలు ఉండేవి. కాకతీయుల కాలంనాటి కళలు ప్రజలను ఆకట్టుకున్నాయి. వివిధ రకాల సామాజిక వర్గాలవారు వీటిని ప్రదర్శించేవారు. ప్రధానంగా పేరిణి శివతాండవం, యక్షగానం, చిందు భాగవతం వంటి వాటిని ప్రదర్శించేవారు. వీధి నాటకాలు, కోలాటాలు, చెక్క బొమ్మలాట, గొల్ల సుద్దులు, ఒగ్గు కథలు, బుడగ జంగాలవారి బుర్రకథలు ప్రజలకు సేద తీర్చేవి. అయితే ప్రజలు సినిమాల మోజులో పడటంతో ఇలాంటి కళా ప్రదర్శనలు కనుమరుగవుతున్నాయి. టీవీలు, స్మార్ట్ టీవీలు వచ్చిన తర్వాత మరింత అంతరించిపోయే దశకు చేరుకున్నాయి. ఇవే కాదు.. చేర్యాల పెయింటింగ్స్, దర్శనం మొగిలయ్య వాయించే 12 మెట్ల కిన్నెర వంటి వాయిద్యాలు కూడా కనుమరుగవుతున్నాయి. ఇలాంటి కళారూపాలు, వాయిద్యాలు, ప్రదర్శనలకు మళ్లీ జీవం పోయడమే లక్ష్యంగా ప్రభుత్వం సాంస్కృతిక విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. భావి తరాలకు ఈ సాంస్కృతిక వారసత్వాన్ని అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఈ మేరకు దీనిపై రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకుల కార్యాలయం కసరత్తు చేస్తోంది. సెప్టెంబరు 9న సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండలో 'కాళోజీ కళాక్షేత్రాన్ని' ప్రారంభించనున్న సందర్భంలోనే ఈ సాంస్కృతిక పాలసీని కూడా ప్రకటిస్తారని తెలిసింది.

పాలసీలోని ప్రధానాంశాలు..

సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాలన్న ఉద్దేశంతో ప్రకటించబోతున్న కల్చరల్ పాలసీలో పలు అంశాలను పొందుపర్చనున్నారు. ముఖ్యంగా కళాకారులకు ప్రోత్సాహకాలు, పెన్షన్లు ఇవ్వడం ద్వారా కళలను పరిరక్షించవచ్చన్నది ప్రభుత్వ యోచన. ఈసారి రాష్ట్రం నుంచి ఐదుగురు పద్మ అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించింది. నెలకు రూ.25 వేల చొప్పున పెన్షన్ కూడా ప్రకటించింది. ఎలాంటి విధానం లేకుండా ప్రభుత్వం అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయమిది. ఇకపై ఇలాంటి తాత్కాలిక నిర్ణయాలు కాకుండా.. కళాకారులకు శాశ్వతంగా ఆర్థిక సాయం అందించే విషయాన్ని, పెన్షన్లను సాంస్కృతిక పాలసీలో పొందుపరచనుంది. ఇవేకాకుండా.. కళా ప్రదర్శనలకు ప్రతి జిల్లాలో ఒక వేదికను ఏర్పాటు చేయాలని సర్కారు యోచిస్తోంది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి లాగే ప్రతి జిల్లాలో మినీ రవీంద్రభారతిలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. వీటితోపాటు కళాకారులకు ఇతర ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయాలను కూడా అంతరించి పోతున్న కళలు, వాయిద్యాలను పరిరక్షించే చర్యలను ప్రకటించే అవకాశాలున్నాయి.

సైబర్ నేరాల కట్టడికి ముందుకు రండి

» సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో కలిసి పనిచేయండి

» యువతకు డీజీపీ జితేందర్ పిలుపు

» బాధితుల్లో 70 శాతం మంది విద్యావంతులే..

» సైబర్ సెక్యూరిటీ బ్యూరో చీఫ్ శిఖాగోయల్

» దేశంలో ప్రతి నిమిషానికి 2 సైబర్ నేరాలు

» ఐటీ ఎలక్ట్రానిక్స్ విభాగం డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా

» హ్యాకథాన్ ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సాంకేతిక యుగంలో సైబర్ సెక్యూరిటీ అత్యంత కీలకంగా మారిందని డీజీపీ డా. జితేందర్ అన్నారు. సైబర్ నేరాల కట్టడిలో యువత ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ అంశాల్లో నైపుణ్యం ఉన్న యువకులు సమాజం, పౌరుల సైబర్ భద్రతకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో కలిసి పనిచేయాలని డీజీపీ ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో "ది గ్రేట్ యాప్‌సెక్ హ్యాకథాన్-2024"ను నిర్వహిస్తోంది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి డీజీపీ హాజరై ఈ హ్యాకథాన్‌ను ప్రారంభించారు. పోలీసులతోపాటు యువత సైబర్ నేరాల కట్టడిలో ముందుండాలని డీజీపీ సూచించారు. సైబర్ భద్రతలో భాగంగా టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో 'ది గ్రేట్ యాప్‌సెక్ హ్యాకథాన్-2024' నిర్వహిస్తోందన్నారు. భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా 20 దేశాల నుంచి పది వేల మంది ఈ హ్యాకథాన్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సైబర్ నేరాల బారిన పడుతున్నవారిలో 70 శాతం మంది చదువుకున్న వారే ఉన్నారని సైబర్ సెక్యూరిటీ బ్యూరో చీఫ్ శిఖాగోయల్ తెలిపారు. బాధితుల్లో 56 శాతం మంది ఐటీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నవారు ఉండడం విశేషమన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి రెండు సైబర్ నేరాలు నమోదు అవుతున్నాయని ఐటీ ఎలక్ట్రానిక్స్ విభాగం డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా తెలిపారు. చాలామంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదన్నారు. గత సంవత్సరం దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు రూ. 7500 కోట్లు కొల్లగొట్టారని ఆయన చెప్పారు. సైబర్ నేరగాళ్లు దోచిన సొమ్మును ఈ సందర్భంగా డీజీపీ చేతుల మీదుగా బాధితులకు రీ ఫండ్ ఆర్డర్లను అందజేశారు.

బంగ్లా దేశీయులపై నిఘా

బంగ్లాదేశ్‌లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రాజధానిలోని బంగ్లాదేశీయుల కదలికలపై నిఘా ఉంచామని డీజీపీ తెలిపారు. ఎవరైనా బంగ్లాదేశీయులు అక్రమంగా వస్తేచట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీగెట్‌లో 94 శాతం ఉత్తీర్ణత

» అత్యధికంగా మహిళలే..

» మొత్తం అర్హులు 61,246 మంది

» వారిలో 40,677 మంది మహిళలు

» 12 నుంచి పీజీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని యూనివర్సిటీలు, వాటి అనుబంధ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన కామన్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(సీపీగెట్)లో 94 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణతను సాధించారు. ఈ ఫలితాలను శుక్రవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి విడుదల చేశారు. పీజీ సీట్ల భర్తీలో భాగంగా ఈ నెల 12వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈమేరకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ ఏడాది మొత్తం 64,765 మంది సీపీగెట్ పరీక్షలకు హాజరుకాగా వారిలో 61,246(94.57 శాతం) క్వాలిఫై అయ్యారు. వీరిలో 40,677 మంది మహిళలు ఉన్నారు. పురుషులు 20,569 మంది క్వాలిఫై అయ్యారు. ఈ ఏడాది సీపీగెట్‌కు అత్యధికంగా మహిళలే దరఖాస్తు చేసుకోగా, క్వాలిఫై అయిన వారిలోను మహిళలే అధికంగా ఉన్నారు. రాష్ట్రంలోని 8 యూనివర్సిటీల్లోని 45 పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం జూలై 6 నుంచి 16 వరకు సీపీగెట్ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. సీపీగెట్ కోసం తెలంగాణకు చెందిన వారు 71 వేలమంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 63 వేలమంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 60 వేల మంది (94.59 శాతం) క్వాలిఫై అయ్యారు. స్థానికేతరులు 1,271 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 902 మంది పరీక్షకు హాజరైతే 832(92.24 శాతం) క్వాలిఫై అయ్యారు. నేషనల్ ఇంటిగ్రేషన్ కోటాలో ఇతర రాష్ట్రాలకు చెందిన 295 క్వాలిఫై అయ్యారు. ఈ ఫలితాల్లో ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎమ్మెస్సీ సెరికల్చర్ కోర్సుల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. కాగా, పీజీ సీట్ల భర్తీ కోసం ఈ నెల 12వ తేదీ నుంచి సీపీగెట్ కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఫలితాల విడుదల అనంతరం ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఇందులో భాగంగా అభ్యర్థులు 12 నుంచి 21వ తేదీల మధ్య ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత 27 నుంచి 30వ తేదీల మధ్య వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలి. 30న వెబ్ ఆప్షన్లలో ఎడిట్ చేసుకునే అవకాశం ఇస్తారు. సెప్టెంబరు 4న సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు సెప్టెంబరు 9వ తేదీలోపు ఆయా కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. సెప్టెంబరు 15 నుంచి రెండవ దశ కౌన్సెలింగ్‌ను చేపట్టనున్నారు.

సీపీగెట్ ఫలితాల వివరాలు...

అంశం	పురుషులు	మహిళలు	మొత్తం
రిజిస్ట్రేషన్ అయినవారు	24,935	48,407	73,342
పరీక్షరాసినవారు	21,757	43,008	64,765
అర్హత సాధించినవారు	20,569	40,677	61,246
ఉత్తీర్ణత శాతం	94.54	94.58	94.57

సుంకిశాల ప్రమాదం రేవంత్‌రెడ్డి అసమర్థత వల్లే!

ప్రభుత్వ తప్పు లేకపోతే వారం ఎందుకు దాచారు?.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిందలు వేయడం చిల్లర వ్యవహారం

» నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇప్పుడెందుకు రావడంలేదు?

» న్యాయవిచారణ జరిపించాలి: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థత, చేతగానితనం వల్లనే సుంకిశాల ప్రమాదం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పురపాలక శాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రే ఈసంఘటనకు బాధ్యత వహించాలన్నారు. ఇందులో ప్రభుత్వ తప్పిదం లేకపోతే వారం రోజులు ఎందుకు దాచిపెట్టారని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఈ నెల 2న ప్రమాదం జరిగితే.. సభలో ప్రకటన ఎందుకు చేయలేదని నిలదీశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగమాగం పనులు ప్రారంభించడం, గేట్లు అమర్చడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు చెబుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిందలు వేయడం చిల్లర వ్యవహారమని, బాధ్యతల నుంచి తప్పించుకోవడం కాంగ్రెస్ నేతలకు తగదని అన్నారు. ఎన్నికల్లో ప్రయోజనం కోసం కాళేశ్వరంపై ఆరోపణలు చేశారని, 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రాజెక్టు చెక్కు చెదరలేదని కేటీఆర్ గుర్తుచేశారు. నీళ్ల విషయంలో కేసీఆర్ విజయాలను అంగీకరించలేని కురచ మనస్తత్వంతో కాంగ్రెస్ వ్యవహరిస్తోందని విమర్శించారు. కాళేశ్వరంపై ఆగమేఘాల మీద నివేదిక ఇచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ.. సుంకిశాలకు ఎందుకు రావడంలేదని ప్రశ్నించారు. ఘటనపై డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తక్షణమే న్యాయవిచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

మేడిగడ్డ ఘటనను మేం బయటపెట్టాం..

తమ హయాంలో జరిగిన మేడిగడ్డ ఘటనను తాము దాచలేదని, ఎన్నికల కోడ్ ఉన్నా బయటపెట్టామని కేటీఆర్ తెలిపారు. ఘటన జరిగిన రెండు గంటల్లోనే సర్దుతామని ఎల్అండ్‌టీ చెప్పిందని గుర్తు చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కాంట్రాక్టు సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలని సవాల్ చేశారు. ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో తాగునీటి కొరత ఉన్నప్పటికీ.. హైదరాబాద్‌లో కొరత లేకపోవటానికి కేసీఆర్ ప్రభుత్వ ప్రణాళికలే కారణమని పేర్కొన్నారు. సుంకిశాలను 2024 వేసవి కాలానికి పూర్తిచేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టుపై డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క బిల్డప్ ఇచ్చారని, కానీ.. ఆ ప్రాజెక్టును చేపట్టింది, పూర్తిచేసింది కేసీఆరేనని స్పష్టం చేశారు. పేర్లు మార్చడమే మార్పు కాదని, భట్టి తన ఆలోచన విధానాన్ని మార్చుకోవాలని సూచించారు.

కవిత 11 కిలోల బరువు తగ్గింది!

బీపీ పెరగడంతో మాత్రలు వేసుకుంటోంది

త్వరలోనే బెయిలు వస్తుందని భావిస్తున్నాం

విలేకరులతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 11 కిలోల బరువు తగ్గిందని ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. బీపీ పెరగడంతో మాత్రలు వేసుకోవాల్సి వస్తోందన్నారు. తన సోదరి ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. జైలు శుభ్రంగా లేదని, కవిత చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 11 వేల మంది ఖైదీలు ఉండాల్సిన తిహాడ్ జైల్లో 30 వేల మంది ఉన్నారన్నారు. ఆప్ కీలక నేత మనీష్ సిసోడియాకు బెయిల్ వచ్చిందని, కవితకు కూడా వస్తుందనే ఆశావహ దృక్పథంతో ఉన్నామని కేటీఆర్ చెప్పారు. కవితకు కూడా బెయిల్ పిటిషన్ వేశామన్నారు. సోమవారం పిటిషన్ విచారణకు వస్తుందని తెలిపారు. కవితకు త్వరలోనే బెయిల్ వచ్చే అవకాశాలున్నాయన్నారు. న్యాయం అందడంలో ఆలస్యమైతే న్యాయం జరగనట్లేనని అన్నారు.

కవిత కస్టడీ పొడిగింపు


సీబీఐ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరీ బవేజా మరోసారి పొడిగించారు. కస్టడీ పూర్తి కావడంతో శుక్రవారం కోర్టు ముందు కవితను వర్చువల్‌గా హాజరుపర్చారు. సీబీఐ చార్జిషీటులో పేపర్లకు ఒకవైపు మాత్రమే పేజీ నంబర్లు వేశారని, దానివల్ల వాదనలు వినిపించడం కష్టంగా ఉందని కవిత తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దాన్ని సరి చేసి 14లోపు సమర్పిస్తామని సీబీఐ తెలపగా.. విచారణను న్యాయమూర్తి 21కి వాయిదా వేశారు.

శ్రీశైలానికి మరింత వరద..

» 3.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

» 4.13 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

» సాగర్ గేట్లన్నీ రెండో రోజూ ఓపెన్



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం ప్రాజెక్టుకు వరద మళ్లీ పెరుగుతోంది. శుక్రవారం డ్యాం సైట్ వద్ద 3,92,415 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా.. జూరాల, సుంకేశుల నుంచే 3,29,576 క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో పది గేట్లు ఎత్తి 3,50,110 క్యూసెక్కులను, తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 33,549 క్యూసెక్కులు, ఏపీ విద్యుదుత్పత్తి కోసం మరో 30,007 క్యూసెక్కులు.. మొత్తం 4.13 లక్షల క్యూసెక్కులకు పైగా దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు కూడా వరద ఉధృతి కొనసాగుతోంది. శుక్రవారం మొత్తం 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తూనే ఉన్నారు. గేట్ల నుంచి 2,57,918 క్యూసెక్కులు విడుదలవుతుండగా.. కుడి, ఎడమ కాల్వలు, జలవిద్యుదుత్పత్తికి అంతా కలసి మొత్తంగా 3,06,090 క్యూసెక్కులు విడుస్తున్నారు. బేసిన్‌లో ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపూర్‌లకు వరద తగ్గింది. ఆల్మటికి 2,06,500 క్యూసెక్కులు వస్తుండగా.. నారాయణపూర్‌కు 1,50,000 క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణపూర్ నుంచి 1,29,750 క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. జూరాల ప్రాజెక్టులోకి భీమా నది నుంచి 1,22,000 క్యూసెక్కులతో మొత్తం 2,96,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా.. అంతే స్థాయిలో దిగువకు వదులుతున్నారు.

జలవిద్యుదుత్పత్తితో రోజుకు రూ.14 కోట్లు

కృష్ణా ప్రాజెక్టులకు నిలకడగా చేరుతున్న వరద కాసులు కురిపిస్తోంది. బేసిన్ పరిధిలో ఉన్న జూరాల నుంచి పులిచింతల దాకా ప్రాజెక్టుల్లో ప్రతీరోజూ 3.7 కోట్ల యూనిట్ల కరెంట్ ఉత్పత్తవుతోంది. ఈ లెక్కన యూనిట్‌కు రూ.4 వేసుకున్నా రోజుకు రూ.14 కోట్ల లాభాన్ని జెన్‌కో గడిస్తోంది. అయితే నిర్లక్ష్యంతో పలు విద్యుత్తు కేంద్రాలను పూర్తిస్థాయిలో మరమ్మతు చేసుకోకపోవడంతో రోజుకు రూ.3 కోట్ల నష్టం వస్తోంది. ఇక ఈ సీజన్‌లో 522.76 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి అయింది.

అయ్యో పాపం.. పసికందు

2 రోజుల మృతశిశువును తీసుకొచ్చిన కుక్క

- వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో తీవ్ర కలకలం
- తమ ఆస్పత్రికి చెందిన బిడ్డ కాదన్న సూపరింటెండెంట్

వరంగల్ మెడికల్, ఆగస్టు 9: ఏ తల్లి కన్న బిడ్డోగానీ.. రెండు రోజుల నవ జాతి శిశును ఓ కుక్క నోటకరుచుకుని వచ్చిన ఘటన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో కలకలం సృష్టించింది. శుక్రవారం సాయంత్రం.. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ ఔట్‌పోస్టు వద్ద శిశువును నోటకరుచుకుని వస్తున్న శునకాన్ని గుర్తించిన ఔట్‌పోస్టు సిబ్బంది గట్టిగా కేకలు వేసి అదిలించారు. దీంతో ఆ కుక్క శిశువును అక్కడే వదిలేసి పారిపోయింది. అక్కడున్న సిబ్బంది పరిశీలించి.. అప్పటికే చనిపోయిన ఆ శిశువుకు ఒక కాలు లేదని గుర్తించారు. జననాంగ ప్రాంతమంతా ఛిద్రమై ఉండడంతో చలించిపోయారు. ఈ విషయం తెలుసుకున్న మట్టెవాడ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆ శిశువు ఎక్కడిది? ఎంజీఎం ఆసుపత్రిలో జన్మించిన శిశువా? లేక..ఆ కుక్క వేరొకచోట నుంచి తీసుకొచ్చిందా? బతికుండగానే దాడి చేసి, చంపి నోట కరుచుకుని వచ్చిందా?లేక.. ఎవరైనా వదిలేసిన బిడ్డను కుక్క నోటకరుచుకుని వచ్చే క్రమంలో ఆ పసికందు ప్రాణం పోయిందా? లేక ఎవరైనా ప్రాణం పోయిన శిశువును వదిలేస్తే ఆ మృతదేహాన్ని కుక్క పట్టుకొచ్చిందా? అనే కోణాల్లో విచారణ ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల ప్రజల్లో చాలామంది వైద్య సేవల కోసం ఎంజీఎం ఆసుపత్రికి వస్తుంటారు. అలా వచ్చిన వారిలో ఎవరైనా శిశువు మరణించి ఉంటే అక్కడ వేసి వెళ్లారా? అనే కోణంలో ప్రధానంగా దర్యాప్తుచేస్తున్నారు. అసలు ఆ శిశువు ఆడా, మగా అనేది కూడా తేలాల్సి ఉంది. శిశువుకు బొడ్డుతాడు కూడా ఉండటంతో రెండు మూడు రోజుల వయసు ఉండొచ్చని భావిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. శిశువు మృతదేహాన్ని ఫోరెన్సిక్, డీఎన్‌ఏ పరీక్షల కోసం మార్చురీకి తరలించినట్టు వారు వెల్లడించారు. కాగా, ఎంజీఎం నవజాత శిశు విభాగంలోగానీ, పిల్లల వార్డులోగానీ శిశువులు తప్పిపోయిన సంఘటన ఏదీ నమోదు కాలేదని ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి స్పష్టం చేశారు. శుక్రవారం శిశు మరణాలు కూడా జరగలేదని, కానీ ఎస్ఎన్‌సీయూ విభాగంలో గురువారం నాలుగు మరణాలు సంభవించగా.. ఆ శిశువుల మృతదేహాలను వారి కుటుంబసభ్యులు తీసుకెళ్లినట్టు చెప్పారు.

వీధి కుక్కల దాడి.. నాలుగేళ్ల బాలుడి మృతి

- 26 రోజులుగా ఆస్పత్రిలోనే.. రేబిస్‌తో మృత్యువాత


క్రియాన్స్ గౌడ్(ఫైల్)

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కలు ప్రాణాలు తోడేస్తున్నాయి. వీధి కుక్కల దాడిలో గాయపడిన ఓ నాలుగేళ్ల బాలుడు 26 రోజులు పాటు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి ప్రాణం వదిలాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోలు గ్రామంలో ఈ విషాదం జరిగింది. రాయపోలుకు చెందిన ఉడుగుల శివగౌడ్, మాధురి దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు క్రియాన్స్ గౌడ్(4) ఉన్నారు. క్రియాన్స్ స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. అయితే, జూలై 12న క్రియాన్స్ పాఠశాల వరండాలో ఉండగా వీధికుక్కలు దాడి చేశాయి. పాఠశాల సిబ్బంది అప్రమత్తమై క్రియాన్స్‌ను రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. చికిత్స కోసం క్రియాన్స్‌ను తొలుత హైదరాబాద్‌లోని ఫీవర్ ఆస్పత్రికి అక్కడ నుంచి నిలోఫర్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కామినేని ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, రేబిస్ సోకడంతో పరిస్థితి విషమించి గురువారం రాత్రి రియాన్స్ మరణించాడు.

చిన్న చిన్న పొరపాట్లతో

కొందరికి రుణమాఫీ కాలేదు

- వారంతా 15 తర్వాత అధికారులను కలవాలి
- ఈ సీజన్ నుంచే సన్న ధాన్యానికి 500 బోనస్: తుమ్మల

కోదాడ, ఆగస్టు 9: "చిన్న, చిన్న పొరపాట్లతో కొందరికి రుణమాఫీ కాలేదు. రుణమాఫీ కాని రైతులు ఈ నెల 15వ తేదీ తర్వాత వ్యవసాయాధికారులను కలిసి, సమస్యను వివరించాలి. వారు తప్పులు సరిచేసి అర్హులకు రుణమాఫీ అందేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. రూ.2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా కోదాడలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక సమస్యలతో పంట రుణాలు మాఫీ కాకపోతే లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణాలను మాఫీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సీజన్ నుంచే సన్న ధాన్యానికి రూ.500బోనస్ ఇస్తామన్నారు.

పారిశ్రామిక వాడలు, వైద్య కాలేజీలకు భూములు

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వాడల ఏర్పాటు, వైద్య కళాశాలల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ, ఖమ్మం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని సుమారు 103 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ శుక్రవారం జారీ చేశారు.

శ్రీచైతన్య సంస్థ ద్వారా నిపుణుల ఎంపిక

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : తమ సంస్థ నిర్వహించిన గురుకుల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రఖ్యాత విద్యాసంస్థల నుంచి 213 మంది నిపుణులను నియమించినట్టు శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. తమ కొత్త ఫ్యాకల్టీ సభ్యులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం ద్వారా జేఈఈ, నీట్, ఐఏఎస్ వంటి ప్రముఖ పరీక్షలకు ఉత్తమ శిక్షణను అందించేందుకు సిద్ధం చేశామని చెప్పారు. అత్యుత్తమ ఫ్యాకల్టీని ఎంపిక చేయడం ద్వారా విద్యార్థులకు అత్యున్నతమైన విద్యా అవకాశాలను అందించడమే కాకుండా, వారి శిక్షణ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడం, నూతన శిక్షణ పద్ధతులను అందించడం ద్వారా విద్యా రంగంలో నూతన మైలు రాళ్లను చేరుకోగలమని ఆమె వెల్లడించారు.

ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

వారి కోసం 17 వేల కోట్లకు పైగా బడ్జెట్.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో మంత్రి సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ, గిరిజన జాతులను అభివృద్ధి పథంలో నిలపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఎస్టీల సంక్షేమం కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో రూ.17 వేల కోట్లకు పైగా కేటాయించామని చెప్పారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కొమరం భీం ఆదివాసీ భవన్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు మంత్రి సీతక్క హాజరయ్యారు. ఆదివాసీ గూడేలకు అభివృద్ధి ఫలాలు అందినపుడే సమాజం పురోగమిస్తుందని ఈ సందర్భంగాన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీలకు అటవీ భూముల మీద హక్కులు కల్పిస్తూ అటవీ హక్కుల చట్టం తీసుకొస్తే.. దానికి తూట్లు పొడిచేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. గ్రామ సభల అనుమతులు లేకుండానే ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో మైనింగ్ చేసేలా కేంద్రం చట్ట సవరణ చేయడాన్ని ఆమె తప్పుబట్టారు. తనకు 8 మంది అక్కాచెల్లెళ్లు ఉన్నారని.. సీతక్క తొమ్మిదో సోదరి అని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ, గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.


కొమరం భీం ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

తెలంగాణ.. ఫ్యూచర్ స్టేట్

(మొదటిపేజీ తరువాయి)

సమకూర్చేందుకు అమెరికాలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి వివిధ కంపెనీల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. డాలస్, క్యాలిఫోర్నియా తదితర పట్టణాల్లో పర్యటించి రాబోయే దశాబ్ద కాలంలో ఫ్యూచర్ స్టేట్‌గా నిలవనున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. క్యాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. బిజినెస్' రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో టెక్ యూనీకార్న్ సీఈవోలను ఉద్దేశించి మాట్లాడారు. "అమెరికాలో నేను గమనించింది ఏమిటంటే.. ప్రతి రాష్ట్రానికీ ఒక ప్రత్యేక లక్ష్యం ఉంది. దాన్ని సూచించే ఒక నినాదం (ట్యాగ్‌లైన్) ఉంది. న్యూయార్క్ స్టేట్‌కి 'అపుటాఫ్ మెనీ.. వన్'.. టెక్సస్‌కు 'లోన్ స్టార్ స్టేట్'.. కాలిఫోర్నియాకు 'యురేకా' అనే నినాదాలున్నాయి. ఇవి నన్ను బాగా ఆకర్షించాయి. మన దేశంలో రాష్ట్రాలకు ఇటువంటి ప్రత్యేక నినాదాల్లేవు. తెలంగాణకు కూడా ఇలాంటి ట్యాగ్‌లైన్ ఒకటి పెట్టుకోవాలని అనిపించింది. మా లక్ష్యానికి అనుగుణంగా ఇక నుంచి తెలంగాణకు అటువంటి లక్ష్య నినాదం పెట్టుకుందాం. ఇకపై రాష్ట్రాన్ని 'తెలంగాణ.. ఫ్యూచర్ స్టేట్' అని పిలుద్దాం" అని పిలుపునిచ్చారు. హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా తమ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులతో రాష్ట్రానికి ఈ నినాదం పర్యాయపదంగా నిలుస్తుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ వంటి లక్ష్యాలు తమ ముందు ఉన్నాయన్నారు. అందుకే యూనీకార్న్ ప్రతినిధులంతా తెలంగాణకు రావాలని ఆహ్వానం పలికారు. "మా రాష్ట్రానికి రండి. మీ భవిష్యత్తును ఆవిష్కరించుకోండి. అందరం కలిసి సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం" అని పిలుపునిచ్చారు. అలాగే, తన పర్యటనలో భాగంగా అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన హైదరాబాద్ 4.0 సిటీ నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటు తదితర ప్రణాళికల్లో భాగస్వామి కావాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.


అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌తో సీఎం రేవంత్ రెడ్డి

మీకు మంచి ప్రతిఫలం

అమెరికాలో ఐటీ కంపెనీలు నడుపుతున్న వాళ్లు తెలంగాణకు వచ్చి పెట్టుబడులు పెట్టాలని, హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి డాలస్‌లో ఐటీ సర్వీస్ అలయన్స్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. "మీరు పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్తులో మంచి పెట్టుబడిగా మారుతుంది. ఎన్నో ఏళ్ల కష్టపడి చరిత్రాత్మక హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లను నిర్మించుకున్నాం. ఇప్పుడు మనమంతా కలిసి ప్రపంచ స్థాయిలో నాలుగో సిటీని తయారు చేసుకుందాం" అని పిలుపునిచ్చారు. అయితే.. అమెరికాలోని అన్ని ప్రతిష్ఠాత్మక ఐటీ కంపెనీల గొంతుకగా ఐటీ సర్వీసెస్ అలయన్స్ ఈ ఏడాది చివర్లో తమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అలయెన్స్ ప్రతినిధులు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని కూడా ఉత్సవాలకు హాజరు కావాలని ఆహ్వానించారు.

హైదరాబాద్‌లో ఆమ్జెన్ రిసెర్చ్ సెంటర్

అమెరికాలోని అతి పెద్ద బయో టెక్నాలజీ కంపెనీ ఆమ్జెన్ త్వరలో హైదరాబాద్‌లో కొత్తగా రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాన్ని ప్రారంభించనుంది. హైటెక్ సిటీలో దీనిని ప్రారంభించనుంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఆమ్జెన్ ఆర్ అండ్ డీ కేంద్రంలో కంపెనీ ఎండీ డేవిడ్ రీస్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ సోమ్ చటోపాధ్యాయ సమావేశమై ఈ నిర్ణయం ప్రకటించారు. ఈ ఏడాది చివరి త్రైమాసికం నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తామని చెప్పారు. రేవంత్ మాట్లాడుతూ.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆమ్జెన్ తమ ఆర్అండ్‌డి కేంద్రంగా హైదరాబాద్‌ను ఎంచుకోవటం గర్వించదగ్గ విషయమన్నారు. బయో టెక్నాలజీ రంగంలో హైదరాబాద్ ప్రాధాన్యం మరింత ఇనుమడిస్తుందని అభిప్రాయపడ్డారు. బయో టెక్నాలజీ రంగంలో తమ కంపెనీ 40 సంవత్సరాలుగా పని చేస్తోందని, వంద దేశాల్లో కార్యకలాపాలు విస్తరించి ప్రపంచంలోనే అగ్రగామి సంస్థగా గుర్తింపు సాధించామని ఆమ్జెన్ ఎండీ డాక్టర్ రీస్ అన్నారు.

గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటు..

రాజధానిలో దశలవారీగా రూ.3,350 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నామని, నెక్స్ట్ జనరేషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పవర్ గ్రీన్ డేటా సెంటర్‌ను నిర్మిస్తామని ఆరమ్ ఈక్విటీ పార్ట్‌నర్స్ సంస్థ ప్రకటించింది. సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబుతో ఆ సంస్థ సీఈవో, చైర్మన్ వెంకట్ బుస్సా భేటీ అయ్యారు. అనంతరం తెలంగాణలో విస్తరణ ప్రణాళికలతో పాటు భారీగా పెట్టుబడులను ప్రకటించారు. ఆరమ్ సంస్థ నిర్ణయంపై సీఎం రేవంత్ సంతోషం వ్యక్తం చేశారు. గ్రీన్‌డేటా సెంటర్ ఏర్పాటుతో రాష్ట్రంలో భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

పదేళ్లలో ట్రిలియన్ డాలర్ల స్థాయికి: మంత్రి శ్రీధర్ బాబు

రాబోయే పదేళ్లలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్ల (రూ.80లక్షల కోట్లు) స్థాయికి తీసుకుపోవాలని సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌ను పునర్నిర్మించే వ్యూహంతో ఉన్నామని వివరించారు. హైదరాబాద్ త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టెక్నాలజీ సెంటర్‌గా అవతరిస్తుందని చెప్పారు. టెక్ పరిశ్రమలకు తెలంగాణలో అనుకూల వాతావరణం ఉందని, యునికార్న్ ప్రతినిధులు హైదరాబాద్‌ను సందర్శించాలని ఆహ్వానించారు.

'ఉస్మానియా, గాంధీ'లో ఇంటర్వ్యూలు

కాంట్రాక్టు పద్ధతిలో పోస్టుల భర్తీకి నిర్వహణ

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో వివిధ కేటగిరీల్లో కాంట్రాక్టు పద్ధతిలో చేపట్టిన పోస్టుల భర్తీకి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉస్మానియాలో 175 ప్రొఫెసర్ పోస్టులకుగాను 651 దరఖాస్తులు వచ్చాయి. 572 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ విభాగంలో పాథాలజీలో 12 పోస్టులుండగా.. 58 మంది ఇంటర్వ్యూకు వచ్చారు. పిడియాట్రిక్ విభాగంలో 8 పోస్టులకు 41 మంది, జనరల్ సర్జరీలో 4 పిడియాట్రిక్ పోస్టులకుగాను 33 మంది, ఈఎన్‌టీలో ఒక పోస్టుకు 22 మంది, ఆప్తాల్మాజీలో 6 పోస్టులకు 32 మంది, ఆర్థోలో 4 పోస్టులకు 43 మంది, అనస్తీషియాలో 8 పోస్టులకు 45 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అన్ని విభాగాల్లో కలిపి ఉస్మానియాలో 111 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 440 మంది హాజరయ్యారు. కాగా, ఈ స్థాయిలో అభ్యర్థులు వస్తారని వైద్య శాఖ ఉన్నతాధికారులు కూడా ఊహించలేదు. ఇక గాంధీలో 60 పోస్టులకును 79 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3 ప్రొఫెసర్ పోస్టులు, 29 అసిస్టెంట్ ప్రొఫెసర్, 24 సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, 4 ట్యూటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగాయి. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ నేతృత్వంలో ఉస్మానియా ఆస్పత్రిలో.. గాంధీలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ వాణి ఆధ్వరంలో ఇంటర్వ్యూలు చేపట్టారు. 12న ప్రొవిజనల్ జాబితాను విడుదల చేయనున్నారు. 14న ఎంపికైన వారి జాబితాను విడుదల చేస్తారు.

విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ రైలు షెడ్యూల్ మార్పు


విశాఖపట్నం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడుస్తున్న వందే భారత్ రైలు (20833/34) షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేస్తున్నట్టు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. వివిధ సంఘాలు, వ్యాపారులు, ప్రయాణికుల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ఈ మార్పులు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ రైలు వారానికి ఆరు రోజులు నడుస్తోంది. ఆదివారం నిర్వహణ పనుల కోసం నిలిపివేస్తున్నారు. అయితే ఆదివారాల్లోనే ఎక్కువ మందికి దీని అవసరం ఉందని, ఆ రోజున నడపాలని సూచనలు రావడంతో డిసెంబరు 10 నుంచి ఆదివారం కూడా నడపాలని నిర్ణయించారు. అయితే ఆ రోజు నుంచి ఆదివారానికి బదులుగా మంగళవారం సర్వీసు నిలిపివేస్తామని వివరించారు.

ఆనాడు బ్రిటిషోళ్ల వలే

నేడు బీజేపీ పాలన

- క్విటిండియా ఉద్యమం వల్లే ప్రజలకు స్వేచ్ఛ
  బ్రిటిషోళ్లను మహాత్మాగాంధీ తరిమికొట్టారు
- నేడు రాహుల్ బీజేపీని తరిమికొడతారు: జగ్గారెడ్డి
- క్విటిండియా ఉద్యమ దినోత్సవం సందర్భంగా
  గాంధీభవన్‌లో కాంగ్రెస్ పతాకం ఆవిష్కరణ

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): క్విటిండియా ఉద్యమ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో శుక్రవారం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి.. కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అనాడు బ్రిటిష్‌వారు పరిపాలించినట్లుగానే ఈ నాడు బీజేపీ ప్రభుత్వ పాలన ఉందన్నారు. ఆనాడు దేశ స్వాతంత్ర్య కోసం మహాత్మాగాంధీ పోరాటం చేస్తే.. ఈనాడు దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారని పేర్కొన్నారు. దేశాన్ని 200 ఏళ్ల పాటు పాలించిన బ్రిటిష్ వారిని క్విటిండియా వంటి ఉద్యమాలతో మహాత్మాగాంధీ కాంగ్రెస్ తరిమికొట్టిందన్నారు. అదే బ్రిటిష్‌వారి తరహాలో ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న బీజేపీని.. తరిమికొట్టేది రాహుల్ గాంధీ కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. ఈ రోజున దేశ ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో ఉన్నారంటే.. ఆనాడు గాంధీ మొదలు పెట్టిన క్విట్ ఇండియా ఉద్యమ ఫలితమేనని చెప్పారు. గాంధీ మొదలు పెట్టిన ఈ ఉద్యమం ఉధృతమై చివరికి ఆగస్టు 15, 1947లో బ్రిటిష్‌వారు దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించి వెళ్లిపోవాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ నేతలు ఆనాడు రగిల్చిన ఉద్యమ స్ఫూర్తి.. ప్రజల్లో ఇప్పటికీ నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలను ఇప్పటికీ ప్రజలు నమ్ముతున్నారంటే ఆనాడు గాంధీ, నెహ్రూ, ఇందిర, రాజీవ్‌గాంధీ తదితరులు చేసిన త్యాగాలే కారణమన్నారు. ఈ త్యాగధనుల చరిత్రను ఈ తరం యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయితే నెహ్రూ, ఇందిరమ్మల చరిత్రను వక్రీకరించే పనిలో కొందరు ఉన్నారన్నారు. క్విటిండియా ఉద్యమ వ్యతిరేకులు.. ఈనాడు దేశాన్ని పాలిస్తున్నారని, ఆనాటి బ్రిటిష్ పాలకుల మాదిరిగానే కులం.. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. ప్రజలంతా అన్నదమ్ముల్లా కలిసుండాలన్నదే రాహుల్‌గాంధీ ఆలోచనన్నారు. అందుకే ఆయన భారత్ జోడో యాత్రను చేశారని గుర్తు చేశారు. సొంత ఆస్తులను ప్రజలకోసం దారాదత్తం చేసిన చరిత్ర రాహుల్‌గాంధీ కుటుంబానిదన్నారు. అలాంటి గాంధీకుటుంబంపైన మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. గాంధీ కుటుంబాన్ని రాజకీయంగా లేకుండా చేయాలని మోదీ ప్రయత్నిస్తే.. దేశ ప్రజలు రాహుల్‌గాంధీని ప్రధాన ప్రతిపక్ష నేతను చేసి కూర్చోపెట్టారన్నారు. ప్రజలు.. రాహుల్‌ను వచ్చే ఎన్నికల్లో ప్రధానమంత్రి పదవిలో కూర్చోబెడతారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలమంతా రాహుల్, సోనియా, మల్లికార్జున ఖర్గేల అడుగు జాడల్లో నడుస్తామన్నారు. టీపీసీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డితో పాటు టీపీసీసీ మాజీ కార్యని ర్వాహక అధ్యక్షుడు జెట్టి కుసుమ్‌కుమార్, సీనియర్ ఉపాధ్యక్షులు జి. నిరంజన్, కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, క్విటిండియా దినోత్సవం సందర్భంగా గాంధీ భవన్ నుంచి గన్‌పార్కు వరకు సేవాదళ్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని జగ్గారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.


గాంధీభవన్‌లో కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించిన జగ్గారెడ్డి



మత్తు దరిచేరనివ్వని.. బాల మిత్ర

బడి పిల్లలపై ఏఐ నిఘా నేత్రం.. మాదక ద్రవ్యాలకు అలవాటైతే పసిగట్టేలా యాప్ రూపకల్పన

- 20 స్కూళ్లలో పైలట్ ప్రాజెక్టుగా అమలు



హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మహానగరాలకు పరిమితమైన మత్తు మహమ్మారి ఇప్పుడు మారుమూల పల్లెలకూ పాకింది. గతంలో కళాశాల విద్యార్థులకే అంతంత మాత్రంగా దొరికే మాదక ద్రవ్యాలు.. ఇప్పుడు పాఠశాల విద్యార్థులకూ సులువుగా అందుబాటులో ఉంటున్నాయి. దీంతో వయసుతో సంబంధం లేకుండా బడి పిల్లలు కూడా మత్తుకు బానిసవుతున్నారు. గతంలో డ్రగ్స్ కేసు దర్యాప్తులో ఎక్సైజ్ శాఖ హైదరాబాద్‌లోని పలు పాఠశాలల్లో విద్యార్థులు నిషేధిత మత్తుపదార్థాలను వాడుతున్నట్లు గుర్తించింది. తాజాగా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) తనిఖీల్లోనూ ఇదే విషయం బట్టబయలైంది. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ శివారులోని షాద్‌నగర్ ప్రాంతంలో పాఠశాల విద్యార్థులు గంజాయి చాక్లెట్లకు బానిసలైన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. అయితే ఇలాంటి వాటిని ఆదిలోనే గుర్తించి అడ్డుకట్ట వేసేందుకు ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ(ఐటీ) శాఖ, టీజీ న్యాబ్ సంయుక్తంగా ఏఐ సాంకేతికతను వాడుకలోకి తెచ్చాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీతో అభివృద్ధి చేసిన 'మిత్ర' యాప్ ద్వారా విద్యార్థులు మత్తు వైపు అడుగులు వేస్తున్నారా..? లేదా..? అనేది గుర్తించే విధానాన్ని తీసుకొచ్చాయి. ఐటీ శాఖ నూతనంగా తెస్తున్న ఈ విధానానికి సంబంధించి అనేక కంపెనీలు పోటీపడినప్పటికీ యునైటెడ్ ఈ-శేర్ కంపెనీతో అధికారులు ఒప్పందం చేసుకున్నారు. పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని 20 పాఠశాలలను ఎంపిక చేసి 'మిత్ర' యాప్‌తో పరీక్షలు నిర్వహించి విజయవంతమయ్యారు. దీంతో ఈ విధానాన్ని తెలంగాణలో వీలైనంత ఎక్కువ స్కూళ్లలో అమలుచేసేందుకు సిద్ధమయ్యారు. ఐటీ, టీజీ న్యాబ్ సంస్థలు విద్యాశాఖతో ఒప్పందం చేసుకుని పని చేయనున్నాయి.

ఏమిటీ మిత్ర.. ఎలా పనిచేస్తుంది..?

మిత్ర యాప్‌ను పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. దీని ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు వాట్సా్‌ప్‌లో 13 ప్రశ్నలు పంపుతారు. ఉదాహరణకు.. మీ అబ్బాయి/అమ్మాయి గదిలో ఎక్కువ సమయం ఒంటరిగా ఉంటున్నారా? మగతగా ఉంటున్నారా? వారి ప్రవర్తనలో ఏదైనా మార్పు కనిపిస్తోందా? మాట్లాడే విధానం ఎలా ఉంది..? వారిలో అనూహ్యంగా వస్తున్న మార్పులు..? ఈ తరహా ప్రశ్నలు ఉంటాయి. తల్లిదండ్రులు ఇచ్చే సమాధానాల ఆధారంగా పిల్లలు మత్తుకు ఆకర్షితులయ్యారా..? లేదా..? అనేది తేలుస్తారు.

అత్యంత రహస్యం..

పిల్లలు మత్తుకు బానిసలయ్యారనే విషయం బయటకు తెలిస్తే ఏమవుతుందోననే భయం సాధారణంగా తల్లిదండ్రుల్లో ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు తీసుకునే దగ్గరి నుంచి వారిని ప్రశ్నించడం, పిల్లల పరిస్థితి ఎలా ఉందనే విషయాన్ని అంచనా వేసే వరకు ఎక్కడా వివరాలు బహిర్గతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. తల్లిదండ్రులు ఇచ్చే సమాచారంలో ఏదైనా తేడా ఉందని తేలితే.. వారి అనుమతితోనే రెండోదశలో పిల్లలు చదివే పాఠశాల, కళాశాల నిర్వాహకుల నుంచి ఇదే తరహాలో సమాధానాలు రాబడతారు. అక్కడా వివరాలు గోప్యంగా ఉంటాయి.

బీఆర్ఎస్ కక్కుర్తి వల్లే సుంకిశాల ప్రమాదం

పునర్నిర్మాణ ఖర్చు కాంట్రాక్ట్ సంస్థే భరిస్తుంది.. పూర్తి నివేదిక వచ్చాక చర్యలు: మంత్రి ఉత్తమ్

- డిజైన్ లోపం వల్లే ఘటన: తుమ్మల
- బీఆర్ఎస్ తొందరపాటు నిర్ణయం: గుత్తా

నాగార్జునసాగర్, ఆగస్టు 9: సుంకిశాల పంప్‌హౌస్ రక్షణ గోడ కూలడానికి బీఆర్ఎస్ కమీషన్ల కక్కుర్తే కారణమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని సుంకిశాల వద్ద నిర్మాణంలో ఉన్న పంప్‌హౌస్‌ను శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. రక్షణ గోడ కూలిన ఘటనపై ఇంజనీర్లతో చర్చించిన తర్వాత పంపుహౌస్ మ్యాపులను పరిశీలించారు. అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు ఇంకా నిర్మాణ దశలోనే ఉందని, నిర్మాణం పూర్తయ్యాక ప్రభుత్వానికి అప్పగించాల్సిన బాధ్యత కంపెనీదేనని, ఈ సమయంలో ఘటన జరగడం దురదృష్టకరమన్నారు.

రూ.10-15కోట్ల మేర పునర్నిర్మాణ ఖర్చును కాంట్రాక్టు సంస్థే భరిస్తుందని, ఈ విషయంలో ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమీ లేదని చెప్పారు. దీనిపై ప్రతిపక్షాలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాయని ధ్వజమెత్తారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే 2023 ఎన్నికలకు రెండేళ్ల ముందు పనులు మొదలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. 'సుంకిశాల' ఘటనపై నివేదిక వచ్చాక చర్యలు చేపడతామన్నారు. డిజైన్, నిర్మాణంలో లోపాల వల్లే సుంకిశాల పంపహౌస్‌లో ప్రమాదం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గత ప్రభుత్వ తొందరపాటు నిర్ణయాలతో నాణ్యత లేకుండా పనులు చేశారని, ఆ కారణంగానే ఇప్పుడు ప్రమాదం జరిగిందన్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్, అధికారులు, ఇంజనీర్లు తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకురాలేదని చెప్పారు. మీడియా దృష్టికి రాగానే సవివరంగా నివేదిక ఇవ్వాలని ఆదేశించామన్నారు. పనులు రెండు నెలలు ఆలస్యమైనా నాణ్యతతో చేయించి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 'సుంకిశాల' ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని, బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న తొందరపాటు నిర్ణయమే ఇందుకు కారణమని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఇక్కడ పెట్టే రూ.2,200 కోట్లు ఖర్చు పెడితే శ్రీశైలం నుంచి కూడా నీళ్లు వస్తాయన్నారు.


సుంకిశాల పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల నాగేశ్వరరావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

సుంకిశాల పాపం బీఆర్ఎస్‌దే: భట్టి

వైరా: సుంకిశాల పంపుహౌస్‌లో రక్షణ గోడ కూలిపోవడానికి గత బీఆర్ఎస్ సర్కారు అవినీతే కారణమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నీటి పారుదల వ్యవస్థను బీఆర్ఎస్ పాలకులు నాశనం చేశారని విమర్శించారు. ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో శుక్రవారం భట్టి విలేకరులతో మాట్లాడారు. సుంకిశాల ఘటన తర్వాత బీఆర్ఎస్ హయాంలో కృష్ణాపై చేపట్టిన ప్రాజెక్టుల నాణ్యతపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.





Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శనివారం 10 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com

జేఎన్‌టీయూహెచ్‌లో స్పాట్ అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్(డీయూఎఫ్ఆర్)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో విదేశీ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో సీట్లు అలాట్ చేస్తారు. ఎఫ్ఎన్/పీఐఓ/సీఐడబ్ల్యూజీ/ఎన్ఆర్ఐ కేటగిరీల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్దేశిత ఫీజులతో క్యాంపస్‌కు హాజరు కావాలి.

నాలుగేళ్ల బీటెక్ విభాగాలు-సీట్లు
- సీఎస్ఈ-ఏఐఎంఎల్ 6, సీఎస్ఈ-సైబర్ సెక్యూరిటీ 5, ఈసీఈ 4, ఈఈఈ 6, మెకానికల్ 6, సివిల్ 6, కెమికల్ 6, మెటలర్జీ 8, బయోటెక్నాలజీ 6, జియో ఇన్ఫర్మాటిక్స్ 8 సీట్లు చొప్పున మొత్తం 61 సీట్లు ఉన్నాయి.

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ విభాగాలు-సీట్లు
- సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగాల్లో ఒక్కోదానిలో 5 సీట్లు చొప్పున మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

మూడేళ్ల మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్-సీట్లు
- బీబీఏ ప్రోగ్రామ్‌లో 6 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం
- **వార్షిక ఫీజు:** బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లకు 3500 యూఎస్ డాలర్లు; బీబీఏ ప్రోగ్రామ్‌నకు 3000 యూఎస్ డాలర్లు; సార్క్ దేశాల అభ్యర్థులకు 50 శాతం రాయితీ వర్తిస్తుంది.
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** 200 యూఎస్ డాలర్లు
- **డెవలప్‌మెంట్ ఫీజు:** 1000 యూఎస్ డాలర్లు
- **స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 12 నుంచి
- **వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఫిల్మ్ డైరెక్షన్‌లో ఆన్‌లైన్ కోర్సు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్(సీఎఫ్ఓఎల్)- 'ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. మొత్తం 33 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

కోర్సు వివరాలు

కోర్సు వ్యవధి అయిదు రోజులు. ఆగస్టు 26 నుంచి కోర్సు ప్రారంభమౌతుంది. ప్రతి రోజూ ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు, మరల మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు సెషన్స్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. ఈ కోర్సులో సినిమా, లాంగ్వేజ్ ఆఫ్ సినిమా, స్పేస్ అండ్ టైమ్ ఆఫ్ సినిమా, ఫిల్మ్ ఫోరం, ఫిల్మ్ ఇమేజ్, ఫిల్మ్ సౌండ్, ఎలిమెంట్స్ ఆఫ్ స్టోరీ, స్క్రీన్‌ప్లే, వర్కింగ్ విత్ యాక్టర్స్, రోల్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్టర్ తదితర అంశాలు వివరిస్తారు. కనీసం 90 శాతం అటెండెన్స్ తప్పనిసరి. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసిన వారికి ఈ-సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.

అర్హత

పదోతరగతి/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. అభ్యర్థులు కనీసం 4 జీబీ ర్యామ్ గల డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్, విండోస్ 7/8/10 ఆపరేటింగ్ సిస్టమ్, ఆడియో-వీడియో సాఫ్ట్‌వేర్, హెడ్‌ఫోన్/ఇయర్‌ఫోన్, హెచ్‌డీ వెబ్ క్యామ్, రోజుకి కనీసం 5 జీబీ ఇంటర్నెట్ ప్యాక్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్ ఏర్పాటు చేసుకోవాలి.

ముఖ్య సమాచారం
- కోర్సు ఫీజు: రూ.3,900
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- వెబ్‌సైట్: ftii.ac.in



ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు
- డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.
- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.



అర్హత వివరాలు
- డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి.
లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్ల లోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్
- టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరిన వారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరిన వారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి/ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఆదాయ ధ్రువీకరణ పత్రం; సంబంధిత కోర్సులో అడ్మిషన్ పొందిన లెటర్; ట్యూషన్ ఫీజు రిసీట్; ఆధార్ లింక్‌తో ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్; ఐఎఫ్ఎస్‌సీ కోడ్; కుల ధ్రువీకరణ పత్రం; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 15
- **డీఎన్ఓ/ఎస్ఎన్ఓ/ఎంఎన్ఓ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** scholarships.gov.in



దామోదరం సంజీవయ్య వర్సిటీలో ఎల్ఎల్‌బీ

విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ(డీఎస్ఎన్ఎల్‌యూ)- ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. దీనికి 144 క్రెడిట్లు నిర్దేశించారు. సంస్థ నిర్వహించే ఆలిండియా ఎంట్రెన్స్ టెస్ట్(డీఈటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ప్రోగ్రామ్ వివరాలు
- ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూం టీచింగ్, ట్యుటోరియల్స్, ప్రాజెక్ట్‌లు, గ్రూప్ డిస్కషన్స్ సెమినార్ ప్రజంటేషన్స్, కోర్టు కాంపిటీషన్స్, పార్లమెంటరీ డిబేట్స్, సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు, వర్క్‌షాప్‌లు, క్విజ్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి.
- క్లాస్ టెస్ట్‌లు, కోర్టు అసైన్‌మెంట్లు, కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ అసైన్‌మెంట్స్, గ్రూప్ డిస్కషన్స్, మిడ్ సెమిస్టర్ ఎగ్జామ్స్, ఎండ్ సెమిస్టర్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు.
- అడ్వకేట్లు, లా సంస్థలు, జడ్జీల ఆధ్వర్యంలో సమ్మర్, వింటర్ ఇంటర్న్‌షిప్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

సీట్ల వివరాలు
- మొత్తం 138 సీట్లు ఉన్నాయి. ఏపీ స్టేట్ కోటా కింద 66 సీట్లు; ఆలిండియా కోటా కింద 54 సీట్లు; ఫారిన్ అభ్యర్థులు/ఎన్ఆర్ఐలు/ స్పాన్సర్డ్ ఎన్ఆర్ఐలకు 12 సీట్లు; కశ్మీరీ అభ్యర్థులకు 6 సీట్లు నిర్దేశించారు. ఏపీ స్టేట్ కోటా కింద సీట్లు మిగిలిన పక్షంలో డీఈటీ ర్యాంక్ ఆధారంగా ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు అలాట్ చేస్తారు.

అర్హత
- గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; బీసీ అభ్యర్థులకు 42 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. పీజీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ టెస్ట్
- దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో జనరల్ నాలెడ్జ్, లీగల్ ఆప్టిట్యూడ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.



ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,500; బీసీ/ఓబీసీ అభ్యర్థులకు రూ.2,200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 15
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 24
- **ఎంట్రెన్స్ టెస్ట్ సెంటర్:** డీఎస్ఎన్ఎల్‌యూ క్యాంపస్, విశాఖపట్నం
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** ఆగస్టు 25న
- **వెబ్‌సైట్:** www.dsnlu.ac.in

జాబ్ కార్నర్

పట్నా ఎయిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్స్

ఖాళీలు 76

పట్నాలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: సీనియర్ రెసిడెంట్

విభాగాలు: అనస్తీషియాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, మైక్రోబయాలజీ, డెర్మటాలజీ, న్యూరాలజీ, బయో కెమిస్ట్రీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, ఎమ్మెస్సీ, డీఎన్‌బీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500. ఎస్సీ/ఎస్టీ/అభ్యర్థులకు రూ.1200; ఎక్స్ సర్వీస్ మెన్/దివ్యాంగ/మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 19

రాత పరీక్ష: సెప్టెంబరు 2

వెబ్‌సైట్: https://aiimspatna.edu.in/advertisement/

వెస్ట్ సెంట్రల్ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 3,317

జబల్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)- వెస్ట్ సెంట్రల్ రైల్వే...డబ్ల్యూసీఆర్ పరిధిలోని డివిజన్/యూనిట్‌లలో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: యాక్ట్ అప్రెంటిస్

ఆర్ఆర్‌సీ డివిజన్/యూనిట్‌లు: జేబీపీ డివిజన్, బీపీఎల్ డివిజన్, కోటా డివిజన్, సీఆర్‌డబ్ల్యూఎస్ బీపీఎల్, డబ్ల్యూఆర్ఎస్ కోటా, హెచ్‌క్యూ/జేబీపీ

అర్హత: పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రేడ్‌లు: ఏసీ మెకానిక్, బుక్ బైండర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్‌మన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, హౌస్ కీపర్, మెషినిస్ట్, పెయింటర్, ప్లంబర్, స్టెనోగ్రాఫర్, సర్వేయర్, వెల్డర్, వైర్ మ్యాన్ తదితరాలు.

వయోపరిమితి: 2024 ఆగస్టు 5 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: పదో తరగతి, 12వ తరగతి, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.141. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.41.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: సెప్టెంబరు 4

వెబ్‌సైట్: https://wcr.indianrailways.gov.in/

యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్‌లో ఎమ్మెస్సీ సోషల్ నెట్‌వర్క్ అనాలిసిస్

ఇంగ్లాండ్‌లోని ద యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్... ఎమ్మెస్సీ సోషల్ నెట్‌వర్క్ అనాలిసిస్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2024 సెప్టెంబరు నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. https://www. manchester.ac.uk/

ఇది ఏడాది వ్యవధి గల కోర్సు. ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తిచేసిన వారికి మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎమ్మెస్సీ) డిగ్రీ ఇన్ సోషల్ నెట్‌వర్క్ అనాలిసిస్ పట్టాను యూనివర్సిటీ ప్రదానం చేస్తుంది. సోషల్ సైన్సెస్‌లో భాగంగా నిర్వహించే ఈ కోర్సు కరికులమ్‌ని థియరీస్, మెథడాలజీస్, అప్లికేషన్స్‌తో రూపొందించారు.

అర్హతలు
- సోషల్ సైన్సెస్/మేథమెటిక్స్/ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ విత్ ఆనర్స్ ఉత్తీర్ణత లేదా తత్సమానమైన విదేశీ విద్యలో ఉత్తీర్ణత.
- ఐఈఎల్‌టీఎస్ అకడమిక్ టెస్ట్ మొత్తం స్కోరు 7 ఉండాలి.
- టోఫెల్ ఐబీటీ స్కోరు మొత్తం 100కు తగ్గకూడదు.
- పియర్‌సన్ టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్(పీటీఈ) మొత్తం స్కోరు 76కు తగ్గకూడదు.
- **ప్రీ-సీజనల్ ఇంగ్లీష్ కోర్స్:** పైన పేర్కొన్న స్కోరు కంటే తక్కువగా ఉన్న అభ్యర్థులు కోర్సు ప్రారంభం అయ్యే కంటే ముందు మాంచెస్టర్ యూనిర్సిటీ నిర్వహించే ప్రీ-సీజనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఐఈఎల్‌టీఎస్ మొత్తం స్కోరు 6.5 ఉన్నవారు 6 వారాల ప్రీ సీజనల్ కోర్సును, 6.0 స్కోరు ఉన్న వారు 10 వారాల కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది.

ట్యూషన్ ఫీజు: 2024 సెప్టెంబరు నుంచి ప్రారంభమయ్యే కోర్సు ఫీజు ఏడాదికి 24,500 పౌండ్లు.

స్కాలర్‌షిప్స్

కోర్సులో ప్రవేశం లభించిన వారికి స్కాలర్‌షిప్స్ లభిస్తాయి.
- హ్యూమానిటీస్ బైసెంటనరీ స్కాలర్‌షిప్. ఏడాదికి 10,000 పౌండ్లు చెల్లిస్తారు.
- ద మాంచెస్టర్ అలూమ్ని స్కాలర్‌షిప్ స్కీమ్
- కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్స్ అండ్ ఫెలోషిప్స్ ప్లాన్ (సీఎస్ఎఫ్‌పీ) జనరల్ స్కాలర్‌షిప్

ఇవే కాకుండా ఇండియాలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులైన అభ్యర్థులకు వివిధ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తున్నాయి.
- రాజీవ్‌గాంధీ స్కాలర్‌షిప్ ఫర్ అకడమిక్ ఎక్సలెన్స్(రాజస్థాన్)
- నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్కీమ్
- మారంగ్ గోమ్కే జైపాల్ ముండా ఓవర్సీస్ స్కాలర్‌షిప్(జార్ఖండ్)

చిట్టిస్


చిన్న కప్ప అజాగ్రత్త

అనగనగా ఒక ఊరిలో ఒక పెద్ద చేదబావిలో కొన్ని కప్పలు నివసిస్తూ ఉండేవి. వాటిలో ఒక తల్లి కప్ప తన పిల్లను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటూ ఉండేది. చిన్న కప్పకు బావి బయటకు వెళ్లి చుట్టూ ఉన్న ప్రపంచం ఎలా ఉందో చూడాలని ఉండేది. తల్లి కప్ప 'బయట చాలా ప్రమాదాలు ఉంటాయి బయటకు వెళ్లకూడదు' అని ఆపుతూ ఉండేది. ఓ రోజు ఆ బావి దగ్గరకు నీళ్ల కోసం వచ్చిన ఒకావిడ బిందెను బావిలోకి జార విడిచింది. చిన్న కప్ప తన పక్కనే ఉన్న మిగతా కప్పలు ఎంత చెప్పినా వినకుండా, బయటకు పోయి చూడాలన్న ఆతృతతో ఆ బిందెలోకి వెళ్లిపోయింది. బిందెను పైకి తీసుకున్న ఆవిడ నీటిలో కప్పను గమనించి, ఆ నీటినికింద పారబోసింది. కప్ప ఆ నీటితో పాటుకింద పడిపోయి, చుట్టూ ఉన్న చెట్లు, పొదలను పువ్వులను ఆకాశాన్ని ఆనందంగా చూడసాగింది. ఈ లోగాఆ పొదల్లోకి, ఒక పెద్దపాము వచ్చి, కప్పనుచూసింది. ఇంకేముంది? పామునుచూసి, గడగడా వణికిన కప్ప అలాగే గెంతుకుంటూ వెళ్లి, తనబావిలో దూకేసింది దానిని చూసిన కప్ప తల్లి, మిగతా కప్పలు చిన్నకప్పతో చూసావా వద్దంటే బయటకు వెళితే ప్రమాదాలు ఎలా ఉంటాయో?అన్నాయి.'నిజమే మరోసారి ఒంటరిగ ఎక్కడికీ వెళ్లను అమ్మా'అని ఏడ్చి బుద్ధి తెచ్చుకుంది చిన్న కప్ప.





10 తేడాలను కనుక్కోండి



దారి కనుక్కోండి



ఎన్ని చేపలు ఉన్నాయి?



సరైన నీడను జత పరచండి

డైలీ సుడోకు - 380

3	2		
	1		
		3	
		4	1

సుడోకు - 379 సమాధానం

3	5	4	6	2	1
1	2	6	3	4	5
5	4	3	1	6	2
2	6	1	4	5	3
4	1	2	5	3	6
6	3	5	2	1	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.